# వాసుదాస కీర్తనలు

**ఆంధ్రవాల్మీకి**

**శ్రీ వాసుదాసస్వామి విరచితము**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2024**

# VASUDASA KEERTHANALU

*by*
**Sri Vasudasa Swamy**

*Editor*
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer,
Publications Division

T.T.D. Religious Publications Series No. 1491
© All Rights Reserved

*First Edition : 2024*

*Copies :* 200

*Published by*
**Sri J.SYAMALA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507





# ముందుమాట

సృష్టిలో కొందరు మహనీయులు భగవంతుని ఆదేశానుసారం ఈ భూమి పై జన్మించి పుణ్యకార్యములు చేసి తిరిగి ఉత్తమలోకాల్ని చేరుకుంటారు. అట్టివారిని కారణజన్ములు అంటారు. ఆంధ్రదేశంలో వాసుదాసుగా ఖ్యాతిగాంచిన శ్రీవావిలికొలను సుబ్బారావుగారు ఈ కోవకు చెందిన మహనీయులు. వీరు 1863 జన్మించి 1939లో పరమపదించారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా బాధ్యతలు నిర్వహించిన శ్రీవావిలికొలను సుబ్బారావుగారు తమ వృత్తిని త్యజించి ఒంటిమిట్ట కోదండరాముని కొలువుకు చేరి, తమ జీవిత సర్వస్వాన్ని కోదండరామునిసేవకే అంకితం చేశారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులో అనువదించి, మందర వ్యాఖ్యానంతో అందించారు. కోదండరాముని కీర్తిస్తూ అనేక రచనలను వెలువరించారు. అంతేకాక సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు అవసరమైన అనేక నీతులను బోధిస్తూ హితచర్యల రూపంలో, ఆర్యకథానిధుల రూపంలో గ్రంథాలను వెలువరించారు.

శ్రీమదొంటిమిట్ట కోదండరాముని గుణగణాలను కీర్తిస్తూ అనేక కీర్తనలను కూడా రచించారు. భజన సంప్రదాయంలో ఈనాటికీ ఈ కీర్తనలు వాసుదాస కీర్తనలుగా, భక్తుల నాలుకలపై నర్తిస్తున్నాయి.

శ్రీమదొంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానముల అధీనంలోకి వచ్చిన తర్వాత వాసుదాసుగారి రచనలను తి.తి.దేవస్థానములు ముద్రించి భక్తలోకానికి అందించదలచింది. ఈ రచనల్లోని భాష సరళ గ్రాంథికంలో ఉన్నందున ఇందులోని సారాంశాన్ని

ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ప్రఖ్యాత విద్వాంసులచే పీఠికల రూపంలో వ్రాయించి వాటికి జోడించి ముద్రిస్తున్నది. ఈ ప్రణాళికలో భాగంగా "వాసుదాస కీర్తనలు" అనే ఈ గ్రంథాన్ని భక్తలోకానికి అందిస్తున్నాం. ఇందులో గణపతి, లక్ష్మీ, సరస్వతి, పార్వతి మున్నగు దేవతలను ప్రార్థిస్తున్న 98 కీర్తనలు, ప్రభాత సేవకు చెందిన 13 కీర్తనలు, ఏకాంతసేవకు చెందిన 17 కీర్తనలతో కలిపి 128 సంకీర్తనలు ఉన్నాయి. ఈ గ్రంథానికి డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్యగారు చక్కటి పీఠికను అందించారు. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ గ్రంథాన్ని ముద్రింపజేయడంలో విశేషంగా కృషిచేసిన ప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి అభినందనలు.

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

## వాసుదాస భక్తి సంగీత వరివస్య

సృష్టిలో కొందరు మహనీయలు కారణజన్ములైన లీలామానుష మూర్తులై పుడమిపై ప్రభవించి వారు వచ్చిన లక్ష్యం సంపూర్ణమవగానే దైవాజ్ఞ యయినపుడు స్వస్థలమున కేగుచుందురు. పూర్వము సుమారు ఐదువందల సంవత్సరములనాడు శ్రీ బమ్మెర పోతనామాత్యుడై యవతరించి శ్రీ భాగవతమును భక్తి రసోపేతముగా తెనిగించి మహిమను లోకమున ప్రకటించి యేగిన మహిమాన్వితుడే, మరలా వాసుదాసుడై యవతరించి శ్రీరామాయణమును తెనిగించి, లోకోద్ధరణ మొనరించి అన్వర్థ నామధేయుడైన శ్రీ వావిలికొలను సుబ్బారావు గారే వాసుదాసుగా ఆంధ్ర దేశాన సుప్రసిద్ధులు.

శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు ఆంధ్రదేశములోని కడప జిల్లా జమ్మలమడుగు నందు దుందుభినామ సంవత్సరం మాఘ శుద్ధ చతుర్థశి, 23-1-1863 నాడు జన్మించారు. వారి పూర్వీకులది నైజాము రాజ్యమందలి వావిలికొలను గ్రామము. శ్రీ సుబ్బారావుగారికి పితృవియోగం 12 వ ఏట సంభవించింది. పిమ్మట పినతండ్రి లక్ష్మాజీరావు సంరక్షణలో పెరిగారు. వారు వీరికి విద్యను చెప్పించి పెద్ద చేశారు. సుబ్బారావుగారు సంస్కృతములో వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణమును, తెలుగులో యధాతథంగా అనువదించడంవల్ల వీరికి “ఆంధ్రవాల్మీకి” అనే బిరుదు లభించినది. ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానమునకు అనేక సేవలందించడం వలన “వాసుదాసు” గా సుప్రసిద్ధులయ్యారు. శ్రీవాసుదాసుగారు రచించిన ఈ కీర్తనల సంపుటిని పరిశీలించే ముందు, పరమ రామభక్తులైన వారి చరిత్రను రేఖామాత్రంగా పరిశీలించవలసి యున్నది.

సుబ్బారావుగారు పుట్టుకతో తీవ్రమైన ఉబ్బసవ్యాధి ఉండడం వలన పై చదువులు చదవడానికి ఆటంకం కలిగినప్పటికి పట్టుదలతో ఎఫ్.ఎ

(ఫెలో ఆఫ్ ఆర్ట్స్) పూర్తిచేశారు. సంస్కృత కావ్యాలన్నీ చదివి ఆకళింపుచేసుకుని తమ దృష్టిని సాహిత్యం వైపు మళ్ళించారు. వాసుదాసుగారిలో ఉన్న సహజ పాండిత్యం మహాపండితులు కందాళం రాసాచార్యులు ప్రోత్సాహంతో కావ్యరచనకు నడుంకట్టారు. "ఉద్యోగినం పురుష సింహముపైతి లక్ష్మీః, దైవేన దేయమితి కాపురుషా వదంతి" అన్న చందాన పొట్టకూటికై మొదట్లో కలెక్టరు ఆఫీసులో నెలకు రూ. 7 ల ఉద్యోగంలో చేరారు. ఆ తరువాత కందుకూరు మండలానికి రెవెన్యూ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టేనాటికి ఆయనకు 25 సంవత్సరాలు. ఆ వయసులో "శ్రీకుమారాభ్యుదయం" అనే కావ్యాన్ని రచించారు.

రెవెన్యూ అధికారిగా వీరు పదకొండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన రోజులలో పినతండ్రి మాటకు ఎదురు చెప్పకుండా రంగనాయకమ్మ అనే అవిటి స్త్రీని వివాహం చేసుకున్నారు. వీరు రాసిన శ్రీకుమారాభ్యుదయం కావ్యాన్ని ఎవరో రాసినది అని అన్న అపవాదు రాగా, నెల్లూరు రంగనాయక స్వామిపై ఆశువుగా ఒక శతకం చెప్పి ఆ అపవాదును పోగొట్టుకున్నారు. ఆ సమయములో నన్నెసాహెబ్ అనే వ్యక్తి యునాని వైద్యంతో సుబ్బారావు ఉబ్బస వ్యాధిని నయం చేశాడు. ఆరోగ్యం కుదుటపడడం వలన మదరాసు నగరంలో హిందూ హైస్కూల్లో తెలుగు పండితునిగా చేరారు. తరువాత కందుకూరి వీరేశలింగంగారి తర్వాత ప్రెసిడెన్సీ కళాశాలలో 16 సం.లు ఆంధ్రోపన్యాసకునిగా పనిచేశారు. ఆ సమయములో 1894 సం.లో "కౌసల్యా పరిణయం" అనే కావ్యాన్ని రచించగా 1902 సం.లో అచ్చుపడింది.

1908 సం.లో "ఆంధ్రవాల్మీకి రామాయణం" రచించి ఒంటిమిట్ట కోదండరామ స్వామికి అంకితం యిచ్చారు. రామాయణం గ్రంథాన్ని 108 సార్లు పారాయణం చేసి దానికి సమగ్ర వ్యాఖ్య రాయాలని సంకల్పించి 1934–36 సం.లలో తన 69 సం.ల వయసులో 8 వేల

పేజీలతో "మందర" అనే విపుల వ్యాఖ్యను రచించారు. రామాయణ పారాయణం 108 సార్లు చేసి అచ్చుటి సీతమ్మవారికి 108 తాళిబొట్లతో ఉన్న ఒక హారాన్ని సమర్పించారు. 1927 సం.లో "కోదండరామ సేవక సమాజము" ను స్థాపించి, 1929లో "భక్తి సంజీవని", "బ్రహ్మ విద్య" అనే మాసపత్రికలను ప్రారంభించారు. 1930 సం.నుండి భద్రాచలములో వలె ఒంటిమిట్టలోని కోదండరామ స్వామికి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలను జరపడం ఆరంభించారు.

శ్రీవాసుదాసుగారి రచనలను తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. బమ్మెర పోతన తన భాగవతంలో "పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట" అని చెప్పుకున్నట్లు వాసుదాసు కూడా తన కౌసల్యా పరిణయం కావ్యంలో "కారయిత రాముడట సత్సారమతి శ్రోతరామచంద్రుడట, నా నేర్మి నేరంబగునే? కారాకూరంబు యేల కడగెద గృతికి" అని చెప్పుకున్నాడు. ఈ పద్యం ద్వారా తను దైవకృపచే కావ్యాన్ని రచించానని చెప్పుకున్నారు. వాసుదాసు రచనలను మనం అంశాలవారీగా విభజన చేసి చూసినట్లైతే అవి కావ్యాలు, వ్యాఖ్యలు, ఆర్యకథానిధి, హితచర్యలు, నిత్యచర్యలు, చిల్లరలు, మాహాత్మ్యాలు అనే విభాగాలకు చెందినవిగా ఉన్నాయి.

కావ్యాలుగా శ్రీకుమారాభ్యుదయం, కౌసల్యా పరిణయము, ఆంధ్ర వాల్మీకి రామాయణము, సుభద్రా విజయము రచించారు. వ్యాఖ్యలుగా అష్టశ్లోకీ వివరణ, ప్రమేయ రత్నావళి, మందర అనే గ్రంధాలు రచించారు. ఆర్యకథానిధి పేరుతో సావిత్రి చరిత్ర, వామన చరిత్ర, శకుంతల చరిత్ర, రుక్మాంగద చరిత్ర, హనుమంతుని చరిత్ర, రుక్మిణీ చరిత్ర, సీతాదేవి చరిత్ర, హరిశ్చంద్ర చరిత్ర, నల చరిత్ర, సుభద్రావిజయం అనునవి రచించారు. హితచర్యలు విభాగం క్రింద గర్భిణీ హిత చర్య, కుమార హితచర్య వంటి ఎనిమిది గ్రంధాలు రచించారు. నిత్య చర్యలు విభాగం

క్రింద భక్త నిత్య చర్యలు అనే రెండు సోపానాలు, చిల్లరలు అనే విభాగం క్రింద వాసుదాసు కీర్తనలు రెండు భాగాలు, కృష్ణావతార తత్త్వం 10 సంపుటాలు, రామావతార తత్త్వం 10 సంపుటాలు, మేలుకొలుపులు, గేయ రామాయణం, ఇంకా 29 గ్రంథాలు ఈ కోవకు చెందిన రచనలున్నాయి. మాహాత్మ్యాలుగా శ్రీరామనామ మాహాత్మ్యము, శ్రీకోదండరామ మహాత్యము, భాగవత మాహాత్మ్యము అనే మూడు గ్రంధాలు రచించారు. ఈ విధంగా వాసుదాసుగారు శతాధిక గ్రంథకర్తగా పేరుబొందారు. దాసుగారు సజీవమైన ఆధ్యాత్మిక దృష్టితో, నిర్జీవమైన యాంత్రిక విధానంలో జీవించి తన కావ్యంలో చిత్తశుద్ధి, కార్య శుద్ధి, భక్తిప్రపత్తులను, కావ్య నైపుణ్యం, ప్రతిభ అన్నీ కలిపి ఆంధ్రులకు ఒక మహత్తరమైన సందేశాన్ని తన గ్రంధాల ద్వారా అందించారు.

ఇక వాసుదాస కీర్తనల్లోని విశేషాలను పరిశీలిద్దాం.

**"వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే**
**వాచం గేయం చ కురుతే యఃస వాగ్గేయకారః"**

అని శారఙ్గదేవుడు సంగీత రత్నాకరంలో వాగ్గేయకారుని లక్షణాలను నిర్వచించాడు. గేయంలోని మాటల కూర్పు మాతువనీ, మాటలకూర్పు నుండి వేరుచేసిన సంగీత కూర్పును ధాతువనీ అంటారనీ, వాక్కునూ, గేయాన్ని అంటే మాటలకూర్పును, సంగీతపు వరుసనూ – రెండింటినీ చేయగలవాడు వాగ్గేయకారుడని భావం. తెలుగు వాగ్గేయకారుల్లో తాళ్ళపాక కవులు, భక్త రామదాసు, క్షేత్రయ్య, శివనారాయణతీర్థులు, త్యాగరాజుల తర్వాత ఆ కోవలో నిలుపదగినవారిలో వాసుదాసు ముఖ్యులు. కొన్ని కీర్తనలు భక్త రామదాసు, అల్లూరి వేంకటాద్రి స్వామి వంటి వాగ్గేయకారుల బాణీలను అనుసరించి రచించినట్లు అనిపించినప్పటికీ, ఆ అనుసరణ కేవలము బాణీలు, రాగాల వంటి విషయములోనే తప్ప సాహిత్య విషయంలో వాసుదాసు సర్వ స్వతంత్రుడు.

శ్రీరామునికి త్రికరణశుద్ధిగా దాసానుదాసుడైన వాడనడంలో యెట్టి సందేహం లేదు.

**"భృత్యో దాసేర, దాసేయ, దాస గోప్యక చేటకా**
**నియోజ్య - కింకర ప్రేష్య భుజిష్య పరిచారికా"**

అని అమరకోశంలో చెప్పిన విధంగా భృత్యుడు, దాసేరుడు, దాసుడు, గోప్యకుడు, చేటకుడు, నియోజ్యుడు, కింకరుడు, ప్రేష్యుడు, భుజిష్యుడు, పరిచారకుడు అనే పదకొండు పేర్లు పరిచర్యలు చేసే భక్తులకు పర్యాయపదాలుగా చెప్పబడ్డాయి. వీనిలో "దాసః" అనే పదం చాలా విశిష్టమైనది. "దంసయతే స్వామి కార్యాణి సావధానే నేతి దాసః" అంటే అహంకార, మమకారాలు ఏమాత్రం లేకుండా, ఆలోచనా శీలిగా ఉంటూ స్వామి కార్యాలను స్వయంగా చూసేవాడు దాసుడు అని చెప్పబడుతున్నది. శ్రవణము, కీర్తనము ఇత్యాది నవవిధ భక్తులలో దాస్యము ప్రధానమైనది. దానిని అవలంబించిన వారే దాసులు. శ్రీరాముని సేవ కొరకు తన జీవితాన్నే అంకితం చేసిన వాసుదాసు విషయంలో ఈ "దాసు" అన్న నామం నూటికి నూరుపాళ్ళు పొసగుతుంది.

సాహిత్య దృష్ట్యా చూస్తే భక్తి అనేది ఒక భావమా? లేక రసమా? అనే విషయంలో ఆలంకారికుల్లో భిన్నాభిప్రాయాలున్నట్టు అనిపిస్తుంది. భరతుడు భక్తిని ఒక రసంగా పరిగణించలేదు. "భక్తి దేవతా విషయకమైన రతి" కనుక భక్తి రసం కాదు భావం మాత్రమే అని ధనంజయుడు అన్నాడు. మమ్మటుడు కూడా భక్తిని భావమే అన్నాడు. అయితే అభినవ గుప్తుడు మాత్రమే భక్తిని శాంత రసంలో అంతర్లీనం చేశాడు. సంస్కృత ఆలంకారికుల అభిప్రాయాలెలా ఉన్నప్పటికీ, మనం లోకం దృష్టితో పరిశీలిస్తే, జీవులు జీవన్మరణ చక్రంలో బంధింపబడకుండా, వారిని మోక్షగాములుగా తీర్చిదిద్దే భక్తిని ఒక "రసం" గా భావించడమే సమంజసం అనిపిస్తుంది.

సాహిత్యం కంటే సంగీతానికి అధిక ప్రాధాన్యత యిచ్చినవాడు త్యాగరాజు కాగా, దక్షిణాపథంలో భజన సాంప్రదాయానికి పునాదులు వేసి, భజనలలో పాడుకోవడానికి వీలైన కీర్తనల ప్రక్రియకు రామదాసు ఆద్యుడు. వాసుదాసు కూడా వారి పద్ధతిని అనుసరించిన వారే! అనుభవం వ్యక్తినిష్టమైనది. కవి తన అనుభవం నుండి వెలువరించే భావాలు కూడా వ్యక్తిగతమైనవి. "స్వాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా" అని నారద భక్తి సూత్రాల్లో చెప్పిన విధంగా భగవంతుని యెడ పరమ ప్రేమ స్వరూపమే భక్తి. వాసుదాసుగారు అనుభవకవి. ఆయన కీర్తనలు జీవన చిత్రణకు ఉపకరణాలుగా ఉన్నాయి. రామనామం మోక్షసాధనకు సులభ మార్గం. రుచికరమైనది కూడా! కనుకనే త్యాగయ్య, రామదాసు, వాసుదాసు వంటి వాగ్గేయకారులు భక్తితో సుందర సుభోదకమైన తీయని తేట తెలుగు భాషలో సంకీర్తనలు రచించారు

వాసుదాసుగారు గతంలో రెండు సంపుటులుగా రచించిన కీర్తనలను, ప్రస్తుతం తి.తి.దే వారు ఒకే సంపుటంగా కలిపి తీసుకొని వస్తున్నారు. రెండు సంపుటులలోని కీర్తనలను ఒక క్రమ పద్ధతిలో నేర్పరిచి గాయకులకు ఒక మంచి దోవ జూపించినారు. ఇందులో మొత్తం 128 కీర్తనలున్నాయి. మొదటగా ప్రార్ధనల విభాగం క్రింద 69 కీర్తనలు, ప్రభాతసేవ విభాగం క్రింద 13 కీర్తనలు, ప్రభుత్వ సేవ విభాగంలో 29 కీర్తనలు, ఏకాంతసేవ విభాగం క్రింద 17 కీర్తనలు ఉన్నాయి. "వాసుదాసు" ముద్రతో అధిక సంఖ్యలో కీర్తనలు సాగినప్పటికి, "వావిలికొలను సుబ్బార్య" అని, "వావిలికొలను సుబ్బడు" అనే ముద్రలతో కొన్ని కీర్తనలున్నవి.

దివ్యనామ స్మరణం కీర్తనల్లో ప్రత్యేకమైనది. దాసుడైన భక్తుడు భగవంతుని నామమే ప్రియమైనదని నమ్మి చెప్పడం విశేషం. గొప్ప మహిమాన్విత శబ్ద భవం దివ్యనామం. నామస్మరణే పాపహరణం.

నామం ఒక మూర్తిమత్త్వం. బాహ్యాంతరాల శుద్ధి, గుణరూప వర్ణనలకు నామం ప్రతీకగా నిలుస్తుంది. ఇది దాస భక్తికి నిదర్శనం. ఈ దాసభక్తిని త్రికరణశుద్ధిగా నమ్మిన పరమ భాగవతోత్తముడు శ్రీవాసుదాసు.

**"స్మరణమె పరమతపము – శ్రీరాముల**
**చరణాంబువులె యమృతము**
**ధరణిజా శ్రీరామ – వరపూజ యజ్ఞము**
**ధర జ్ఞాన భక్తి ప్రదానమే దానము" (11వ కీర్తన)**

– ఈ కీర్తనలో వాసుదాసు నామస్మరణమే దివ్యమైనదని, పరమ తపస్సు వంటిదని, శ్రీరాముని చరణాంబువులు అమృతతుల్యమని, స్మరణమే యజ్ఞమని, జ్ఞానము, భక్తిని ఇవ్వడమే ప్రకృష్ట దానమని కీర్తిస్తాడు. భక్తికి ప్రధానంగా నిలిచినవి నవవిధ భక్తులు. విశిష్టాద్వైతంలో ఇవి విశేష భక్తి భావాలను కలిగి ఉన్నాయి. ఇవి భక్తికి ప్రేరకాలు. భాగవతంలో చెప్పబడిన నవవిధ భక్తులు మోక్షపథ సోపానాలని నిండుమనసుతో నమ్మిన వాడు వాసుదాసు.

**"శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాద సేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం"**

మోక్ష సాధనాలుగా కర్మ, జ్ఞాన భక్తిమార్గాలు భక్తునికి నిర్దేశ సూత్రాలు. వీటిలో భక్తి అత్యంత సులభ శైలిని వహిస్తుంది. వాసుదాసు భక్తిని అవలోకిస్తే జ్ఞాన జిజ్ఞాశువు వలె అవస్థాస్థితిని, అభేద స్థితిని, కాల అభేదాన్ని కలిగి ఉంది. జ్ఞానాన్ని భక్తిలో ప్రేరేపించడం వాసుదాసు కీర్తనల్లో ఋజువైంది. నవవిధ భక్తులు ప్రతిపాదించిన వాసుదాసు కీర్తనలను కొన్ని గమనిద్దాం.

**శ్రవణం :** "రాముం గనవె చెలి – నందనున్ బలరాముంగనవె చెలి సుందరునున్, రాముం ద్రిజగదభి – రామున్ శ్రీపర ధాముం

దనుజకుల విరామున్ రమాహృదయ ధామున్" (కీర్తన 18) అంటాడు. ఈ కీర్తనలో దివ్యసుందరుడైన శ్రీరాముని, ముల్లోకాలకు అధిపతియైన శ్రీరాముని, రాక్ష సంహారుడైన శ్రీరాముని కని, ఆతని చరిత్రలు వినండి అని పిలుస్తున్నాడు వాసుదాసు. అలాగే "ఇది వినరా నరుడా / జీవా - మేలొందెదీవు, ఇది విను హితమును - ముదమున మేలొందెదవు, వదలకు శ్రీహరి - పాదములనెపుడైన" (కీర్తన-60) అంటాడు. ఓ నరుడా! నామాట వినండి. శ్రీహరి కథలను వినండి. ఆయన పాదపద్మాలను విడిచిపెట్టవద్దు. మీకు సర్వదా శుభము! అని ప్రభోదిస్తాడు వాసుదాసు.

**కీర్తనం :** "శ్రీరామ మతధర్మముల్ - చెప్పెద వినుడీ, సారమతము గొనుడీ, శ్రీరామ మతధర్మా - చారము నెఱిగి, సంసారులు యొగులు, జ్ఞానులు దరిగనుండీ" (కీర్తన-11). ఈ కీర్తనలో రామో విగ్రహవాన్ ధర్మః అని కీర్తింపబడుతున్న శ్రీరామ చంద్రుని ధర్మనిష్టను, పితృవాక్యపరిపాలనను, ఏకపత్నీవ్రతాన్ని చెప్తాను వినండి అని కీర్తిస్తున్నాడు వాసుదాసు. అలాగే "భజన చేసే పద్ధతి దెల్పెద - భక్తులారా వినుడీ, భుజగశయానుని - స్మరణ చేయుచు, ముక్తి సుఖము గనుడీ"(కీర్తన-14) అంటున్నాడు. ఈ కీర్తనలో అనంతశయనుడైన శ్రీహరి అవతారమైన శ్రీరాముని మనసులో సదా ధ్యానం చేస్తూ ముక్తిని పొందండి. దానికి సులభ సూక్ష్మమైన భజన మార్గాన్ని చెప్తాను వినండి. కీర్తించి తరించండి భక్తులకు చెప్తున్నాడు వాసుదాసు.

**స్మరణం :** "హరి హరి హరి హరి హరి, హరిహరి హరియనుచు, గరముల దాలము వైచియు వైవక, స్మరియించిన జాలును" (కీర్తన-14) అంటున్నాడు. అన్నమయ్య 'హరి యవతారములే యఖిల దేవతలు, హరి లోనివే బ్రహ్మాండంబులు, హరి నామములే అన్ని మంత్రములు, హరి హరి హరి హరి యనవో మనసా' అన్నవిధంగా చేతులతో తాళం

వేస్తూ విడిచిపెట్టక నామ స్మరణం చేయమంటున్నాడు వాసుదాసు. అలాగే ఇదే కీర్తనలో “స్మరణముకంటెను మేలగు మార్గము, జగమునందు లేదు” అన్నాడు. నామ స్మరణము అనేది భక్తిమార్గాల్లో అత్యంత ప్రాముఖ్యమైనది. కలియుగంలో కేవలం భగవంతుడి నామస్మరణే మానవులని అన్ని పాపాలనుండి విముక్తులను చేస్తుందని వేదవ్యాస మహర్షుల వారు భాగవతంలో అజామిళుని కథలో చెప్పిన విషయాన్ని మనకు గుర్తు చేస్తూ స్మరణ ప్రాధాన్యం చెప్తున్నాడు వాసుదాసు.

**పాదసేవనం :** “మ్రొక్కిన జాలును నేకశిలేశుడు, ముదమున మిము దాగాచున్, దిక్కయి తన సేవకులనెప్పుడు, తిరమగు దయతో బ్రోచున్” (కీర్తన–14) అంటున్నాడు. ఈ కీర్తనలో ఒక్కసారి పాదాలకు మ్రొక్కితే చాలు. ఆ ఒంటిమిట్ట కోదండరామ స్వామి సంతోషంతో మిమ్ములను రక్షిస్తాడు. స్థిరమైన అచంచల భక్తితో మిమ్మల్ని దయతో కాపాడుతాడు అని చెప్తాడు వాసుదాసు. అలాగే “శిరమున ధరియించి – వరహేమ పాదుకలు, దిరమగు భక్తితోడ”(కీర్తన–19) అంటాడు. భరతుడు శ్రీరాముల వారి పాదుకలను భక్తి మోసిన విధంగా ఆయన పాదసేవనం చేసుకొని తరించమని వాసుదాసు బోధ.

**అర్చనం :** “కౌసల్యా దశరథ వరపుత్రా, కాంచెన చేలాలంకృత గాత్రా, వాసు దాసార్చిత పదకమలా” (కీర్తన–23) అంటాడు. కౌసల్యా దశరథులకు వరపుత్రుడా వాసుదాసు చేత అర్చింపబడే పదకమలములున్న శ్రీరామా అంటాడు. ముగ్గు, సుగంధము, అక్షతలు, పుష్పము, ధూపం, దీపం, ఉపహారం, తాంబూలం అని అర్చనలోని ఎనిమిది విధానాలు. భగవంతుడి సగుణరూపాన్ని అర్చించాలి. అర్పించడమంటే సమర్పించడం. మనకున్న వాటిని భగవంతుడికి సమర్పించడమే అర్చన. ఆ అర్చన ప్రాముఖ్యం చెప్తున్నాడు వాసుదాసు.

**వందనం :** "ఏకశిలాపురి నెలమిని వసియించి, లోకంబు బాలింపగా, నీ కరుణా పాత్రుడు – నీ వాసుదాసుడి, నీకెర్తి పొగడుచు నిలబడి యున్నాడు" (కీర్తన-76) అంటాడు. లోకాలనేలే లోకేశ్వరుడై, ఒంటిమిట్టలో కొలువైన దశరథ రాముణ్ణి వందన భక్తితో ప్రార్థిస్తున్నాడు వాసుదాసు. శిరస్సు వంచి వందనం చేయడం, భగవంతుడి గొప్పతనాన్ని గ్రహించి నమస్కరించడం, అలాగే సకల జీవరాసుల పట్ల కరుణ, దయ, ఇతరులతో సోదరభావం కలిగివుండటమే అసలైన వందన సమర్పణ అని వాసుదాసు బోధన.

**దాస్యం :** "దాసోహమనుచు – నీ సేవ సేయుచు, వాసుదాసుడు నీదు పదముల బడినాడు" (కీర్తన-22) అంటాడు. మనం చూస్తున్న ప్రకృతిలో ప్రతిదానిని సృజించింది భగవంతుడే! చూచే ప్రతిదానిలోనూ, చేస్తున్న ప్రతి పనిలోనూ అతను ఉన్నాడు. అతను మనల్ని ఆ పనికి నియమించారని, అందరికి యజమాని అతనే యని, మనం చేసే పని అతణ్ణి సంతృప్తి పరిస్తే చాలు అనే సేవాభావంతో చేస్తూ, అతను సేవకుడిగా మనల్ని మనం భావించుకోవటం ద్వారా దురహంకారం అంతమయి, అతను బిడ్డలమనే సంతృప్తి మనకి కలుగుతుందని దాసోహమంటున్నాడు వాసుదాసు.

**సఖ్యం :** "దాస హితుడను దీనపాపుడను ధైర్య హితుడను, నిన్నె నిమ్మితివా – సుబ్బరాయాఖ్య దాసావనలోలా"(కీర్తన-34) ఈ కీర్తనలో దాస హితుడను, స్నేహితుడను అంటున్నాడు వాసుదాసు. భగవంతునికి దగ్గరైనాను అని అన్యాపదేశంగా చెప్తునాడు. అలాగే శ్రీరామునిపై ఎంతో సఖ్యత కనబరుస్తూ "పిలిచిన పలుకవు – బిగువిదేలర రామా, కలకాలము నిన్ను – గాచి తిరిగెడి నిన్ను" (కీర్తన-85) అంటాడు. భగవంతుడు అంటే రాయో, రప్పో కాదని, విశ్వమంతటా వ్యాపించిన చైతన్యమే అని తెలుసుకుని, అతణ్ణి స్నేహితుని గానో, అన్న గానో, ప్రియుడిగానో,

గుర్తించి మనం ఏమి తిన్నా, ఏమి తాగినా, అతనికి సమర్పించి, మనకెంతో ఇష్టమైన వ్యక్తి పట్ల మనమెలా ఆదరభావం ప్రదర్శిస్తామో అంతే ఆదరణ, ప్రేమ అతనుపట్ల చూపిస్తూ అతనికి దగ్గరమవడమే సఖ్యమని వాసుదాసు చెప్తున్నాడు.

**ఆత్మనివేదనం :** "శరణాగత త్రాణ - బిరుదము దాల్చిన, హరి నిన్ను నమ్మినాడ రామా బిరుదము రక్షించుకో" (కీర్తన-89) అంటున్నాడు. శరణు అన్న వాళ్ళను రక్షించే గుణం గలవాడవు కదా! నిన్నే నమ్మినాను. నన్ను రక్షించవలసిన బాధ్యత నీదే సుమా అని శ్రీరాముడికి ఆత్మ నివేదన చేసుకుంటున్నాడు వాసుదాసు. మన దగ్గరున్నవన్నీ సమర్పించేశాక మిగిలేది ఆత్మ ఒక్కటే! అదే పరబ్రహ్మం! ఈ స్థితిలో భగవంతుడికి, భక్తునికి భేదంలేదు. ఇద్దరూ ఒక్కటే. ఆత్మనివేదనం చేసుకున్న భక్తునికి ఇంక వేరుగా కావలసినది ఏమీ ఉండదు.

ఈ కీర్తనలలో నవవిధ భక్తులే కాదు, ప్రభాత సేవలో స్వామివారికి చేసే మేలుకొలుపులు, దంత ధావనము, జలకము, తిలకము, అలంకారము కొలువు ఉన్నాయి. అలాగే ప్రభువైన శ్రీరామచంద్రమూర్తిని సేవించే సమయంలో చేసే సేవలైన శరణాగతి, ఆవాహనము, గంధము, ధూపము, దీపము, పూజ, నేవైద్యపు ఆరగింపు, తాంబూల సేవనము, నీరాజనము, చామరము, నృత్యము, గీతము ఉన్నాయి. అలాగే స్వామి వారి ఏకాంత సేవలో ప్రార్థన, శరణు, పవళింపు, జోల, లాలి, నిదుర, నీరాజనము, పరాకు, హెచ్చరికలున్నాయి. చివరి కీర్తనగా "సెలవా రఘురామా!" అంటూ సెలవు పుచ్చుకుంటాడు వాసుదాసు. స్వామివారి సమస్త సేవలను కీర్తనలుగా రూపొందించి చరితార్థుడైనాడు. కొన్ని కీర్తనలు సంస్కృత సమాస భూయిష్టములై యున్నవి.

భారతీయులు నిత్యం ఆరాధించే దేవతామూర్తులలో ఆంజనేయస్వామికి అనాది నుండి ఒక విశిష్టమైన స్థానం ఉంది.

మతపరంగా పరస్పరం విభేదించుకునే శైవ వైష్ణవులు యిద్దరికీ ఏకైక అంగీకార్యుడైన దైవం హనుమంతుడు. శ్రీ మహావిష్ణువు అవతారమైన శ్రీరాముని పరమభక్తాగ్రేసరుడైన ఆంజనేయుడు దాసభక్తికి ప్రతీక అయిన పరమవైష్ణవ శిఖామణి. అటువంటి ఆంజనేయస్వామి ఈశ్వరాంశ సంభూతుడు. హనుమంతుడు సహవేనుడు. గొప్ప రామభక్తుడు. అతి శక్తివంతమైన రామనామస్మరణ తోనే తన జీవితాన్ని చరితార్థం చేసుకున్న హనుమ ఈ భూలోకంలో చిరంజీవిగా నిలిచి పోయాడు. హనుమను ప్రతి రోజు ఎవరైతే భక్తితో పూజిస్తారో వారికి మానసిక పరమైన ఆనందంతో పాటు మంచి ఆరోగ్యం, సుఖశాంతులు లభిసాయని తులసీదాసు హనుమాన్ చాలీసాలో చెప్పాడు. వాసుదాసు ఆంజనేయుని పట్ల పరమ భక్తి ప్రపత్తులు ప్రదర్శిస్తూ హనుమ మీద ఏకంగా దాదాపు అరవై కీర్తనలను రచించాడు.

వాసుదాసు ఈ సంపుటిలో సంస్కృత కీర్తనలను, దశావతార వర్ణనలు, చూర్ణికలను కూడా రచించాడు. ఇక్కడ చూర్ణికల గురించి కొంత చెప్పవలసి యున్నది. లాక్షణికుడైన వామనుడు గద్యవచనములలోని తెఱగులను బట్టి మూడు విధములుగా విభజించాడు – అవి వృత్తగంధి, చూర్ణము, ఉత్కళిక. పేరుకు తగ్గట్లు వృత్తగంధి పద్యముల నడకను కలిగి వ్రాయబడినది. అదే విధముగా పొడి పొడి మాటలతో వ్రాయబడినది చూర్ణము. పెద్ద పెద్ద సమాసాలతో ఆడంబరమైన పదాలతో వ్రాయబడినది ఉత్కళిక. చూర్ణికలు ఏక వచన ద్వివచన బహువచన సందర్భంబులుగ విభక్త్యానుశాసనిక సమాసాదిత కల్పనానల్పజల్పితంబై వెలయు చుండును అని లాక్షణికులు చెప్పారు. "శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా, సతజిత శతకోటి ప్రసూన సాయకా"(కీర్తన–82) వంటి గొప్ప అంత్య ప్రాసలతో కూడిన అద్భుతమైన చూర్ణికలు ఈ సంపుటిలో ఉన్నాయి.

వాసుదాసు, తనగురించి "కరభూషణము టెంకాయచిప్పగ నయ్యె, నాకేమి తక్కువ సఖులారా, నరసింహాచార్యులు పరమదేశికులైరి" (కీర్తన–113) అని చెప్పుకున్నారు. భగవదాజ్ఞ శిరసావహించి వాసుదాసు ఒంటిమిట్ట కోదండ రామాలయ పునరుద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేశారు. కైంకర్యమునకు నిధుల లేమిచే ఇబ్బందులు పడుతూ యుండగా, కౌపీనధారియై టెంకాయచిప్ప గైకొని రామభజనతో రామాభిక్షకై అనేక పట్టణములే గాక పల్లెల్లో కూడ సంచారం గావించి, ధనం గడించి, ఒకపైసా అయిన వృధా చేయకుండా, రామకైంకర్యమునకై వినియోగించిన ధన్యజీవి. తనకు యుక్త వయస్సులో రాజంపేట మండలం, కంపసముద్రవాసులు పరమ వైదుష్య శిఖామణులు శ్రీమాన్ నరసింహాచార్యులే శ్రీరామషడక్షర మంత్రము నుపదేశించినందున గురువుగా వారిని కీర్తించారు.

అనాదిగా మన భరత ఖండం ఒక ఆధ్యాత్మిక ధర్మక్షేత్రం. ఆత్మానుభవంతో సత్య, శివ, సుందరమైన దృక్పథాన్ని కలిగించిన వైదిక ఋషులే మన తొలి ఆధ్యాత్మిక గురువులు. ఈ మార్గంలో భక్తి అనేది ఒక ముఖ్య సాధనం. అనాదిగా ఉన్న ఈ ఆధ్యాత్మిక దృక్పథాన్ని వేదవేదాంగాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు నిలబెడుతున్నాయి. ఇవన్నీ భక్తి శబ్దాన్ని "శరణాగతి" రూపంలో సూచించాయి. "ముముక్షుర్వై శరణమహ ప్రపద్యే" అంటే మోక్ష కాంక్షగల నేను నిన్ను శరణువేడుచున్నాను అని శ్వేతాశ్వతరోపనిషత్ భావించింది. ఆ భావనలను అందిపుచ్చుకున్న వాసుదాసు అసమాన్య రామభక్తుడు. దాసుగారు ఒంటిమిట్ట కోదండ రామాలయ పునరుద్ధారకులు భక్తి మత ప్రచారకులు, మహర్షి, మౌని, అకుంఠిత రామభక్తుడు, తత్త్వవేత్త, వక్త మరియూ గొప్ప విమర్శకులు. అలాంటి మహనీయుడు రచించిన గొప్ప భక్తి కీర్తనలు ఇన్నాళ్ళకు తి.తి.దే, తిరుపతి, ద్వారా వెలుగు చూస్తున్నందుకు

ఆనందంగా ఉంది. సంగీత గురువులు, గాయనీ గాయకులు కర్ణపేయంగా ఈ కీర్తనలను భక్తిపారవశ్యంతో గానం చేస్తారని భావిస్తున్నాను. ఈ బృహత్తర కార్యక్రమానికి నడుంకట్టి, నాచే ముందుమాట వ్రాయించిన ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ జె.శ్యామలరావు గారికి, స్పెషల్ ఆఫీసరు డా.ఆకెళ్ళ విభీషణ శర్మగారికి, తదితర తి.తి.దే పబ్లికేషన్ శాఖ బృందానికి, నా కృతజ్ఞతాంజలులు తెలియజేసుకుంటున్నాను.

నెల్లూరు,
20-07-2024. డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

# భూమిక

శ్రీకోదండరామసేవకసభ్యులు సభ్యురాండ్రు సమాజ విధుల ననుసరించి భజనముచేయుట ముఖ్యము. కావునఁ గొందఱుసభ్యులు సభ్యేతరలయిన కొందఱస్త్రీల భజనము చేయఁ గీర్తనలు నేర్పుఁడని కోర వారు నేర్పరైరనియు మీరు గొన్ని గీతములు వ్రాసియిమ్మని నన్నుఁ గోరిరి. ఆకారణముచే గీతరచన ప్రారంభింపవలసివచ్చెను. ఈ సంవత్సరమున జరిగిన శ్రీమదొంటిమిట్ట కోదండరాములవారి సామ్రాజ్యపట్టాభిషేకమునకుఁ గొన్ని వ్రాయవలసివచ్చుట చేతను గాలవిలంబములేమిని నప్పటికి వ్రాసినవి ప్రథమ భాగముగ ముద్రించి ప్రకటింపవలసివచ్చెను. అవి యాంధ్రదేశంబునఁ బెక్కు భాగంబుల నచిరకాలమందె వ్యాపించెను. అందుఁ గొన్నివిధముల పాటలు లేకుండుటచే రెండవభాగముగ మఱికొన్ని ప్రకటింప నాలోచించుచుండ శ్రీసీతారాముల కరుణాకటాక్షముచే సమాజసభ్యులు సభ్యురాండ్రు పెక్కుగ్రామంబుల విశేషభజపరత్వమున నేకాంతసేవలో నైన నిత్యోత్సవములు చేయుసాగి యింకను నెక్కువగ గానములు కావలయుననియుఁ బరులను యాచింపవలసిన యక్కఱ లేకుండఁ గావలసిన వన్నియు మీరే వ్రాసి యియ్యవలసినదిగాఁ గోరిరి. వారికోర్కి దీర్ప మఱికొన్ని వ్రాయవలసి వచ్చెను. అవి వ్రాఁతయందుండఁగనే యొంటిమిట్టయందుండిన సభ్యురాం డ్రవి నేర్చి పాడసాగిరి. అవి విన్నవారు తమకవి వ్రాసియియ్య బలవంతపెట్టసాగిరి. ఎందఱకెన్నియని వ్రాసి యియ్య సాధ్యమగును? ఇట్టి సందర్భమందు ముద్దనూరికిఁబోవు టయు నచ్చట పోలీసు సబ్ఇన్స్పెక్టరు బ్ర।। శ్రీ।। రా।। శ్రీ.ఎన్.ఈశ్వరప్పగారి యింటిలో నతిథులమై యందఱము దిగుటయు నచ్చట సమాజసభ్యురాండ్రవి భజనసమయంబున గానంబుసేయుటయుఁ దటస్థించెను. ఇవి యముద్రితములని యెఱిఁ

గి యాయన ధర్మపత్ని చి॥సౌ॥సుబ్బమ్మగారవి వెంటనే ముద్రింపవలసినదనియు, దానికగు వ్యయమంతయుఁ దాము భరించెదమనియుఁ జెప్పిరి. ఆదంపతులమూలమున నివి లోకమునకు లభింపఁగలిగెను. ఇట్లు సమాజసభ్యులకును భజనపరులైన తదితరులకును మహోపకారము గావించిన యీదంపతులకు నాదిమదంపతులైన లక్ష్మీనారాయణులు నిరంతర నిరంతరాయ సర్వశ్రేయోదాయకు లగుదురుగాక!

**శ్లో. శ్రవణంకీర్తనంవిష్ణో, స్స్మరణం పాదసేవనమ్,**
**అర్చనం వందనం దాస్యం, సఖ్యమాత్మనివేదనమ్.**
**ఇతి పుంసార్పితా విష్ణౌ, భక్తిశ్చేన్నవలక్షణా ॥**

అను ప్రహ్లాద వాక్యప్రకారము విష్ణుకథలూ, గుణములు, మహిమలు వినుట, వానిని గీర్తనముచేయుట, వానిని స్మరించుట, విష్ణుపాదసేవ, విష్ణు నర్చించుట, విష్ణువునకు నమస్కరించుట, ఆయనకు దాస్యముచేయుట, ఆయనతోడి సఖ్యము, తన్ను విష్ణువునకు సమర్పించుట యనునవి భక్తి - యనుష్ఠానమందుఁగల దొమ్మిది మార్గములు. అందు కీర్తనము, రెండవది.

ఈ తొమ్మిది మార్గములలో నేదైన నొకటి పూర్ణముగ సాధించుచుఁ దక్కినవి సహాయకములుగ నంగములుగ నుంచుకొనియో యుంచుకొనకయో యేదైన నొకదాని చేతనే ముక్తుఁడు గావచ్చును. ఇది పరమభాగవతులు పాటించు మార్గము-

సతత నారాయణశబ్దమొప్ప. నని నారదుఁడును,

యత్ర యత్ర రఘునాథకీర్తనం. తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్, బాష్పవారి పరిపూర్ణలోచనమ్మని యాంజనేయులు లోనగువారు సంతత నారాయణనామకీర్తనపరులు. ఇట్టి కీర్తనము సంగీతముగనైనను

పద్యగద్యాత్మకముగ నైనను జేయవచ్చును. కేవలసంగీతము అనఁగా స్వరాభ్యాసము గానకళాదురంధరతకు సోపానమైనను భక్తికి ననావశ్యకము. ఎట్లన, అఅఅఅఅఅ యనుప్లుతోచ్చారణముగాని, నీసరిగా, మాసరిగా, దాసరిదా, నీసరి, నీసరి, మాసరి, మాసరి, నీసరిమాసరి, మాపసనీపస, పసపస, మసమస, దసదస దాసరి నీసరిగామా గాసరి నీసరిగాదా అని స్వరోచ్చారణముతోఁ గాలక్షేపము చేయరాదు. భగవదర్థబోధక సాహిత్యసహితమైన సంగీతము విశేషలాభకరము.

**శ్లో. సంగీతమపి సాహిత్యం, సరస్వత్యాస్స్తనద్వయం**
**ఏకమాపాతమధురం, ద్వితీయం చింతనామృతమ్ ॥**

సంగీత సాహిత్యములు రెండును శ్రీసరస్వతీదేవికి రెండు స్తనములు, అందుసంగీతము పాటచాలించువఱకు మధురము, రెండవది యాలోచించుకొలఁది నమృతము. రెండుకలసిన వెన్నలో కలకండ (పటికబెల్లము) కలిపినట్లే.

సంగీతసాహిత్యసమేతముగ నర్థవంతముగ మనస్సును హరిమీఁద నిలిపి కీర్తనముచేయువారికిఁ దన్మయత్వము సులభము. రెండును లభించు నదృష్టము లేనివారొక సాహిత్యముననే తన్మయత్వము నొందవచ్చును. మనస్సు భగవంతునిపైనుంచుట ప్రధానము. మాకు సంగీతము రాదేయని యెవరు చింతింపఁబనిలేదు. సంగీతమురానివాఁడు వైద్యము తెలియనివాఁడు లోకమున లేఁడని సామెత. మూఁడు మాత్రలకాలమును మించునట్లుచ్చరించిన నది సంగీతమే యగుచున్నది. రామ యను పదమునందు రా దీర్ఘము. మ హ్రస్వము. దీనినే రామా అని దీర్ఘప్లుతముగ నుచ్చరించిన నంగీతమగును. శ్రీమద్రామాయణమంతయుఁ గుశలవులు గానము చేసిరికదా! సామవేదమంతయు గానరూపమే కదా! భగవంతుఁడు గానప్రియుఁ

దేకదా! ఇంతయేల ప్రపంచమంతయు గానరూపమేయనుట తప్పుగాదు. ఒప్పేయగును. మఱి మెప్పేయగు. కావునఁ గీర్తనమందు సంగీతసాహిత్యములు రెండును గలసియే యుండును. ఇట్టిది మనోలయమునకుఁ దన్మయత్వమునకుఁ కారణమగును. మనోలయము తన్మయత్వము ఇతర సాధనములచే లభించినను అట్టి సాధనములందెల్ల నిది సులభమగుటచేతను సర్వజనసాధ్యమై యధికార నిరపేక్షకమై శీఘ్రఫలదమై యానందరూపకమై యుండుటచేతను నిదియే యుత్తమము.

కావుననే

**శ్లో. ధ్యాయన్కృతే యజన్ యజ్ఞై, స్త్రేతాయాం ద్వాపరేర్చయన్ ।**
**యదాప్నోతి తదాప్నోతి, కలౌ సంకీర్త్య కేశవమ్ ॥**

కృతయుగమందు ధ్యానయోగము, త్రేతయందు యజ్ఞాదులు, ద్వాపరమం దర్చనము నేఫల మొసఁగునో యాఫలమే కలియుగమందు హరినామకీర్తనము కలిగించునని పరాశరులు చెప్పిరి.

**శ్లో. కలౌ దోషనిధే రాజన్నస్తిహ్యేకో మహాన్ గుణః**
**కీర్తనాదేవ కృష్ణస్య, ముక్తబంధః పరం వ్రజేత్ ॥**

దోషరాశియగు కలియుగమందు నొక గొప్ప గుణము గలదు. నారాయణ కీర్తనముచేతనే బంధవిముక్తుఁడై పరమపదమున కేగవచ్చును. కలిపురుషుఁడు ధ్యానము, యాగము, అర్చనము వీనిని ఫలవంతములుగాకుండఁ జేయఁగలుగునుగాని నామకీర్తనఫలమును వ్యర్థము చేయలేఁడు. కావునఁ దక్కిన వానికంటె నిది పాపహరణమందు భవతరణమందు బలిష్ఠమై యమోఘమైన సాధనమని యెంచవలయునుగాని యధమ పక్షముగ నెంచరాదు. ఇంకను బ్రమాణములు చూడుఁడు.

**శ్లో. నారాయణేతి యస్యాస్తే, వర్తతే నామమంగళం**
**నారాయణస్త మాన్వాస్తే, వత్సం గౌరివ వత్సలా ॥**

నారాయణశబ్దము ఎవనినోర నుచ్చరింపఁబడుచుండునో యట్టివానిని దూడవెంటఁబోవు గోవువలె భగవంతుఁడు నారాయణుఁ డనుసరించి పోవుచుండును.

**క. గోవింద నామకీర్తన**
**గావించి భయంబుదక్కి ఖట్వాంగధరి**
**త్రీవిభుఁడు చూఱగొనియెను**
**గైవల్యముఁ దొల్లి రెండు గడియలలోనన్.**

అన్నట్లు రెండుగడియలు (౪౮ నిమిషములు) హరినామకీర్తన నేకాగ్రమనస్సుతోఁ జేసి ఖట్వాంగమహారాజు మోక్షము సంపాదింపఁ గా మనమట్లు చేయఁజాల మేని మనకంటె వ్యర్థులెవరు?

**సీ. వ్రతధారినై వేదవహ్ని గురుశ్రేణి**
**మన్నింతు విహితకర్మములఁ గొఱఁత**
**వడకుండ నడపుదు భారతమిషమునఁ**
**బలికితి వేదార్థభావమెల్ల**
**మునుకొని స్త్రీశూద్ర ముఖ్య ధర్మములందుఁ**
**దెలిపితి, నేఁజెల్ల దీనఁ జేసి**
**యాత్మసంతసమంద దాత్మలో నీశుండు**
**సంతసింపకయున్న జాడదోఁచె.**

నని వ్యాసమహర్షి వగచుచుండ నారదమునీంద్రుఁడు వచ్చి

**ఉ. అంచితమైన ధర్మచయమంతయుఁ జెప్పితి వందులోన నిం**
**చించుకగాని విష్ణుకథలేర్పడఁ జెప్పవు; ధర్మముల్ ప్రపం**
**చించిన మెచ్చునే గుణవిశేషములెన్నినఁ గాక, నీకునీ**
**కొంచెమువచ్చుటెల్ల హరిఁగోరినుతింపమి నార్యసన్నుతా!**

యనికదా బోధించెను.

**శ్లో. సతతం కీర్తయంతో మాం, యతంతశ్చ దృఢవ్రతాః**
**నమస్యంతశ్చ మాం భక్త్యా, నిత్యయుక్తా ఉపాసతే ॥**

నన్నెల్లప్పుడు భక్తితోఁ గీర్తించువారును, దృఢసంకల్పము కలవారై నాకార్యములు చేయుటయందుఁ బ్రయత్నము గలవారును, నాకు సాష్టాంగ నమస్కారము చేయువారును, నాతో నిత్యసంబంధము గలవారై నన్నుపాసించుచున్నారు. అని భగవంతుఁడు శ్రీకృష్ణుఁడే చెప్పెనుగదా! దీనివలన కీర్తనము భగవంతునితో నిత్యయోగమునకుఁ గారణమగుచున్నది. ఇదియేకదా ముక్తి. ఇది యింతసులువుగ సాధ్యమైయుండ సాపాయము సాంతరాయము నగువానికై దేవురులాడు వారెంతటి బుద్ధిమంతులో?

**సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని**
**కీలలు హరినామ కీర్తనములు**
**గురుతల్ప కల్మష క్రూరసర్పములకు**
**గేకులు హరినామ కీర్తనములు**
**తపనీయ చౌర్యసంతమసంబునకు సూర్య**
**కిరణముల్ హరినామ కీర్తనములు**
**మధుపాన కిల్బిష మదనాగసమితికిఁ**
**గేసరుల్ హరినామ కీర్తనములు**

**తే. మహితయోగోగ్రనిత్య సమాధి విధుల**
**నలరుబ్రహ్మాది సురులకు నందరాని**
**భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య**
**ఖేలనంబులు హరినామ కీర్తనములు.**

**సీ. ముక్తికాంతైకాంత మోహన కృత్యముల్**
**కేలిమై హరినామ కీర్తనములు**

సత్యలోకానంద సౌభాగ్య యుక్తముల్
కేలిమై హరినామ కీర్తనములు
మహితనిర్వాణ సామ్రాజ్యాభిషిక్తముల్
కేలిమై హరినామ కీర్తనములు
బహుకాలజనితతపఃఫలసారముల్
కేలిమై హరినామ కీర్తనములు

తే. పుణ్యమూలంబు లనపాయ పోషకంబు
లభిమ తార్థంబు లజ్ఞాన హరణకరము
లాగమాంతోప లబ్ధంబు లమృతసేవ
లార్తశుభములు హరినామ కీర్తనములు.

కం. డెందంబు పుత్రువలనం
జెందినదని తలఁపవలదు శ్రీపతి పేరే
చందముననైనఁ బలికిన
నందకధరుఁ దందుఁగలఁడు నాథుండగుచున్ ॥

ఆ. బిడ్డపేరుబెట్టి పిలుచుట విశ్రామ
కేలినైన మిగుల గేలినయినఁ
బద్య గద్య గీత భావార్థముల నైనఁ
గమలనయనుఁ దలఁపఁ గలుషహరము.

ఉ. కూలినచోట, గొట్టుపడికుండినచోట, మహాజ్వరాదులన్ ।
బ్రేలినచోట, సర్పముఖ పీడల నందినచోట నార్తులై ।
తూలినచోట, విష్ణుభవదూరునిఁ బేర్కొనిరేని మీఁదన ।
క్కాలుని యాతనావితతిఁ గానరు పూనరు దుఃఖభారముల్ ॥

కం. హరిభక్తులతో మాటలు
ధర నెన్నఁడుఁ జెడని పుణ్యధనముల మూటల్

వరముక్తికాంత తేటలు
నరిషడ్వర్గంబు సొరని యరుదగుకోటల్.

సీ. ఏకసక్కెమునకైన నిందిరారమణునిఁ
బలుకంగలేని దుర్భాషితులను
గలలోననైన శ్రీకాంతుని సత్పాద
కమలముల్ సూడని కర్మదృశుల
నవ్వుచునైనఁ గృష్ణప్రశంసకుఁ జెవిఁ
దార్పనేరని దుష్కథాప్రవణుల
యాత్రోత్సవంబులనైన నీశుని గుడి
త్రోపఁద్రొక్కంగలేని దుష్పథులను

ఆ. పరమభాగవతుల పాదధూళి సమ స్త
తీర్థసారమనుచుఁ దెలియలేని
వారి వారి వారి వారిఁ జేరిన వారిఁ
దొలుతఁ గట్టితెందు దూతలార.

ఆ. అలుకనైన జెలిమినైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁడగు హరిఁ
జేరవచ్చు వేఱు సేయఁ దతఁడు.

ఆ. పద్మనయనుమీఁది భక్తియోగం బెల్ల
ముక్తియోగమనుచు మొదలెఱుంగు
వారివారి వారివారిఁ జేరినవారి
త్రోవఁదలఁపవలదు దూతలార.

క. కీటకముఁ దెచ్చి భ్రమరము
పాటవమున బంభ్రమింప భ్రాంతంబై త

**తీఁటకము భ్రమరరూపముఁ**
**బాటించి వహించుగాదె భయయోగమునన్.**

**శా. కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా ।**
**సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్, సంబంధులై వృష్ణులుం ।**
**బ్రేమన్‌మీరలుభక్తినేము, నిదె చక్రింగంటి, మెట్లయినఁను ।**
**ద్ధామధ్యానగరిష్ఠుఁడైన హరిజెందన్‌వచ్చు ధాత్రీశ్వరా ॥**

ఇట్లగుటచే హరినామ ముచ్చరించుచు, హరికథలు గానముచేయుచు, జనన మరణ దుఃఖముల నివారించుట సులభోపాయము. నామోచ్చారణ కీర్తనములచే సీతా ద్రౌపదీ నారద ప్రహ్లాద గజేంద్రాదులు దుఃఖముక్తులై సుఖించిరి.

సంకీర్తనమందు వేఱొక విశేషలాభముగలదు. సఖ్య వందనార్చనాదాస్య చింతనాత్మనివేదనాదులచేఁ దరించువారా కార్యములు చేయువారుమాత్రమే. ఒకఁడు భగవంతు నర్చించిన వేఱొకఁడు తరింపఁడు. సంకీర్తనంబున నట్లుగాదు. కీర్తనముచేయువారు మాత్రమేకాక యాకీర్తనల వినువారును బాగుపడుదురు. కావున కీర్తనలు పాడువారు తాము తరించుటయెకాక యితరులును దరించుటకుఁ గారణభూతులగుదురు. ఆకారణముచే నితరులఁ దరింపఁజేసిన పుణ్యము నార్జించిన వారగుదురు. వినెడివారికిని వినిపించెడివారికిని ఫలము గలదు గదా!

కావున సమాజసభ్యులు సభ్యురాండ్రు నిరంతర భగవన్నామకీర్తనపరు లగుదురుగాక!

**శ్లో. వందే నందవ్రజస్త్రీణాం, పాదరేణు మభీక్ష్ణశః**
**యాసాం హరికథోద్గీతాం, పునాతి భువనత్రయమ్ ॥**

ఏ స్త్రీల హరికథాగానము మూఁడులోకములఁ బవిత్రవంతములు చేసెనో యట్టి నందుని మందయందలి సుందరుల పాదారవిందముల ధూళికి నమస్కారమనికదా యుద్ధవుఁడు – అక్రూరుఁడు చెప్పిరి.

వారిమార్గమునే మనమనుసరించి వారివలెనే మనము అపారసంసార ఘోరవారాశిఁ దరింతము.

ఇట్లు విన్నవించు,
**వాసుదాసుఁడు.**

# విషయసూచిక


| విషయం | కీర్తనలు | పుట |
|---|---|---|
| 1. గణపతి ప్రార్థన | బొజ్జయ్య మనవి వినవయ్య | 1 |
| 2. సరస్వతి ప్రార్థన | భారతి నినుఁ గొలుతున్ | 1 |
| 3. సరస్వతి ప్రార్థన | వాణీ వినతశర్వాణి | 2 |
| 4. గురుప్రార్థన | గురుపాదుకలు | 2 |
| 5. గురుప్రార్థన | ఆచార్యుల గొలిచెద | 4 |
| 6. గురుప్రార్థన | గురువులమేరును | 6 |
| 7. ఆంజనేయ ప్రార్థన | దయగనుమా మారుతీ | 10 |
| 8. ఆంజనేయ ప్రార్థన | స్వామీ యొంటిమిట్ట సంజీవరాయా | 10 |
| 9. ఆంజనేయ ప్రార్థన | సంజీవరాయనీకంజలిమోడ్చెద | 11 |
| 10. ఆంజనేయ ప్రార్థన | శ్రీ జయజయ | 12 |
| 11. ఆంజనేయ ప్రార్థన | శ్రీరామ మతధర్మముల్ | 13 |
| 12. ఆంజనేయ ప్రార్థన | అదిగో మాఒంటిమిట్ట | 15 |
| 13. ఆంజనేయ ప్రార్థన | మేలుకొనుడీ తల్లులారా | 17 |
| 14. ఆంజనేయ ప్రార్థన | భజనముచేసెడి పద్ధతి | 18 |
| 15. ఆంజనేయ ప్రార్థన | రామకృష్ణనారాయణ | 21 |
| 16. ఆంజనేయ ప్రార్థన | నారాయణదేవ | 22 |
| 17. ఆంజనేయ ప్రార్థన | శ్రీరామచంద్రప్రభో | 23 |
| 18. ఆంజనేయ ప్రార్థన | రాముంగనవే చెలి | 23 |
| 19. ఆంజనేయ ప్రార్థన | రాకేందువదనుని | 24 |
| 20. ఆంజనేయ ప్రార్థన | ఏమిభాగ్యంబేమిభాగ్యంబో | 25 |

| | | | |
|---|---|---|---|
| 21. | ఆంజనేయ ప్రార్థన | సోమరులారా లెండి | 26 |
| 22. | ఆంజనేయ ప్రార్థన | జయ జయ రఘువీర | 26 |
| 23. | ఆంజనేయ ప్రార్థన | శ్రీరఘువల్లభ చిన్మయరూపా | 31 |
| 24. | ఆంజనేయ ప్రార్థన | అదెనారాయణు | 32 |
| 25. | ఆంజనేయ ప్రార్థన | ఆనందమానందమాయెను | 33 |
| 26. | ఆంజనేయ ప్రార్థన | ఎంతమంచిరాముఁడె | 33 |
| 27. | ఆంజనేయ ప్రార్థన | సీతాకళ్యాణమహోత్సవ | 34 |
| 28. | ఆంజనేయ ప్రార్థన | రామా భిక్షాందేహి | 35 |
| 29. | ఆంజనేయ ప్రార్థన | రామచంద్ర మహారాజుకు జేజే | 36 |
| 30. | ఆంజనేయ ప్రార్థన | రక్షింపు దశరథబాల | 37 |
| 31. | ఆంజనేయ ప్రార్థన | పావనాంబుజలోచనా | 37 |
| 32. | ఆంజనేయ ప్రార్థన | రామచంద్ర నిన్నెనమ్మితిరా | 37 |
| 33. | ఆంజనేయ ప్రార్థన | సారసనయనరామచంద్రనన్నుఁబ్రోవరా | 38 |
| 34. | ఆంజనేయ ప్రార్థన | వెంకటేశ్వరనన్నుఁ బ్రోవర | 38 |
| 35. | ఆంజనేయ ప్రార్థన | ప్రణుతభువనిరామము శ్రీరామనామము | 39 |
| 36. | ఆంజనేయ ప్రార్థన | నిన్నువిడువరా రామ, నన్నుఁ బ్రోవరా | 39 |
| 37. | ఆంజనేయ ప్రార్థన | అరుణారుణనయనాంబుజ | 39 |
| 38. | ఆంజనేయ ప్రార్థన | ఎన్నిమాసము లాయెరా | 40 |
| 39. | ఆంజనేయ ప్రార్థన | దాసుఁడనైతిని నేఁడెకదా | 41 |
| 40. | ఆంజనేయ ప్రార్థన | దాసోహమ్మని నందుకు | 42 |
| 41. | ఆంజనేయ ప్రార్థన | శ్రీరఘురామం భజరే | 44 |
| 42. | ఆంజనేయ ప్రార్థన | రావయ్య రామదేవర | 47 |

| | | | |
|---|---|---|---|
| 43. | ఆంజనేయ ప్రార్థన | దేవాదిదేవుఁడమ్మా | 48 |
| 44. | ఆంజనేయ ప్రార్థన | జానకీదేవీ, కరుణాదీవీ | 49 |
| 45. | ఆంజనేయ ప్రార్థన | ఇకనెప్పు డిక నెప్పుడో, నీపదసేవ | 49 |
| 46. | ఆంజనేయ ప్రార్థన | పాహిరామచంద్రదేవా | 53 |
| 47. | ఆంజనేయ ప్రార్థన | కంటిఁగంటి జానకిశ్వరా | 53 |
| 48. | ఆంజనేయ ప్రార్థన | కౌసల్యాతనయవిభో | 54 |
| 49. | ఆంజనేయ ప్రార్థన | నీపాదములు నమ్మి | 54 |
| 50. | ఆంజనేయ ప్రార్థన | శ్రీరామ, శ్రీధామ, శృంగారధామ | 54 |
| 51. | ఆంజనేయ ప్రార్థన | రామచంద్ర నన్నుగావరా | 55 |
| 52. | ఆంజనేయ ప్రార్థన | రామ విభో సదయయిదో | 56 |
| 53. | ఆంజనేయ ప్రార్థన | రాముని మఱవకువే | 56 |
| 54. | ఆంజనేయ ప్రార్థన | రారా శ్రీరఘురామా | 57 |
| 55. | ఆంజనేయ ప్రార్థన | రామా ననుబ్రోవవే | 57 |
| 56. | ఆంజనేయ ప్రార్థన | ననుగాన దయలేదా | 58 |
| 57. | ఆంజనేయ ప్రార్థన | ఇందు సుందరవదనా | 58 |
| 58. | ఆంజనేయ ప్రార్థన | ఇదివినరా నరుఁడా | 59 |
| 59. | ఆంజనేయ ప్రార్థన | రామంభజే రఘు రామం భజే | 60 |
| 60. | ఆంజనేయ ప్రార్థన | సీతాపతి హరి శ్రీశమురారి | 60 |
| 61. | ఆంజనేయ ప్రార్థన | రామునిభజనము రారేసేయగ | 61 |
| 62. | ఆంజనేయ ప్రార్థన | అదిగో మాయొంటిమిట్ట | 61 |
| 63. | ఆంజనేయ ప్రార్థన | ఓం నమోనారాయణాయ | 62 |
| 64. | ఆంజనేయ ప్రార్థన | ఢంకా వాయించెద | 63 |

65. భక్తి విజయ ధ్వజగానము సీతారాములజెండా 64

66. భక్తి విజయ ధ్వజగానము లాలిశ్రీ హనుమంత 65

67. హనుమ మంగళం రామచంద్రదాసాయ 66

**ప్రభాతసేవ**

68. మేలుకొలుపు మేలుకో రఘురామా 66

69. మేలుకొలుపు మేలుకో శ్రీరామా 67

70. అపరాధము అపచారములుచేసి 68

71. అపరాధము నిన్నె నమ్మియున్నవారము 69

72. వందనము వందే రఘురామం 70

73. వందనము వందనంబిదే హరీ 71

74. దంతధావనము రావయ్య రఘువంశ రాకాసుధాకరా 71

75. జలకము లాలపోసెదనురారా 72

76. జలకము జలకము లాడరాఁగదమ్మ 72

77. తిలకము తిలకము దిద్దరమ్మా 73

78. అలంకారము మల్లెపూల వన్నెగలుగు 74

79. కొలువు కొలువుదీరెనే రాముఁడు 75

80. చూర్ణిక–పరాకు శ్రీమదఖిలాండకోఁటి 76

**ప్రభుత్వసేవ**

81. చూర్ణిక–పరాకు జానకీరామా ఓ రామా 77

82. చూర్ణిక–పరాకు ఎక్కడజూచిన మన శ్రీరాముఁడె 77

83. చూర్ణిక–పరాకు రాములె సర్వంబు 78

84. చూర్ణిక–పరాకు పిలిచిన బలుకవు 79

| | | |
|---|---|---|
| 85. చూర్ణిక–పరాకు | నీవంటి దేవునెందుగా | 81 |
| 86. చూర్ణిక–పరాకు | రామ పాహిమాం | 81 |
| 87. శరణాగతి | శ్రీమద్రఘుకులం శేఖర | 82 |
| 88. ఆవాహనము | రా రా నా ముద్దుబాల | 84 |
| 89. ఆవాహనము | శ్రీరామచంద్ర నన్ను జేరరారా | 84 |
| 90. ఆవాహనము | రారానాముద్దులయ్య రామరామా | 85 |
| 91. గంధము | గంధమలదరే | 86 |
| 92. ధూపము | దూపమాఘ్రాణింపు | 86 |
| 93. దీపము | దీపము దర్శింపు | 87 |
| 94. పూజ | పువ్వుబోణులారా పూజచేయగరారే | 88 |
| 95. పూజ | పూవులుచల్లరే, విరసినమల్లె | 89 |
| 96. ఆరగింపు | ఆరగింపుమీ రామా | 90 |
| 97. ఆరగింపు | శ్రీరాఘవులారా | 90 |
| 98. ఆరగింపు | బువ్వపెట్టెదనురారా | 92 |
| 99. తములము | తములము సేయవయ్య | 92 |
| 100. నీరాంజనము | జానకీ మనోహరాయ | 93 |
| 101. నీరాంజనము | మంగళము సీతకును | 94 |
| 102. నీరాంజనము | జయమంగళం నిత్యశుభమంగళం | 94 |
| 103. చామరము | చామరవీవరే | 95 |
| 104. నృత్యము | నారాయణ భజనామృతము | 96 |
| 105. నృత్యము | గోవింద నందనందన | 97 |
| 106. గీతము | నీవు నాకు దోడులే | 98 |

| | | |
|---|---|---|
| 107. గీతము | సీతావల్లభ శ్రీకరరామా | 98 |
| 108. గీతము | రామచంద్ర పాహిమాం | 99 |
| 109. మంగళం | శ్రీరామచంద్రునకు | 99 |
| | **ఏకాంతసేవ** | |
| 110. ప్రార్థన | నారాయణ నారాయణ | 100 |
| 111. ప్రార్థన | జననీజానికమ్మ | 101 |
| 112. ప్రార్థన | దశరథనందన నమో నమో | 103 |
| 113. శరణు | శరణు శరణు | 104 |
| 114. తలుపు | తలుపులుదీయగ | 104 |
| 115. పవళింపు | రామయ్య పవళింపవయ్యా | 106 |
| 116. నిదుర | నిదురపోనియ్యవే | 107 |
| 117. జోల | జో కరుణాలవాల | 107 |
| 118. జోల | జోజో జోజో | 108 |
| 119. లాలి | లాలిరామన్న లాలి | 108 |
| 120. లాలి | రామాలాలి | 110 |
| 121. నీరాంజనము | అమరులబాలించు | 110 |
| 122. నీరాంజనము | మంగళము జానకీ | 111 |
| 123. నీరాంజనము | మంగళమో రామభద్ర | 111 |
| 124. పరాకు | పరాకుశ్రీరఘురామచంద్రహరి | 112 |
| 125. హెచ్చరిక | కరుణాకర సుగుణాకర సరసీరుహనయనా | 112 |
| 126. శలవు | సెలవా రఘురామా? | 113 |

# వాసుదాసు కీర్తనలు

## భజన కీర్తనలు

### గణపతి ప్రార్థన

1. నాదనామక్రియ - అటతాళము

బొజ్జయ్య - మనవి -వినవయ్య - నీ
బొజ్జనిండఁ గుడుము - లిడియెద - మయ్యా ॥బొజ్జ॥

వెనుకయ్యా - నీకు - మ్రొక్కెదము - మా
పనులు - చెఱుపులేక - పాలింపవయ్యా ॥బొజ్జ॥

కరివదనా - నీకు - దండములు - మా
పరిచర్యలనుగొని - పాలింపవయ్యా ॥బొజ్జ॥

ఉండ్రాళ్లు - నీకుఁ - బోసెదము - మా
తండ్రివి నీవగుచు - దయ - చూడవయ్యా ॥బొజ్జ॥

ఇరువదియొక్క పత్రులను - నిన్ను
వరుసఁ బూజించెదము - కరుణింపవయ్యా ॥బొజ్జ॥

### సరస్వతీ ప్రార్థన

2. రాగము - ఆదితాళము

భారతి - నినుఁ - గొలుతున్ - దయావతీ
భారతి - నినుఁ - గొలుతున్ ॥భారతి॥

భారతిదేవీ - కరుణా నీవీ
సారసదళలోచనా - సరస్వతీ ॥భారతి॥

వీణాపుస్తక - పాణీ యలినీల
వేణీ - విధిరాణీ - సరస్వతీ ॥భారతి॥

ధవళాకారా - కమలాధారా
ధవళజలజహారా - సరస్వతి ॥భారతి॥

భాసా - చిన్మయ - హాసాభాషా
పాలితవాసుదాసా - సరస్వతీ ॥భారతి॥

**3.** భైరవిరాగము - అటతాళము

వాణీ వినతశర్వాణీ - శుభవాణి
వీణాపుస్తకపాణీ - గీర్వాణీ ॥వాణీ॥

భాషా - పరివృతదోషా - సుందర
వేషా - సజ్జనపోషా - మృదుభాషా ॥వాణీ॥

వాణీ - కంజజురాణీ - యలినీల
వేణీ - శుభవాణీ - కల్యాణీ ॥వాణీ॥

తలఁతున్ నీదయ - వలఁతున్ - బదముల
గొలుతున్ సతతంబున్ ॥వాణీ॥

వాసున్ - నీపదదాసున్ - బ్రాంజలి
భాసున్ దయ నేలవే ॥వాణీవినత॥

## గురుప్రార్థన

**4.** యదుకుల కాంభోజిరాగము - ఆదితాళము

గురుపాదుకలు నాదు - శిరమున ధరియించి
హరియింతుఁ బాతకములన్
గురుఁడె నాదైవము - గురుఁడె నాజనయిత్రి
గురుఁడె నా జనకుఁడు - గురుఁడె నాసర్వస్వము ॥గురు॥

గురుకంటె దైవంబు - గురుకంటెఁ జుట్టంబు
గురుకంటెఁ బక్కంబు - దొరకఁదు ధరలోన ॥గురు॥

తనువొసఁగి పోషించు - తల్లిదండ్రులకంటెఁ
దనువులేకయె చేయు - ఘనుఁడు పూజ్యుడుగాఁడె ॥గురు॥

అజ్ఞానతిమిరంబు - నణఁచి కేవలకరుణ
సుజ్ఞానసూర్యునిఁ - జూపించి రక్షించు ॥గురు॥

గురుచరణధూళియె - పరిమళగంధము
గురుపాదతీర్థమె - కోటిగంగలునాకు ॥గురు॥

గురుఁడె శ్రీరాముఁడు - గురుఁడు శ్రీరాముఁడె
గురురాములకు వాసి - కొంచెమేనియు లేదు ॥గురు॥

ముక్తికాంత యనెడి - ముగుదతోడుత నాకు
రక్తిఁ బెండిలిచేసె - రాముఁడు సాక్షిగ ॥గురు॥

పరమ కర్మజ్ఞాన - భక్తి యోగము లేల
తరియింప సంసృతి - గురుపాదుకలె యుండ ॥గురు॥

భరతుఁడు దలఁదాల్చి - గురుపాదుకలు మున్ను
నిరతిశయ ఖ్యాతి - నిశ్రేయసముఁ గాంచె ॥గురు॥

దండిగ గురుభక్తి - యుండ నా హృదయమున
దండధరుఁడు నాదు - దరిఁ జేరఁ జాలునె ॥గురు॥

కనవచ్చు దైవంబు - ఘనుని సద్గురు విడిచి
కనరాని దేవునకై - కడగండ్లు పడనేల ॥గురు॥

దండి పక్వాన్నము - తన హస్త మున నుండఁ
గొండపేఁటులదున్ను - కూళ యుండునె యెందు ॥గురు॥

ప్రత్యక్ష దైవమును - భక్తిఁ గొలువనివాఁడ
ప్రత్యక్ష దైవమును - భక్తిఁ గొలువం గలఁడె ॥గురు॥

గురునందుఁ బరభక్తి - యిరవుకొనకయున్న
గురుబోధతత్త్వము - కుదురుపడదు మదిని ॥గురు॥

భాసురగురుభక్తి - ప్రజ్వలింపఁగఁ జేయ
వాసుదాసుఁడు రామ! - ప్రార్థించుచున్నాఁడు ॥గురు॥

**5. సింహేంద్రమధ్యము రాగము - అటతాళము**

ఆచార్యులఁ గొలిచెద - నాగురువర్యుల
నాచార్యులఁ గొలిచెద
ఆచార్యుల సేవ - ననిశంబుఁ జేయుచుఁ
బ్రాచార్యవర్యుల - పదములు మదినిల్పి ॥ఆచా॥

బ్రహ్మకులమునఁ బుట్టెను - శ్రీహరిఁ బర
బ్రహ్మము శోధించి - బ్రహ్మము సాధించి
బ్రహ్మచర్యదీక్ష - వదలక యుండెడి
బ్రహ్మము సేవించెను ॥ఆచా॥

అజ్ఞానమును దొలఁచెను - మాగురువరుఁడు
విజ్ఞానమును దెలిపెను
అజ్ఞానమును మాపి - యాత్మవంతునిఁ జేసి
సుజ్ఞానదీపంబుఁ - బ్రజ్ఞతో వెలిఁగించె ॥ఆచా॥

అహమర్థమును దెలిపెను - నాలో మమతా
హంకారముల మాపెను
దహరప్రాతశ్రద్ధా - తైలంబునుం బోసె
మహితభక్తివర్తి - మండ బోధజ్యోతి ॥ఆచా॥

దుష్టసంగతి తొలఁగెను - నాచార్యకరుణ
శిష్టసంగతి చెలఁగెను

దుష్టాహారము - దుష్టవిహారము
దుష్టవిచారము - తొలcగెను మొదలంట ॥ఆచా॥

వాసుదేవుcడె సర్వము - ఈ జీవునకు
దాసత్వమే స్వత్వము
దాసోహ మనుచు సం - తతమును శ్రీ శ్రీని
వాసుని ధ్యానమే - పరమపదమార్గము ॥ఆచా॥

వైరాగ్య ముదయించెను - కైంకర్యంబె
వరపథ మని తోcచెను
నారాయణ కృష్ణ - నరహరి మాధవ
శ్రీరామ యనుటయె - సిద్ధి కుపాయము ॥ఆచా॥

మోహము నశించెను - మాగురుకరుణ
దేహాభిమతి మానెను
స్నేహభావము పుట్టె - నిఖిలభూతములందు
మోహనాంగు లెల్ల - ముదితల్లులని తోcచె ॥ఆచా॥

రాముని దయకల్గెను - మాగురుc డాత్మా
రాముని గాన్పించెను
రామదాసు లెల్ల - భ్రాతలుగా నైరి
భూమి కాంచనములు - పొడిదుమ్ముగాc దోcచె ॥ఆచా॥

మూలమంత్రముc దెలిపెను - తాత్పర్యము
మునుముట్ట బోధించెను
మూలమంత్రద్వయము - నోలిc జరమంబును
ఆలసింపక తెల్పి - యాచారమున నిలిపె ॥ఆచా॥

ఫలకాంక్షలను మానితి - నిత్యక్రియల
ఫలము శ్రీహరి కిచ్చితి

ఫలము భారంబును - భగవంతుపై వైచి
సలుపఁగ మానితి - సకల కామ్యంబుల ॥ఆచా॥

వాసుదాసుఁడ నైతిని - ఏకశిలా
వాసుదాసుఁడ నైతిని
వాసుదాసుఁడ నైతి - దాసదాసుఁడ నైతి
దోసము లెల్లను - దొలఁగెను గురుకరుణ ॥ఆచా॥

**6.** సింహేంద్రమధ్య రాగము - ఆదితాళము

గురువులు మే మను - నరులును గురులా?
గురువులలక్షణ - మెఱుఁగరయా
గురువులఁ జక్కఁగఁ - బరిశోధింపక
దరిసిన దుర్గతి - తప్పదయా ॥గురు॥

ఉత్తమకులుఁడై - యుండగవలయును
సత్తమకీర్తియుఁ జనునయ్యా
ఉత్తమకులుచే - నుపదేశము గొన
నుత్తమలోకమె - యొదవునయా ॥గురు॥

నీచాచారుల - నీరజాక్షులను
నీచవర్ణులను - ద్రోచరయా
నీచపు గురువలు - నీచబోధముల
నీచపు గతులకు - నీడ్తురయా ॥గురు॥

శాస్త్రజ్ఞానము - శాస్త్రశ్రద్ధయు
శాస్త్రాచారము - సాధువయా
శాస్త్రమునెఱుఁగని - జడుఁడంధుండగు
శాస్త్రమె నేత్రము - సత్య మయా ॥గురు॥

శ్రుతు లితిహాసము - స్మృతులు పురాణము
మతము నెఱుంగc బ్ర - మాణమయా
శ్రుతికి విరుద్ధపు - శతకాల్ నమ్మెడి
మతిహీనులదరి - మానుcడయా ॥గురు॥

కుల మడిగినc దా - నలిగిన దాcచినc
గలుషాత్మకుc డని - తలcపరయా
కులమును జెప్పcగ - వలవనికూళcడు
కులహీనుం డని - తలcపరయా ॥గురు॥

కులమున మాత్రమె - గొప్పగ నున్నను
ఫల మది యేమియుc - గలుగదయా
కులము గుణంబును - గలిగినవానినె
వలయును గురువని - పలుకనయా ॥గురు॥

కాంచనాశయును - గామిన్యాశయు
మంచివి గావని - యెంచరయా
కొంచక వానిని - గోరెడివానిని
క్రించనుc దనుచును - నెంచరయా ॥గురు॥

దుష్టాహారుని - దుష్టవిహారుని
దుష్టాచారునిc - దొలcగరయా
దుష్ట నికృష్టుని - దొడ్డని చేరిన
భ్రష్టత నష్టియు - వచ్చునయా ॥గురు॥

మధుమాంసంబుల - మత్తువస్తువుల
మది గల వారల - మానరయా ॥గురు॥

శిష్టాచారతc - జెలcగినవానిని
శిష్టుం డనుచును - జేరరయా

శిష్టునిఁ గొలచినఁ - గష్టము దొలఁగును
ఇష్టఫలము లభి - యించునయా ॥గురు॥

కోపము కామము - గూడినగురువుల
దావులఁ జేరఁగఁ - దగదయ్యా
కోపన కాముక - గురువుల యొద్దను
సేవనఁ దత్త్వము - నిలువదయా ॥గురు॥

భక్తిశిష్టులౌ - వారలఁ జేరెఁడు
భక్తివిహీనులు - వ్యర్థులయా
భక్తిహీనులౌ - యుక్తులు జ్ఞానులు
ముక్తికిదవ్వై - పోదురయా ॥గురు॥

గురువునటంచును - గురువము పూనిన
గురుని గురుం డనఁ - గూడదయా
గరువము దంభము - కాపురుషాంకము
లురులని వానిఁ ద - లంపరయా ॥గురు॥

తెలిసి తెలియక - ఖలపథమునఁ జను
పలువను గురువన - వలవదయా
తెలిసి తెలియక ములుకంపలఁ జనఁ
గలుగునె సౌఖ్యము -పలుకరయా ॥గురు॥

నాకును శిష్యులు - గండీ మీ రని
వాకొనువారల - వదలరయా
ప్రాకట మధుపా - త్రంబును వెదకుచు
నాఁకొని యాఁగలె - యరుగునయా ॥గురు॥

సాధుచరిత్రుఁడు - సద్గురు వబ్బిన
శ్రీధవు దయ హ - ర్షింపరయా

సాధుచరిత్రుని - సద్గురుఁ బంపఁగ
శ్రీధరు ధ్యానమె - చేయరయా ॥గురు॥

వేసములును మతి - బాసలు గనుఁగొని
మోసముపోయిన - ముప్పురయా
వాసిగ సత్పథ - వర్తనుఁ జేరిన
వాసియు వన్నెయుఁ - బ్రబలు నయా ॥గురు॥

తప్పుదు బడవాల్ - తమనో టెంగిలి
గొప్పగ శిష్యుల - కిడుదురయా
ఒప్పగు నిదియ గు - రూచ్ఛిష్టం బన
దప్పుడుతన మని - తలఁపరయా ॥గురు॥

ఖరమది పులితోల్ - గప్పిన మాత్రన
ఖరమె గాక వ్యా - ఘ్రం బగునా
ఖరమతి జాల్మఁడు - కావివస్త్రముల
ధరియించిన యతి - వరుఁ డగునా ॥గురు॥

కప్ప యెలుఁగును - గలిగిన సర్పము
సర్పమె కా కది - కప్పగునా
కప్ప పలికెనని - కడకును బోయిన
గొప్పగు ముప్పులు - తప్పవయా ॥గురు॥

కల్లకాసులకుఁ - గాంతులు మెండని
యుల్లములో నెపు - డుంచరయా
చెల్లు సెల్లములు - శ్రేష్ఠుఁడు కనుగొనఁ
దెల్లము గాఁగను - దెలియునయా ॥గురు॥

చక్కఁ బరీక్షలు - సలుపక యెవ్వని
మక్కువ గురుఁడన - మానరయా

నిక్కపు నడవడి - నిక్కపు జ్ఞానము
చిక్కలేని నరుఁ - దక్కరయా ॥గురు॥

సమయ నియతియును - సత్యభాషణము
సాధువర్తనము - వలయునయా
అమలంబైన మ - హోమంత్రమునకు
క్షముఁడై సిద్ధియు - వలయునయా ॥గురు॥

విపుల దయాళుఁడు - విజితేంద్రియుఁడును
వేదజ్ఞుఁడు నయి - వెలయునయా
స్వపరహితాత్మత - సత్త్వగుణంబును
చపలత లేమియు - వలయునయా ॥గురు॥

## ఆంజనేయ ప్రార్థన

### 7. హిందూస్థానిరాగము - ఆదితాళము

దయఁ గనుమా - మారుతీ
నయముగ నిను మది - ననయము గొలుతును ॥దయ॥ 1

సదయ హృదయ నీ - పదములఁ గొలుతును
దయఁగనుమా - మారుతీ ॥దయ॥ 2

భయమును బాపుము - జయము నొసంగుము
దయఁ గనుమా మారుతీ ॥దయ॥ 3

వాసుదాసు మది - వాసముగాఁ గొని
దయఁ గనుమా - మారుతీ ॥దయ॥ 4

### 8. రాగము - తాళము

స్వామి యొంటిమిట్ట - సంజీవరాయా
ప్రేమముతో మమ్ము - వీక్షింపవయ్యా ॥స్వామి॥ 1

నీపాదసేవకు - నిలిచితిమయ్యా
పాపములను బాపి - పాలింపవయ్యా ॥స్వామి॥ 2

సంజీవనిఁ దెచ్చి - సకల వానరుల
సంజీవింపఁ జేయు - చతురుఁడ వయ్యా ॥స్వామి॥ 3

బాలప్రాయంబున - బాలార్కుఁజూచి
బాళిమ్రింగఁగఁ జన్న - బలియుఁడ వయ్యా ॥స్వామి॥ 4

అరసావు చచ్చిన - యాలక్ష్మణునకు
సరగ నుసురిచ్చిన - జగజెట్టివయ్యా ॥స్వామి॥ 5

శ్రీసీతాపతికేము - సేవకులమయ్యా
వాసుదాసునితోడ - వచ్చినామయ్యా ॥స్వామి॥ 6

**9.** కాంభోజి రాగము - అటతాలము

సంజీవరాయ నీ కంజలి మోడ్చెద
మంజనావర నందనా
అంజిక దీర మా - నెంజలిఁ బాపుము
కొంజక నతచందనా ॥సం॥ 1

సంజీవనిం దెచ్చి సౌమిత్రి బ్రతికించి
రంజిల్లఁజేసి కీశ
కుంజర వానర కోటులఁ దేల్చితి
మంజులగుణ భూషణా ॥సం॥ 2

లంకను నొకదెబ్బ బింకము చెడఁగొట్టి
కింకరిగాఁ జేసితి
శంకలేక యక్షు లంకించి శమనుని
కింకరుల పాల్చేసితి ॥సం॥ 3

రుద్రాంశమునఁ బుట్టి భద్రగతిన్ రామ
భద్రుల సేవించితీ
ముద్రిక సీతకు భద్రముగా నొసఁగి
ముద్రిమ సమకూర్చితి ॥సం॥ 4

ఏకశిలాపురి నెలమిని వసియించి
లోకులఁ బాలించుచుఁ
బ్రాకట కోదండరామ సేవకుఁడైన
వాసుదాసునిఁ బ్రోచితి ॥సం॥ 5

**10.** యదుకులకాంభోజి రాగము - ఆదితాళము

శ్రీజయ జయజయ - శ్రీయశము లమరుత
శ్రీరామ కృపచేతను ॥శ్రీజయ॥

రాజితకోదండ - రామసేవకస
మాజసభ్యుల కెల్ల - మహిలోన సతతము ॥శ్రీజయ॥

అమల సద్గుణముల - ననుపమాన మగును
విమల సత్కీర్తిని - వెలయు నీసభ కెపుడు ॥శ్రీజయ॥

భక్తులు యోగసం - సక్తులు జ్ఞాన సం
యుక్త విరక్తులు - నొప్పారు నీసభకు ॥శ్రీజయ॥

భక్తిప్రపత్తులె - పరమోపాయము లని
రక్తి బోధించుచు - రాజిల్లు నీసభకు ॥శ్రీజయ॥

చక్కఁగఁ గడితేఱ - దిక్కు తెలియనివారి
దిక్కయి బోధించి - దీపించు నీసభకు ॥శ్రీజయ॥

దుర్మత దుర్వార - దురభిప్రాయములను
నిర్మూలముగఁ జేసి - నెఱిమించు నీసభకు ॥శ్రీజయ॥

హరిపాదభక్తుల - చరణరజంబును
శిరమున ధరియించి - చెలువొప్పు నీసభకు ॥శ్రీజయ॥

సరసభక్తి త్యాగ - జ్ఞాన వైరాగ్యములు
పురుషార్థములు గాఁగ - బోధించు నీసభకు ॥శ్రీజయ॥

ఏకశిలేశ్వరు - నేలికగాఁ గొని
లోకక్షేమమునకు - లోలాత్మయగు సభకు ॥శ్రీజయ॥

11. సింహేంద్రమధ్య రాగము - అటతాళము

శ్రీరామ మతధర్మముల్ - చెప్పెద వినుఁడీ
సారతమముఁ గొనుఁడీ
శ్రీరామ మతధర్మా - చారము నెఱిఁగి సం
సారులు యోగులు జ్ఞానులు దరిఁగనుఁడీ ॥శ్రీరామ॥

రాముఁడె పరమదైవము - భుక్తి ముక్తుల
కేమానవుని కైనను
రాముఁడు శ్రీనా - రాయణుండె కాని
వేమాఱు చూచిన - వేఱెవ్వఁడును గాఁడు ॥శ్రీరామ॥

శ్రీ సీతాహనుమానులె - పూరుషకారులు
దాసజనుల కెల్లను
దాసజనుల స్థితి - దాశరథికిఁ దెల్పి
వాసిగఁ బ్రోవంగఁ - బలుకుచుందురు ప్రేమ ॥శ్రీరామ॥

భరతుండు సౌమిత్రులె - భక్తుల కెల్ల
పరమార్గసందర్శకుల్
పరతంత్రత్వము - పరమ కైంకర్యము
ధర భాగవత పార - తంత్ర్యముఁ దెలుపుచు ॥శ్రీరామ॥

రామమంత్రమె మంత్రము - సహకారులు
రామసేవకజనములే
రామకైంకర్యమె - రాజితతంత్రము
రామద్వయోక్తియె - రాజయోగవరము ॥శ్రీరామ॥

జనసంఖ్యయే సాంఖ్యము - శ్రీరామ నామ
జపమె పో స్వాధ్యాయము
ఎపు డాత్మనిక్షేప - మీశ్వరప్రణిధాన
మప్రాకృతమతియె - యమనస్క మగుచుండు ॥శ్రీరామ॥

స్మరణమె పరమతపము - శ్రీరాముల
చరణాంబువులె యమృతము
ధరణీజా శ్రీరామ - వరపూజ యజ్ఞము
ధర జ్ఞాన భక్తిప్రదానమే దానము ॥శ్రీరామ॥

అచలమతము దుష్టము - అవైదికము
నాస్తికశఠవాదము
అచలమైన శ్రద్ధ - యనన్య మగు భక్తి
నచలాసుతాభర్త - నర్చింప శుభ మబ్బు ॥శ్రీరామ॥

అఖిలాసనములందును - సుసాధనము
సుఖమైన యాసనంబె
అఖిల ముద్రలలోన - నంజలిముద్రయె
నిఖిలకార్యంబుల - నిమిషమున సాధించు ॥శ్రీరామ॥

తెఱవు తెలియనివారలు - దుఃఖింతురు
కరము విచారముననుb
భరము ఫలంబును - భగవంతుపై వైచి
సరగ సతము నిర్వి - చారత సుఖపడుఁడు ॥శ్రీరామ॥

హృదయపద్మమునందునో - యర్చారూప
సదమలబింబమందో
హృదయము శ్రీసీతా - హృదయేసుపై నాటి
మదబాష్పముల నెల్ల - మరచుటె సమాధి ॥శ్రీరామ॥

రామానుగ్రహ ప్రాప్తికి - సదుపాయములు
ప్రపత్తియును భక్తియే
శ్రీమాధవగీతా - శ్రీభాగవతములు
రామాయణంబును - బ్రస్థానత్రయము ॥శ్రీరామ॥

అల్పము మనజ్ఞానము - భగవంతు సం
కల్పమే కార్యకరము
అల్పమేని కృషి - యధికమేని శేష
తల్పుని కృపలేక - ధర ఫలియింపదు ॥శ్రీరామ॥

వాసుదాసుని వరదుఁడు - ఏకశిలా
వాసుఁడు శ్రీరాముఁడు
దాసజనములనెల్ల - దయతోడ రక్షింప
ఆసతో నెదురెదు - రదె చూచుచున్నాఁడు ॥శ్రీరామ॥

**12. పంతువరాళి రాగము - ఆదితాళము**

అదిగో నొంటిమిట్ట - కోవెల - యిదుగోఁగనుగొనుఁడీ ॥

ప్రథితులు సీతా - రామ లక్ష్మణులు
పృథివిఁ జరిపించుచు - వెలసిన నగరము ॥అదిగో॥

మహి రామసేవాస - మాజాధ్యక్షుడు
రహిగను సంజీవ - రాయుం డుండెడి ॥అదిగో॥

మార్కండేయ స - మర్చిత మగుచును
నర్కతేజుగల - హరులింగము గల ॥అదిగో॥

మృకండుఁడాది ము - నీశ్వరు లెల్లరు
సుకముగఁ దపముల - సొలయక సలిపిన ॥అదిగో॥

ప్రణవాకారము - పాపవిదారము
ప్రణతావనపర - రాఘవు లుండెడి ॥అదిగో॥

పరమభక్తుఁడగు - బమ్మెర పోతన
కర మనురక్తిని - గాఁపుర ముండిన ॥అదిగో॥

అవని ముక్తిదం - బాంధ్రభాగవత
మవతరించిన - యసమక్షేత్రము ॥అదిగో॥

ప్రణుతయశుం డగు - రామభద్రునకుఁ
జనుపాలిచ్చిన - జానకి యుండెడి ॥అదిగో॥

పరమైకాంతియుఁ - బంచముఁ డోబన
యరుసముతోడుత - నలంకరించిన ॥అదిగో॥

కృష్ణమూర్తి శ్రీ - కృష్ణచైతన్యుఁడు
తృష్ణతోడ ద - ర్శించిన క్షేత్రము ॥అదిగో॥

పోతనకొఱకై - పోతులు దామై
ఖ్యాతిని గాంచిన - కరుణాళురు గల ॥అదిగో॥

వాసుదాసుకై - దాసరి యగుచును
వాసిఁ దిరుగు రఘు - వర్యుండుండెడి ॥అదిగో॥

అదిగో వాల్మీకి - యాశ్రమ - మదిగోఁ జూడుండీ

వాసిగ రఘువరు - పదములు కొలుచుచు
వాసుదాసుఁడు వదలక యుండెడి ॥అదిగో వాల్మీకి॥

గంగలు మూఁడును - గలిసి యఘంబుల
భంగించెడి యా - పరమ తీర్థ మిదె ॥అదిగో వాల్మీకి॥

పోతనదేహముఁ - బోరి రక్షించిన
పోతన మడి యను - పురుకేదారము ॥అదిగో వాల్మీకి॥

పరీక్షితుఁ దిట్టిన - పాపము పోవఁగ
పరమతి శృంగిత - పం బొనరించిన ॥అదిగో వాల్మీకి॥

### 13. భూపాలరాగము - అటతాళము

మేలుకొనుఁడీ తల్లులారా - మేలుకొనుఁడీ తండ్రులారా
మేలుకొనుఁడీ యన్నలారా - మేలుకొనరయ్యా వేగ ॥మేలు॥

ఎన్ని జన్మము లాయె మనుము - ఇల్లువిడిచి తిరుగఁబట్టి
ఎన్నఁటికి దరిదాపు గానమ - యేల యిది కనరో ॥మేలు॥

ఏది దారియొ యెఱుఁగ మైతిమి - యేదియిల్లో కాన మైతిమి
ఆదుకొనియెడివారు గల రను - నాశయును లేదు ॥మేలు॥

ఆలుబిడ్డలు నన్నదమ్ములు - నైనవారలు తల్లిదండ్రులు
చాలరెవ్వరు మనలఁగావఁగ - సత్య మిది సుండీ ॥మేలు॥

ఘోరతరసంసారగహనవి - హారు లగుచును వీర లెల్లరు
దారి తెలియక యంధులగుచును - దటమటించెదరు ॥మేలు॥

వనధిలోఁ బడి మునిఁగి తేలుచుఁ - బారము గన లేనివారలు
మనలఁ దీరముఁ జేర్తురనియెడి - మాట నిజ మగునా ॥మేలు॥

తన వనంగను నీటిబుగ్గయె - ధన మనంగను దంధనమగుఁ
గనఁగ యౌవనప్రాయ మనునది - కారుమెఱుఁగయ్యా॥మేలు॥

వీడుతనువులు వీడు ధనములు - వీడిపోవును యౌవనంబును
మూఁడునాళ్ళల ముచ్చటలకై - మోహపడనేల ॥మేలు॥

కాలకింకరు లరుగుదెంచి - కట్టిత్రాళులఁ గళలఁ గొట్టఁగఁ
బాలనము సేయంగఁ జాలిన - ప్రభువుఁ గొలువుండీ ॥మేలు॥

జ్ఞానమనెడియమూల్యరత్నముఁ - జౌర్యమునహరియించుకోరిక
లోనఁ జొచ్చిరి కామరోష - లోభతస్కరులు ॥మేలు॥

కన్నములుతొమ్మిదివైచియుఁ - గాయమునను విషయచోరులు
తిన్నగా మతిధనము దొంగిలఁ - దివురుచున్నారు ॥మేలు॥

వనములోఁ గడగండ్లు పడుచును - బరితపింపఁగఁ దమ్ము మఱచి
జనని జనకుఁడు మనలఁ గనుఁగొని - వనరుచున్నారు॥మేలు॥

మన గృహంబును జేరి మనము - జనని జనకుం డాదరింపఁగ
అనయ మేచింత లేకయె - హాయినుండుదము ॥మేలు॥

తల్లి జానకి తండ్రి రాముఁడు - దార యాప్రియముక్తి కాంతయె
ఇల్లు నిత్యవిభూతి మిత్రులు - నెల్లసూరులును ॥మేలు॥

ఇందునందును సుఖముగూరిచి - యెందునుదోడగుచుఁ దిరుగును
మందులారా రాముఁ డొక్కఁడే - మఱచిపోకండీ ॥మేలు॥

రామ రామా రామ రామా - రామ రామా రామ యనుచు
నామము స్మరియించినంతనె - ప్రేమమునఁ బ్రోచు ॥మేలు॥

ఏకశిలానగరధాముని - బృధ్వితనయానయనసోముని
ఏకభక్తి భంజిప మనవెత - లెల్ల హరియించు ॥మేలు॥

వాసుదాసుని నేలువాఁడఁట - పరమపదవీనాథుఁడతఁడఁట
దాసజనములకు దిక్కతండఁట - తథ్యమిదిసుండీ ॥మేలు॥

## 14. ధన్యాసిరాగము - అటతాళము

భజనముచేసెడి పద్ధతిఁ దెల్పెద - భక్తులార వినుఁడీ
భుజగశయానుని - స్మరణము చేయుచు
ముక్తిసుఖముఁ గనుఁడీ ॥భజ॥

స్మరణముకంటెను మేలగు మార్గము
జగమునందు లేదు
కరివరదుం డగు శ్రీహరికంటెను
ఘనుఁడు పరుఁడు లేఁడు ॥భజ॥

కరుణ సుశీలత యౌదార్యంబును
ఘనత గలుగువాఁడు
పరమంబగు వాత్సల్యము గలిగిన
పరమపురుషుఁ డతఁడు ॥భజ॥

తాలము మేళము తంబుర లేమిని
దక్కువేమి లేదు
వాలాయముగను మీమది హరిపైఁ
బాఁదుకొనినఁ జాలు ॥భజ॥

హరిహరి హరిహరి హరిహరి హరిహరి
హరిహరి హరి యనుచుఁ
గరములఁ దాలమువైచియు వైవక
స్మరియించినఁ జాలు ॥భజ॥

రామరామ శ్రీరామ రామ శ్రీ
రామరామ యనుచు
ప్రేమను నోరారంగను బిలిచిన
నోమును మి మ్మతఁడు ॥భజ॥

పలికెడి మాటల యర్థము మదిలో
నిలిపి పాడరయ్యా
చిలుక పలుకువలెఁ బలుకుటకంటెను
శ్రేష్ఠం బిది రయ్యా ॥భజ॥

మనసును నిలుపక యర్థము తెలియక
కనుల నీరులేక
ఘనముగఁ దల యాడించుచు మూల్గినఁ
గలుగు ఫలము లేదు ॥భజ॥

నిలుకడగాఁ దనమీఁద మనంబును
నిలుపక యున్నను నరుఁడు
మొలలు ద్రిప్పినను దలయాడించిన
మురియఁడు రఘువిభుఁడు ॥భజ॥

తాండవమాడుఁడు చిందులు ద్రొక్కుఁడు
తన్మయతను గనుదనుకన్
బండగు బోగవుఁ గులుకులు మానుఁడు
భక్తులు మీరలు గనుకన్ ॥భజ॥

అమ్మఁబోకుఁడీ శ్రీహరినామము
నర్థకాంక్ష మీరు
నమ్మఁబోకుఁడీ ధనము స్థిరం బని
నరక మార్గ మదియు ॥భజ॥

అర్థకాంక్షచే నడుగురంధ్రమును
నమ్మెడి యా లంజలకు
అర్థకాంక్ష నోరమ్మెడి భక్తుల
కంతర మేమో తెలుపరయా ॥భజ॥

హరినామముఁ దాఁ గాసుల కమ్మిన
హరిదాసుం డగునా
తరుణుల నమ్మెడి జాయాజీవియు
తల్లిని నమ్మమిఁ గనమా ॥భజ॥

భజనమనంగను బ్రతిఫలకాంక్షను
వదలి చేయు సేవ
సుజనుల కయ్యది ముక్తిమార్గముల
సులభంబగు త్రోవ ॥భజ॥

మ్రొక్కినc జాలును నేకశిలేశుcడు
ముదమున మిముc దాc గాచున్
దిక్కయి తన సేవకులను నెప్పుడు
తిర మగు దయతోc బ్రోచున్ ॥భజ॥

### 15. సావేరి రాగము - ఆదితాళము

రామకృష్ణ నారాయణ - నామ రామతీర్థమునను
యేమరక యెపుడు మునుcగు - నామానవుల కన్యమేల॥రామ॥

కాలము దేశము దిక్కు - గానcగా నేపనియు లేదు
చాలcగ శ్రీనామ తీర్థ - స్నానతత్పరులకు ధరణి ॥రామ॥

యోగయాగభోగరాద - త్యాగములతోc బనియు లేదు
రాగముతో నెల్లప్పుడు - రామతీర్థ స్నాతులకును ॥రామ॥

భక్తిజ్ఞానకర్మసువి - రక్తులతోc బనియులేదు
సక్తులై శ్రీరామతీర్థ - స్నానము చేసెడివారికి ॥రామ॥

స్నానతర్పణ జపహోమ - సంధ్యాదులతోc బనియు లేదు
మానక యేవేళ నామ - ధ్యానచింతాసక్తులకును ॥రామ॥

గంగయమున సింధుసేతు - కావేరులతోc బనియులేదు
రంగుగ మనసార నెప్పుడు - రామతీర్థస్నానము చేయ ॥రామ॥

వెలుపల లోపలc గలుగు - కలుషచయము లెల్లc బాపు
మలము లెవ్వియైన మరల - మొలవకుండ నాశనముచేయు॥రామ॥

నిర్విశేషము నిరవద్యము - నిత్యానందము కలుగఁజేయు
సర్వదశల రామనామము - సర్వదాస్మరియించువారికి ॥రామ॥

కులము నాౖశమమ్ము జాతి - తలము వయసు నెంచవలదు
తెలివితో శ్రీరామనామ తీర్థమునను మునుఁగువారికి ॥రామ॥

ఏకశిలావాసు రాము - నెప్పుడు స్మరియించునట్టి
యేకాంతులకు వేఱె సలుప - నేల ధర్మకర్మములు ॥రామ॥

## 16. శంకరాభరణ రాగము - అటతాళము

నారాయణ దేవ - నరసింహ మాధవ - సారసదళలోచనా
మాం పాహి భో - సారసదళలోచనా

శౌరి విశ్వేశ్వర - సాధుసంపూజిత - సారసభవవందితా
మాం పాహి భో - సారసభవవంధితా

శంఖచక్రధర - సాగరమందిర - సారస నిలయాధవా
మాం పాహి భో - సారసనిలయాధవా

వనమాలాలంకృత - వక్షోవిరాజిత - కనకాంబరశోభితా
మాం పాహి భో - కనకాంబరశోభితా

దుష్టసంహారక - శిష్టపరిపాలక - ఇష్టకామితకల్పకా
మాం పాహి భో - ఇష్టకామితకల్పకా

ఏకశిలేశ్వర - శ్రీకరశుభశీల - ఇందిరావరమందిరా
మాం పాహి భో - ఇందిరావరమందిరా

వాసుదాసఫణిత - వాక్యాకర్ణనలోల - దాసరక్షణశీలా
మాం పాహి భో - దాసరక్షణశీలా.

## 17. శంకరాభరణము - అటతాళము

శ్రీరామచంద్రప్రభో - కావుమ నన్ను
వినతపురహర - సనకసురవర
వనజభవముఖ - దనుజమదహర
దినకరాన్వయ - దీపమురహర
వనజలోచన - మనుజవపుధర ॥శ్రీరామ॥

గరుడ కేతన - ఖరవిపాటన
వరద భవభయ - బంధమోచన
పరమపురుషా - వనజలోచన
పరమపాపిని - గరుణఁబ్రోవుము ॥శ్రీరామ॥

ఒనరించి కడు - నుగ్రపాపము
ననుభవించితి - నతులతాపము
వినయమున నిను - వేఁడు వాఁడును / దానను
కనికరంబునఁ గావుమీ నను ॥శ్రీరామ॥

## 18. ముఖారిరాగము - ఆదితాళము

రాముంగనవెచెలి - నందనున్ బాలరాముంగనవె చెలిసుందరున్
రాముం ద్రిజగదభి - రామున్ శ్రీపర
ధాముం దనుజకుల వి - రామున్ రమాహృదయధామున్ ॥రాముం॥

ధీరుం ద్రిలోకైక - వీరున్ గడు సుకుమారున్
ఖరచయ సంహారున్ - మన ముద్దుకుమారున్ ॥రాముం॥

పుత్రుం బరమ ప - విత్రున్ సురవినుతి
పాత్రుం జలధర - గాత్రున్ స్మరమధుజైత్రున్ ॥రాముం॥

శూరుం ద్రిజగదా - ధారుం జితశత
మారుం ముక్తాఫల - హారున్ మనోహరాకారున్ ॥రాముం॥

భాసున్ ఏకశిలా - వాసున్ బాలితవాసు
దాసున్ సనయగుణవి - లాసున్ మంజులదరహాసున్॥రాముం॥

**19.** శంకరాభరణము రాగము - అటతాళము

రాకేందువదనుని రామచంద్రునిఁ జూడ
రారె పోదము నేఁడు
ప్రాకటసామ్రాజ్య - పట్టాభిషేకము
గైకొని సీతతోఁ - గర మలరుచున్నాఁడు ॥రాకేం॥

ధగధగమెఱయు నూ - తనమణిమకుటము
నిగనిగలు దిశల మెఱయ
సొగియించు చక్కని - సుందరరూపమున
భుగభుగవాసనతోఁ - బొలుపాఱుచున్నాఁడు ॥రాకేం॥

పిలపిలమని మూఁగి - బృందారకులు మింట
పలుగతుల నుతియింపఁగాఁ
దళుకుఁ జెక్కులవార - తరుణులు నటియింపఁ
దళదళమెఱసెడి - దట్టితోడ నేఁడు ॥రాకేం॥

కన్నుల నమృతము - కాలువ పాఱఁగ
క్రొన్ననసరులతోడఁ
జెన్నుమీఱఁగఁ - బ్రక్కసీతయు సౌమిత్రి
తిన్నగఁ జెలువార - దీపించుచున్నాఁడు ॥రాకేం॥

శిరమున ధరియించి - వరహేమపాదుకలు
దిరమగు భక్తితోడ

గురుల యానతిఁ గొని - చరణకంజములకు
భరతుఁ డల్ల దె తొడిగె - వాసుదాసుఁడు తానై ॥రాకేం॥

**20.** పూరి కల్యానిరాగము - అటతాళము

ఏమిభాగ్యం బేమిభాగ్యంబు - శ్రీవాసుదాసుని
దేమిభాగ్యం బేమిభాగ్యంబు
ఏమిభాగ్యం బేమిభాగ్యం - బెవరు విని కనని రీతిని
రామసామ్రాజ్యభిషేకము - ప్రేమమునఁ గావింపఁగల్గెను॥ఏమి॥

శ్రీరామాయణము నొక్కండే - నూటయెన్మిది
సారులు పఠియింపఁ గల్గెను
శ్రీరామాయణము నొక్కఁడే - పారాయణముగాఁగఁ జదివి
తీరము లేనట్టి యీ సంసారవారిధి దాఁటఁ గల్గెను ॥ఏమి॥

ఆసేతుశీత శైలము - నందునఁ గలుగు
వాసిమీఱిన తీర్థముల నెల్ల
బాసటై తన హితులు నైదు - వందలుగొని తేరునట్లుగఁ
జేసి వేయికుంభముల నభి - షేకముఁ గావింపగల్గెను ॥ఏమి॥

ఆసలను మొదలంటఁ గోసెను - శ్రీసీతారాముల
దాసతకు దేహ మిచ్చెను
కాసువీసము లందుఁగలుగు - కాంక్షను విడనాడి యాళా
వాసుఁడగుచు భక్తియోగము - వాసినిలోకమునఁ జాటెను ॥ఏమి॥

రామభిక్షకు రాముఁ డంపఁగ - మనవాసుదాసుఁడు
కామరోషము లుజ్జగించుచు
గ్రామగ్రామము సంచరించుచు - రామభక్తిఁ బ్రబలఁజేయుచు
పామరులైనట్టి జనముల - భక్తిపరులను జేసినాఁడు ॥ఏమి॥

### 21. రాగము - అటతాళము

సోమరులారా లెండీ - శ్రీరాముల భజనకురండీ
కామముదీఱఁగస్వామిని కొలుచుచు - క్షేమముగనుఁగొనుఁడీ

నిద్దురలో బుట్టి - మన మిటు నిద్దురలోఁ బెరిఁగి
నిద్దురలోపల నీల్గుచు నిరతము - నిలయము చనఁగనుఁడీ ॥సోమ॥

ఎందఱు సతులైరో - మన కిల - నెందఱు సుతులైరో
ఎందఱుతల్లులొయెందఱుతండ్రులొయెందఱుచుట్టాలో ॥సోమ॥

వీరల నెవరైన - మనలను - జేరిరె - కావఁగను
తేరకు వీరల సేవలఁజేయుచుఁ - దీఱఁగ మనకేలా ॥సోమ॥

మేటగు మంచములు దిండులు - నీటగు పాన్పులును
కాటిలొ బండెఁడు కట్టెలబండిన - కాలమునం దేవీ ॥సోమ॥

కడుదీర్ఘపునిద్ర - పోనఁగఁ - గాలము ముందుండ
జడములయట్టులఁ బడినిద్రింపఁగ సమయంబిదియగునా॥సోమ॥

పాటల మేళముల - బెండ్లిని - జాటింతురు నేఁడు
నోటితాళముల తొమ్ముతప్పెటలం - జాటింతురు తేపు ॥సోమ॥

ఏకశిలానగరం బేలెడి - శ్రీకరురఘురాముం
బ్రాకటభక్తిని గొల్చిన శాశ్వత - భద్రము మనకగును ॥సోమ॥

### 22. రాగము - అటతాళము

జయజయ రఘువీర - జయజయ నగధీర
జయజయ వరశూర - జయభక్తమందార ॥జయ॥

జయజే జయజే - జయజే జయజే
జయజయ జయజయ - జయజయ జయజయ ॥జయ॥

వరగుణుని బ్రహ్లాదుc - బరమబాధలcబెట్టు
దురితాత్ముcద్రుంచిన - తోయజలోచన ॥జయ॥

మొసలివాతc జిక్కి - మొఱపెట్టు కరిరాజు
విసవిసc ద్రుంచిన - విశ్వభావనతంద్రి ॥జయ॥

క్ష్మానాథులుచూడ - సభలోనc బాంచాలి
మానముc గాcచిన - మాధవగోవింద ॥జయ॥

ధరణీసుర ఘోర - శరవహ్నిc జెడకుండc
బరిక్షిత్తుc గాcచిన - పరమదయానిధీ ॥జయ॥

శరణన్నమాత్రాన - శాత్రవుసోదరు
దరిజేర్చి బ్రోచిన -దశరథనందన ॥జయ॥

నిదురపోతై బ్రహ్మ - నిగమములు గోల్పోవ
వదల కసురుc ద్రుంచి - పాలించు మీనంబ ॥జయ॥

కలశాబ్ధిc ద్రచ్చంగc - గవ్వపుc గొండను
సలలితగతిమోయు - శంఖచక్రధర ॥జయ॥

ఇమ్మహీతల మబ్ధి - హేమాక్షుcడు ముంప
గొమ్మున నెత్తిన - కోలంబ పాలింపు ॥జయ॥

ఆర్తరక్షాసక్తి - యఖిలవ్యాపకశక్తి
వర్తిల్ల స్తంభమునc బ్రభవించు నరసింహ ॥జయ॥

కొంచెములc గొంచెము - గొప్పలలో గొప్ప
యంచితముగ నీవె - యైన వామనరూప ॥జయ॥

కండకావరమున - క్ష్మాసురులను నేcచు
దండిరాజుల నెల్ల - దండించు బ్రాహ్మణ ॥జయ॥

పరమ పతివ్రతల - బాధించు దశకంఠు
శిరములఁ ద్రుంచిన - సీతామనోహర ॥జయ॥

గొల్లపిల్లల వెన్న - కూర్మి మానముతోడఁ
గొల్లలాడిన చిన్ని - గోపాలబాలక ॥జయ॥

దనుజుల మోయింప - ధరఁ బ్రబుద్ధుఁడవయి
మనుజుల బ్రోచిన - మామానసచోర ॥జయ॥

వర్ణాశ్రమధర్మ - పద్ధతుల స్థాపింప
వర్ణితభూసుర - వరవేషధర శ్రీశ ॥జయ॥

నీకలామాత్రంబ - నిఖిలలోకంబులు
నికలాసంభవులు - నీరజభవహరులు ॥జయ॥

తరుల గిరులు కరులు - హరులు సురచయములు
నరులు గ్రహతారకలు - నారాయణ నీవే ॥జయ॥

ఎది కనులకుఁ దోఁచు నది యెల్ల నీరూపె
ఎది మనసునఁ దోఁచు - నదియెల్ల నీరూపె ॥జయ॥

పంచావతారములఁ - బంచజనులఁ బ్రోవ
నంచిత దయ నొప్పు - నఖిలశాసనశౌరి ॥జయ॥

కరుణావాత్సల్యాది - కల్యాణ గుణముల
నిరుపమ గతి నొప్పి - నిర్గుణుండ వైతి ॥జయ॥

ఆకారనిష్కర్ష - యరయ నొక్కటి లేక
యాకారములఁ దాల్చి - యైతి నిరాకార ॥జయ॥

జ్యోతిని మిణుఁగుర్లు - దోఁతెంచు చందాన
భూతకోటులెల్లఁ - బొడమును నీయంద ॥జయ॥

సాలెపురుగురీతి - జగముల సృజియించి
యోలి మ్రింగెదు మరల - నుదరములోనికి ॥జయ॥

నిత్యులంద నీవె - నిత్యుండ వోరామ
సత్యములందుఁ ద్రి - సత్యుండవు నీవె ॥జయ॥

చేతనంబులలోనఁ జేతనుండవు నీవె
ప్రీతి నొక్కఁడవయ్యు - వెలసెదు బహురీతి ॥జయ॥

పూర్ణంబ యదియును - పూర్ణంబ యిదియును
పూర్నమునఁ బూర్ణంబు - పుచ్చఁ బూర్ణమె నిలుచు ॥జయ॥

క్రిందను మీఁదను - గెరలి యిరుప్రక్కల
ముందువెనుకల నీవె - యిందు జగదాకృతి ॥జయ॥

నీమాయ గప్పిన - నిఖిలంబు వేర్వేఱు
నీమాయ దొలఁగిన - నిఖిలంబు నేకంబ ॥జయ॥

అణువులయందెల్ల - నణువు మహత్తుల
గణియింప నీకంటెఁ - గడుగొప్ప దెది లేదు ॥జయ॥

నామరూపములచే - నానాభేదము దోఁచు
నామాకృతులు ద్రోయ - నానాత్వమే లేదు ॥జయ॥

బంగారమొకటె యా - భరణాలు వేర్వేరు
రంగ! నామాకృతుల - రాజిల్లుచుండును ॥జయ॥

మృత్తిక యొక్కటే - మృద్భాండములు వేఱు
హత్తిన నామరూపాదులచేతను ॥జయ॥

కమసాలివి నీవు - కనకపిండము నేను
క్రమమున నగచేసి - కరుణ ధరియింపుము ॥జయ॥

నీవు కుమ్మరివి - నేను మృత్పిండము
గావించి కుంభము - కరుణ దరిజేర్పుము ॥జయ॥

కారణంబు నీవె - కార్యంబున్ నీవె
కారణకార్యములన్ - గలుగదు భేదము ॥జయ॥

కారణముసత్యంబ - కార్యము సత్యంబ
కారణకార్యములఁ గలుగదు భేదము ॥జయ॥

నీవు సత్యమైన - నిఖిలంబు సత్యంబ
నీవె నిఖిలమని - నిగమచయములు పల్కు ॥జయ॥

నీవు సేనాపతివి - నేను రణభటుఁడను
నీ వెట్లు చెప్పిన - నేనట్లు చేయుదు ॥జయ॥

నీవు నాస్వామివి - నేను నీ సొమ్మును
నీవెట్లు చేసిన - నే నేల చింతిల్ల? ॥జయ॥

నీవు నాభర్తవు - నేను నీ భార్యను
నీవు రంజిలు సేవ - నీతి యగును నాకు ॥జయ॥

నీవు సముద్రము - నేనందుఁ దరఁగను
నీవె యాధారము - నిల్వఁగ నా కెందు ॥జయ॥

నీవు మహానదివి - నేనందు నొక సుడిని
నీ వెయాధారము - నే స్థితిగని వెలయ ॥జయ॥

సచ్చిదానందత - జరుగును నీయందు
సచ్చిదానందత - జరుగును నాయందు ॥జయ॥

పసిఁడికొండ వీవు - పసిఁడిపూసను నేను
అసమున మనవాసి నరయుచుందు నిట్లు ॥జయ॥

నేనును నాయది యని - నిగిడిపడుటె గాక
నేను నాయది యని నిశ్చయముగ లేదు ॥జయ॥

నీసొత్తు నేనైన - నీసొత్తెకద నాది
నీసొత్తులను వేగ - నీవె గైకొనవయ్య ॥జయ॥

ఏరు నాదియను - నీరెండుమాటలు
నానోర రాకుండ - నయముగ శిక్షింపు ॥జయ॥

నీవెట్టులాడింప - నేనట్టులాడెద
భావమునన్ విసుఁగు - ప్రాలుమాలిక లేక ॥జయ॥

నీవాఁడ నని నన్ను - నీ వెదలో నిల్పి
కావవయ్య తొలంచి - కష్టములెల్ల ॥జయ॥

దాసోహమనుచు - నీసేవసేయుచు
వాసుదాసుఁడు నీదు - పదములఁ బడినాఁడు ॥జయ॥

కోదండరామ నీ - గూరిమి సేవకుల
మోదమున రక్షింపు - భుక్తి ముక్తు లొసఁగి ॥జయ॥

ఏకశిలావాస - లోకైకరక్షక
శ్రీకర భయహర - సీతాలక్ష్మణయుత ॥జయ॥

జేజే రఘురామ - జేజే సీతారామ
జేజే గుణధామ జేజే కల్యాణనామ ॥జయ॥

జే జే జే జే - జే జే జే జే
జే జే జే జే - జే జే జే జే ॥జయ॥

**23.** కేదారగౌళరాగము - ఆదితాళము

శ్రీరఘువల్లభ - చిన్మయరూపా
సీతానాయక - ధుతనతతాపా ॥శ్రీరఘు॥

రావణకుంభకర్ణాది నిహంతా
రాజీవాక్ష జగన్నియంత ॥శ్రీరఘు॥

పావననామ హరిఖండితచాప
వారిధిమదవిదారణరోప ॥శ్రీరఘు॥

ఏకబాణవిమర్ది తవాలీ
లోకజనావనకర శుభశీలీ
ఏకశిలాపురవాస మురారీ
వైకుంఠాలయ విమతఖారారీ ॥శ్రీరఘు॥

కౌసల్యాదశరథవరపుత్రా
కాంచనచేలాలంకృతగాత్రా
వాసుదాసార్చితపదకమలా
దాసజనావన కరుణావిమలా ॥శ్రీరఘు॥

## 24. రాగము - తాళము

అదె నారాయణుఁ డరుదెంచెను దివి
హాటకవసనుం డగుచు
ముదమున సుగుణా - స్పదుఁడు దయాళుఁడు
మదిలో దేవత లానందింపంగ ॥అదె నారా॥

నారాయణ తుభ్యం నమ యని బృం - దారకులెల్ల వచింప
సూరులు ముక్తులు నిరుపార్శ్వంబులఁ - జేరి సంస్తుతింప ॥అ॥

బారులుతీరుచు గంధర్వాదులు - వారక గానము నెఱప
నారదుఁడును గరతాలంబులతో - నాట్యముమింటనుపలుప ॥అ॥

కరముల శంఖము చక్రము మెఱయఁగ - సురవరు లరుదంద
ఉరమున లక్ష్మీదేవియు భాసిల - నొప్పనివారలు గుంద ॥అ॥

### 25. నాదనామక్రియ రాగము - ఆదితాళము

ఆనంద మానందమాయెను - మన
జానకి పెండ్లికూఁతు రాయెను - జగ
దాధారులాదిమ దంపతు లిటులు గలయ ॥ఆనంద॥

సురలకు ఖేద మెద వీడెను - నా
శరులకు ఖేద మొనఁగూడెను - సుర
తరుణుల గుమి మింట నాడెను - శ్రీ
హరులిట్టు లవతరించి యాలుమగఁడు గాఁగ ॥ఆనంద॥

జయజయధ్వను లిందు నిండెను - భక్త
చయముల కోర్కులు పండెను - సాధు
భయములు మొదలంటను వీడెను - దయా
మయులైన సీతారాముల మంగళకార్యము జరుగ ॥ఆనంద॥

లోకుల హర్షము మించెను -సు
శ్లోకుల కీర్తిని బెంచెను - ఆ
నాకుల దుఃఖము ద్రుంగెను - మన
ఏకశిలేశుఁడు పెండ్లికొడుకు గాఁగ ॥ఆనంద॥

### 26. రాగము - తాళము

ఎంతమంచి రాముఁడే - యెంతసుందర కాముఁడే
కంతు గింతు మించినాఁడు - వింతవింతసోయగముల॥ఎంత॥

ఎంత చక్కనిబాలుఁడే - కాంతిశ్రీపాలుఁడే
హంతకులం బంతమున - హతులఁజేయఁ బుట్టినాఁడు॥ఎంత॥

ముద్దులుగురియుచున్నాఁడే - నుద్దులు చెప్పుచున్నాఁడే
తద్ధిమితద్ధిమితద్ధిమి యనుచును - దాండవమాడుచున్నాఁడే॥ఎంత॥

సుందరాకారుఁడే - యందమున మారుఁడే
తిందంతిందంతిందమ్మనుచును- జిందులు ద్రొక్కుచున్నాఁడే ॥ఎంత॥

హాటకవర్ణవాసుఁడే - యవితవాసుదాసుఁడే
హాటకవదనుండగుచునునామధు -కైటభులనుదునిమినాఁడె ॥ఎంత॥

### 27. రాగము - తాళము

సీతాకళ్యాణమహోత్సవవిభావము - చూతము రారే చెలీ
ప్రీతితో నేకశిలేశుఁడు రాముఁడు - పెండ్లికొడుకైనవాఁడు॥సీతా॥

ఆదిలక్ష్మియె యిట్టు - లవతరించెనుధరణి
యాగశాలయందును
మోదముతో నాశ్రితజనములఁ గావఁగ
భూమికి సుత యగుచును ॥సీతా॥

రాముఁడు జలధరశ్యాముఁడు సద్గుణ
ధాముఁడు శ్రీపరంధాముఁ డమ్మా
కామారి వినుతుఁడు కాకుత్థతిలకుఁడు
సామజవరదుఁ డమ్మా ॥సీతా॥

ఎన్ని జన్మంబుల - నేమి నోములు నోఁచి
యీదంపతులఁ గంటిమో
సన్ను తాంగి మన జన్మము కడలేతె
సాయుజ్య మొనరఁ గలిగె ॥సీతా॥

ఈ సురమతులకు దాసుఁడై వెలసెను
వాసుదాసుఁడు నేఁడు
ఏ సుకృతము చేసె నెఱుఁగంగ రాదమ్మ
దాసానుదాసుఁ డతఁడు ॥సీతా॥

## 28. ముఖారిరాగము - ఆదితాళము

రామ భిక్షాం దేహి - ఓ జనులారా ఓ తండ్రులారా
ఓ తల్లులారా - ఓదాతలారా - రామభిక్షాం దేహి
రామభిక్షాం దేహి - రాజీవముఖులారా
రాముని కరుణఁ జి - రాయుస్సౌఖ్యము లబ్బు ॥రామ॥

సిరులు సంపద లబ్బును - దారిద్ర్యము
పరిహారమై పోవును
వరపుత్ర పౌత్రాది - భాగ్యము లెచ్చును
గరము భక్తిమీరు - కానుక లర్పింప ॥రామ॥

నతజన మందారము - శ్రీరాముఁ డా
శ్రితజనుల కాధారము
మతిగల్గి మీరు స - మ్మతిఁ గొల్చినంతనె
యతులిత వైభవ - మతిశయించుచు మీకు ॥రామ॥

కాకియుడుపులు లేవు - మాతలమీఁద
గావి రుమాల్ లేదు
కాకి యుడుపులు లేవు - కట్టెతుండ్లును లేవు
పీఁకి తినఁగ మిమ్ము - బిచ్చగాండ్రము గాము ॥రామ॥

స్వామికిఁ గైంకర్యము - సలుపఁగఁ గోరి
సాయము వేఁడెదము
రామరామయని - రాగముతోడుత
స్వామిభజనము జేయు - రామదాసులమయ్య ॥రామ॥

గుసగుసలపని లేదు - చేతులమీఁద
ముసుఁగులు పనిలేదు

నసనసలు గొట్టక - యసముమీరఁగ మీరు
విసవిస యిట వచ్చి - వేగ కానుక లిందు ॥రామ॥

దాసజనులను బ్రోవఁగ - నేకశిలా
వాసుఁడై - బుధు లెన్నఁగ
వాసిమీఱిన - రామ కైంకర్యమునకును
వాసుదాసుఁడు మిమ్ముఁ - బ్రార్థించుచున్నాఁడు ॥రామ॥

### 29. నామములు, కళ్యాణి - ఆదితాళము

రామచంద్రమహారాజుకు - జేజే
భూమీతనయాపతికిని - జేజే
సామజవర సంత్రాతకు - జేజే
శ్యామసుందరమూర్తికి - జేజే ॥రామ॥

రావణకంఠవిదారికి - జేజే
దావజ్వాలాపాయికి - జేజే
గోవర్ధనగిరి ధారికి - జేజే
దేవకి ముద్దులపట్టికి - జేజే ॥రామ॥

ఆనతరాక్షస వైరికి - జేజే
దానదయాపరమూర్తికి - జేజే
మానవతీభయహారికి - జేజే
దీనచయావనకేళికి - జేజే ॥రామ॥

ఏకశిలాపురవాసికి - జేజే
క్ష్మాకన్యాసంయుతునకు - జేజే
లోకపాలనాపరునకు - జేజే
శ్రీకరగుణభూషితునకు - జేజే ॥రామ॥

### 30. ఆనందభైరవి రాగము, రూపక తాళము.

రక్షింపుదశరథబాలా – నన్ను
రక్షింతు వని నిన్ను – నమ్మితిఁ జాల ॥రక్షింపు॥

పాపము నైజము నాకు – నీ
ప్రాపొంది చెడినను – నపకీర్తి నీకు ॥రక్షింపు॥

నేనుజేసిన పాపచయము – నా
మానసమున నిల్వ – మతిగలిగె భయము ॥రక్షింపు॥

ఇతరులనేఁ గొలువనైతి – నా
మతినీపై నిలిచె నిం కేమిభీతి ॥రక్షింపు॥

వావిలికొలను సుబ్బార్యు – నీ
వేవిధమునఁ బ్రోచి దరిఁజేర్పఁ గలవో ॥రక్షింపు॥

### 31. హిందుస్థాని తోడి – త్రిపుటతాళము

పావనాంబుజలోచనా – ననుఁ
గావరా భవమోచనా ॥పావనా॥

నిన్ను నమ్మితినయ్య శ్రీపతీ – నన్నుఁబ్రోవు కృపామతీ
ఉన్న వారలనెన్న నామది – నెన్నఁడైననుభూపతీ ॥పావనా॥

ఎన్నఁగానాపాపజాలము – సన్ను తాహృతిచేయుమా?
తిన్నగాఁ గ్రమియించెఁగాలము – నన్నుఁ జేయకుజాలము॥పావనా॥

దాసమానసతోషణా – హరీ – భాసురామృతభాషణా
వాసురాయసుపోషణా – ధీ – భాసురాయసుభాషణా॥పావనా॥

### 32. శంకరాభరణము – ఆదితాళము

రామచంద్ర నిన్నెనమ్మితిరా – సామగానలోల నిన్నే ॥రామ॥

పాపవారణ చాపధారణ మోక్షకారణ
బ్రోవుమానను నాపాల శ్రీలోల నీవేళనిల్వర ॥రామ॥

దాసిహితుఁడను దీనపాపుఁడను ధైర్యహితుఁడను
నిన్నెనమ్మితివా – సుబ్బరాయాఖ్య దాసావనలోల ॥రామ॥

## 33. శంకరాభరణము – ఆదితాళము

సారసనయన – రామ – చంద్రనన్నుఁబ్రోవరా
సారెకు నీనామస్మరణ – సలుపుచున్న వాఁడరా ॥సారస॥

లేరు లేరు నిన్నుఁబోలు – వారలెంత వెతకినన్
వారక నీశరణువేఁడి – వచ్చియున్నవాడరా ॥సారస॥

రాతిని నాతిగఁజేసి – ఖ్యాతిఁబొందితౌ రౌర
క్రోఁతిగుంపుతోడ దైత్యుఁ – గొట్టివైచితౌరౌర ॥సారస॥

వావిలికొలను – సుబ్బఁడిపుడు – నిన్నె తలఁచెరా
కావుకావుమనుచుఁ – బాదాక్రాంతుఁడగుచుఁబిలిచెరా॥సారస॥

## 34. కాంభోజి – రూపకతాళము

వేంకటేశ్వర నన్నుఁ బ్రోవర – జాలమేటికయ్య – ॥దేవ॥

ఇంటివేలు పౌటమఱచి – యుంటిని – నిన్నాళ్లు మదిని
కంటి నీపాదయుగమును – గంటేటికి – దేవదేవ ॥వేంకట॥

నిన్నె నమ్మియున్నవాఁడరా – నన్నెటులు – చేపట్టఁగలవొ
అన్నె మెఱుఁగఁ – బున్నె మెఱుఁగ – మన్నాథుఁడ వని
మదిని నేఁ దలఁచితిని ॥వేంకట॥

హాసభాసితాంబుజాస్య – శ్రీసమేతశౌరి
హరీ హరీ – వాసురాయ – దాసవినుత
వాసికడపపురనివాస ॥వేంకట॥

### 35. కమాజు – ఏకతాళము

ప్రణుతభవవిరామము – శ్రీరామనామము
ప్రణయసుఖనిదానము – శ్రీరామనామము ॥ప్రణుత॥

శ్రీమదాంధధూరము – శ్రీరామనామము – ని
ష్కామమతి విహారము – శ్రీరామనామము ॥ప్రణుత॥

వాసురాయగేయము – శ్రీరామనామము ధీ
భాసురాయకార్యము – శ్రీరామనామము ॥ప్రణుత॥

### 36. హిందూస్తాని కాపి – ఏకతాళము

నిన్ను విడువరా – రామ – నన్నుఁబ్రోవరా – రామ
ఎన్నిమాటలైనఁ జెప్పు – నన్నుఁబ్రోవునంతదాఁక ॥నిన్ను॥

వెంకటేశ్వరా – భవ పంకనాశనా – పంతము – లేల
బొంకులేల నీ – మోముఁ జూపిలేని చాలు ॥నిన్ను॥

### 37. సౌరాష్ట్రరాగము – ఆదితాళము

అరుణారుణ నయనాంబుజ హరచాపవిభంగ
కరుణారస వరుణాలయ ఖగరాజతురంగ
ధరణీధర భరణాంచిత కరనఖరసుసంగ
రఘునందన రఘునందన చరణౌ తవశరణమ్ ॥ ॥అరుణా॥

అఘుశోషణ మఖపోషణ హతరాక్షసజాల
అఘుదూషణ ఖరదూషణ హరదుష్టవిఫాల
మఘువార్చిత పదపల్లవ మధుకైటభకాల
రఘునందన రఘునందన చరణౌ తవశరణమ్ ॥ ॥అరుణా॥
వాణీ శర్వాణీ గీర్వాణీధవ వినుత
పాణౌకృత క్షోణీసుత వీణాముని ఫణిత

ఘోణాయుధ చూర్ణీకృత క్రూరాసురనిచయ
రఘునందన రఘునందన చరణౌ తవశరణమ్ ॥ ॥అరుణా॥
స్మరసుందర ధృతమందర మమమందిరవాస
దరకంధర రుచికంధర దశకంధర మార
వరదాబయ కర దానవ వరదారణ శీల
రఘునందన బుధచందన చరణౌ తవశరణమ్ ॥ ॥అరుణా॥
వరవాసు సమాలాప సమాకృష్ట మనోజ్ఞ
పరవాసు సురూపానత పరరాజ సమూహ
కరవల్లవ పరిశోభిత ఖగచాపకలాప
రఘునందన బుధచందన చరణౌ తవశరణమ్ ॥ ॥అరుణా॥

### 38. పంతువరాళి – ఆదితాళము

ఎన్నిమాసము లాయెరా – నాకన్నతండ్రి
శ్రీరామచంద్రా – నిన్నెడఁబాసి ॥ఎన్ని॥

ఎన్నిమాసము లాయె – నిచట నే నిను విడిచి
యెన్నెన్ని దేశాలో – యెటులో తిరుగుచునుంటి ॥ఎన్ని॥

నీచరణములనె కొల్చి – ననుఁగన్నతండ్రి నీనామస్మరణచేసి
ఆచతురానన – హరశక్రముఖులైన
నోఁచనట్టి పదవి నొందనె యిట నుండి ॥ఎన్ని॥

కదుపునునెడఁబాసిన – కాకుత్థతిలక – మొదవును సరిపోలి నా
హృదయ రంగమున – నెంతో తాపము పుట్టె
సదయహృదయ యిట్లు – సలుపుట న్యాయ్యమ ॥ఎన్ని॥

నీపసికూన నన్ను – నెనరునఁ గనుమా నీరజదళలోచనా
నీపసిపాపని – నీపాదములనుండి
పాప నీరీతిని – బాడిగాదుర తండ్రి ॥ఎన్ని॥

నామేలు నీవు కోరి - నీదాస్యమున - స్వామినన్నిటులు నిల్పి
నీమహితశాసనము - నేఁ దలఁ దాలిచి
గ్రామ పర్యటనముఁ - గావించు చుండితి
గాసినన్నిటుపెట్టఁగా - రామయ్యతండ్రి - వాసివన్నెయుఁబెరుఁగునా?
వాసుదేవుఁడవీవు - వాసుదాసుఁడ నేను
భాసురముగ మన - వాసిఁదలంపుమి ॥ఎన్ని॥

ఏకశిలానాయకా - లోకైకరక్షక - శ్రీకర శుభదాయకా
ఏకాలమందైన - నేలోకమందైన
నేకారణంబైన - నెడఁబాయకుము నన్ను ॥ఎన్ని॥

**39.** కేదారగౌళరాగము - ఆదితాళము

దాసుఁడనైతిని నేఁడెకదా - హరి
దాసుఁడనైతిని నేఁడె కదా
దాసుఁడనైతిని - దాసదాసుల
దాసుఁడనైతిని - ధన్యుఁడనైతిని ॥దాసుఁడ॥

బంధము లన్నియు నూడెఁగదా - భవ
బంధము లన్నియు వీడెఁగదా
బంధుర ధన గృహ - బంధము లూడెను
బాంధవులగు హరి - భక్తులఁ గలసితి ॥దాసుఁడ॥

అందఱికంటెను నధముఁడ నంచును
నాలోచింపఁగఁ దెలిసెఁ గదా
ఇందిరపతియే శరణ్యుఁడంచును
డెందమునన్ దృఢపడియెఁ గదా ॥దాసుఁడ॥

రాముని నమ్మిన బంధము లన్నియుఁ
దామే యూడుట నిజము గదా

రాముఁడు తక్కఁగ దైవము లేఁడని
భూమిని జాఁటుట తగును గదా ॥దాసుఁడ॥

కామము క్రోధము లోభం బాదిగఁ
గడకును ద్రోయఁగఁ గంటిఁ గదా
రాముని శ్రీచరణాంబు జాతములఁ
బ్రాపుగఁగంటిని నేఁడెగదా ॥దాసుఁడ॥

అఖిలస్వంబును రాము సేవకై
యర్పించితి నిఁక హాయిగదా
నిఖిలము సీతారామ మయంబని
నిశ్చయపడుటే సుఖము గదా ॥దాసుఁడ॥

వాసిగ నేక శిలాపురధాముని
భజనము చేయుటె ముక్తి గదా
వాసుదాసుఁ డను విశ్రుతనామము
వాస్తవపడుటె శుభంబు గదా ॥దాసుఁడ॥

### 40. బేహాగ్ రాగము - ఆదితాళము

దాసోహమ్మని నందకు నేఁడిటు
ధన్యుఁడ నైతిని రాముకృపన్
పాసెను నిహభవబంధము లన్నియు
దాసులఁ గలసితి రాముకృపన్ ॥దాసోహ॥

వాసుదాసుఁడై వసుధను వెలసెద
వాస్తవముగ నిఁక రాముకృపన్
దోసిలియొగ్గుచు సర్వభూతములకు
తోధిమ్మాడెద రాముకృపన్ ॥దాసోహ॥

పండినదే యిఁకఁ బానుప నాకును
బయలనొ యింటనొ రామకృపన్
తిండి యదృచ్ఛాలబ్ధము హస్తమె
దివ్యసుపాత్రము రామకృపన్ ॥దాసోహ॥

గగనంబే యిఁకఁ గాంచనచేలము
కౌపీనంబో రామకృపన్
జగతీతలమే హంసతూలికా
శయ్యాఖట్వము రామకృపన్ ॥దాసోహ॥

అందఱు తండ్రులె యందఱు తల్లులె
యందఱు తోడులె రామకృపన్
అందఱు శ్రీహరి దాసులు నాకిఁక
నాత్మబంధువులు రామకృపన్ ॥దాసోహ॥

జంకక రాముఁడెస్వామి యటంచును
ఢంకా కొట్టెద రామకృపన్
కింకరులకు దిరునామము దిద్దెద
శంక లేక యిఁక రామకృపన్ ॥దాసోహ॥

రాము భజించెద రాముయుజించెద
రాము స్మరించెద రామకృపన్
కాముఁ ద్యజించిన కల్గదు కస్తి – న
గారా కొట్టెద రామకృపన్ ॥దాసోహ॥

ఏకశిలాపురధామునిఁ గాంచిన
నేకభక్తితో రామకృపన్
శోకము మోహము సర్వము వీడును
చేకుఱుమోక్షము రామకృపన్ ॥దాసోహ॥

వాసుదాసుఁ డిటు శపథము చేసెను
వా స్తవ మియ్యది రామకృపన్
కాసంతైనను రాముని నమ్మిన
మోసము లేదిల రామకృపన్ ॥దాసోహ॥

### 41. పీలురాగము – ఆదితాళము

శ్రీరఘురామం భజరే భజరే
సీతారామం భజరే భజరే
ఏరా మూఢా దిక్కులు చూచెద
నోరుమెదల్చిన సమసెదవా – నీ నోరు ॥శ్రీరఘు॥

రామా రామా రామా యనరా
రాజస మేలర పామరుఁడా
ప్రేమను రాముని భజనము చేసినఁ
గామము లన్నియు దీరునురా – నీకామము ॥శ్రీరఘు॥

అడవిని బెదరిన కాఱుపోతువలె
నట్టిటు చూచెద పామరుఁడా
గడియసేపు హరి భజనము చేసిన
కండలు కరఁగునె పామరుఁడా – నీకండలు ॥శ్రీరఘు॥

ప్రీతిని రారా రామభజన కని
పిలిచినఁ బలుకవు పామరుఁడా
వాతరోగమా పలుకు లుడిగెనా
వాఁతలు వేసిన సరిపోనా – నీకు వాఁతలు ॥శ్రీరఘు॥

తిండులెస్సదిని కండలు పెంచిన
బండెెఁడు కట్టెలకే గదరా
దండికింకరులు దాపరించు నెడ
ముండా నీ కెవ రడ్డమురా – ఓ ముండా ॥శ్రీరఘు॥

ఎద్దువలెం దిని మొద్దుతనము నను
గ్రద్దా యేటికిఁ దిరిగెదు రా
బుద్ధిగలిగి హరి పూజలు చేయుచు
సుద్దులు మానర పామరుఁడా – నీసుద్దు ॥శ్రీరఘు॥

తద్ధిం తైధిం తైధిమ్మనుచును
తాండవ మాడర పామరుఁడా
ముద్దులుపెట్టెడు నీముద్దుకొడుకులె
మొద్దులెత్తుదురు పామరుఁడా – నీకు మొద్దు ॥శ్రీరఘు॥

శ్రీరఘురామా యన నొల్ల వేనియు
ఛీ పో యావలఁ బామరుఁడా
ఘోరకర్మములు నిన్నుఁ బీఁకి తిన
నోరెట్లాడుర పామరుఁడా – నీ నోరెట్లాడుర ॥శ్రీరఘు॥

ఇయ్యెడ రాముని నామము నీకెటు
తియ్యన గాదది యెఱుఁగుదు లే
కుయ్యో మొఱ్ఱో యని నరకంబులఁ
గూఁతలు పెట్టఁగఁ దెలియును లే – నీవు కూఁతలు॥శ్రీరఘు॥

చుట్టలు బీడిల్ కాల్చు చు నూరక
చూచుచు నుండెడి పామరుఁడా
కట్టెకొఱవి నీనోటను దూర్చుచుఁ
గాల్తురు దూతలు పామరుఁడా – నినుఁగాల్తురు ॥శ్రీరఘు॥

వాదము లేటికిఁ బామరుఁడా – హరి
పాదముఁ బట్టర పామరుఁడా
వాదంబులు గాపాడం జాలవు
శ్రీదయితుఁడె గతి పామరుఁడా – నీకు ॥శ్రీరఘు॥

మత బేధంబుల మతవాదంబుల
హతుఁడైపోవకు పామరుఁడా
క్షితిని మతత్రయ సారముఁ గదరా
మతి శ్రీరామా యనుకొనరా – నీ మతి ॥శ్రీరఘు॥

ఈమత మామత మేమత మనుచును
నేటికి మొఱిగెదు పామరుఁడా
రామా రామా రామా యనుటకు
నేమతమడ్డము వచ్చునురా – నీకేమత ॥శ్రీరఘు॥

మూఁడు మతంబులు మూఁడు తత్త్వములు
మూఁడు మూర్తులును బామరుఁడా
మూఁడు జగంబులు శ్రీరామా యను
మూఁడక్షరములె పామరుఁడా – నీకు మూఁడక్షర ॥శ్రీరఘు॥

తారక మనునది రామ నామమే
గౌరీశున కది జప్యమురా
గౌరీపతి యా కాశిం జచ్చెడి
వారికిఁ జెప్పెడి దదియె కదా – వారికిఁ జెప్పెడి ॥శ్రీరఘు॥

వేదములను దలక్రిందుగఁ జదివిన
వాదగ్రామ సింహమవైన
లేదుర మోక్షము సీతారాముల
పాదముఁ బట్టక పండితుఁడా – నీవు పాదము ॥శ్రీరఘు॥

జ్ఞానినటంచును గర్మినటంచును
మానర గర్వము పండితుఁడా
జ్ఞానకర్మములు భక్తిలేనిచో
సర్వము వ్యర్థము పండితుఁడా – నీకుసర్వ ॥శ్రీరఘు॥

భజ గోవిందం భజ గోవిందం
భజ గోవిందం పండితుఁడా
భజయను శంకర సూక్తిని మది నిడి
భజనము సేయర పండితుఁడా – నీవు భజ ॥శ్రీరఘు॥

రాగద్వేషా సూయా మాత్స
ర్యంబులు విడువర పండితుఁడా
భాగవతుల శ్రీపదములఁ దలఁచుచు
భజనము సేయర పండితుఁడా – నీవు భజ ॥శ్రీరఘు॥

వాసుదాసుని బోధ వినక యిటు
పాడైపోయినఁ బామరుఁడా
గాసిల దూతలు కత్తులు మొత్తుచుఁ
గోసెడివేళలఁ దలఁపుమురా – నినుఁగోసెడి ॥శ్రీరఘు॥

**42. రాగము – ఏకతాళము**

రావయ్య రామదేవరా – ననుఁ గన్నతండ్రి
రావయ్య రామభూవరా
రావయ్య రాముఁడా – రవివంశసోముఁడా
యీవయ్య యభయము – నీవేళనా ముద్దులయ్య ॥రావయ్య॥

పాలవారిధిలోనఁ బండుచు – శరణన్నవారి
పాపకోటులను జెండుచు
బాలుండ వయి వట – పత్రంబుపైఁ బండి
కేళిగయోగనిద్ర – లీలగఁ గన్నతండ్రి ॥రావయ్య॥

సోమకాసురు పొట్టచీలిచి – వేదములఁ దెచ్చి
తామరసభవునకు నిచ్చి
ఆమందరము మోచి – యమర వర్యులఁగాచి
భూమిఁ గొమ్మున నెత్తి ప్రేమమునఁ గాచి తఁట ॥రావయ్య॥

దిక్కు నీవే యనుచు నమ్మి - హరి కలఁడని
నొక్కి నొక్కి చెప్పుచుండ
ఉక్కు స్తంభమునఁ బుట్టి - రక్కసు నుక్కుమడఁచి
గ్రక్కున బాలునిఁ గాచిన - చక్కని నారసింహ ॥రావయ్య॥

అదలుచు నాకవాసులు - బలిచక్రవర్తి
యడుగులసేవ సేయఁగా
వడుగుఁ బాఁపఁడవగుచు నడుగులు మూఁటినడిగి
పుడమి క్రిందికి బలిని నడఁగఁ ద్రొక్కినవేల్ప ॥రావయ్య॥

రాజసమున రాజవర్యులు - విప్రుల నేఁప
బ్రామ్మణుండవగుచుఁ బుట్టి
రాజులనెల్ల ఘో - రాజులలోనఁ ద్రుంచి
రాజబింబాస్యకొఱకు - రావణుఁ ద్రుంచినదంట ॥రావయ్య॥

గొల్లదాని యింటఁబెరిఁగి - పాలును వెన్న
గొల్లలుగఁ జక్క మెక్కుచు
గొల్లపిల్లలఁ గూడి - పిల్లాట లన్ని యాడి
పెల్లగు భూమి భరము నెల్లనణఁచిన కృష్ణ ॥రావయ్య॥

లోకము రక్షింపఁగోరి - సౌమిత్రియు
భూకన్య సేవింపఁగా
నేకశిలాపురి చేకూర్చి వాసముగ
ప్రాకటశ్రితుల నేలు వాసుదాస వరద ॥రావయ్య॥

### 43. శంకరాభరణము - ఆదితాళము

దేవాదిదేవుఁ డమ్మా - దివ్యసుకుమారుఁ డమ్మా
శ్రీవిలాసాత్ముఁ డమ్మా - చిన్ని రామచంద్రుఁ డమ్మా
సేవింపన్ - మది - భావింపన్
రావేసఖీ సమయ మిదే సేవింపన్ ॥దేవా॥

కౌసల్యాతనయుఁ డమ్మా - దాసకోటికిఁ గల్ప మమ్మ
వాసుదాస వరదుఁడమ్మా - భూసుతా సమేతుఁడమ్మ
భాసిల్లన్ - గనుఁగొని - వాసిల్లన్
పదవే సఖీ వేవేగన్ ॥దేవా॥

### 44. కేదారగౌళ - ఆదితాళము

జానకీదేవీ - కరుణదీవీ
సజ్జనావన - సద్గుణ నీవీ ॥జానకీ॥

క్షితివరాత్మజా - నతసురభూజా
శ్రీరఘునాయకా - హృన్మదభాజా
ధృతజలజాతా - హృతనతపాపా
హతదనుజాధిప - ధుతహితతాపా ॥జానకీ॥

సకల చరాచర - సత్యస్వరూపా
వికలిత దుర్మద - విమతకలాపా
చికురవినిర్జిత - శ్రీచంచరీకా
శ్రీపదసార్థకా - చిత్రచరిత్రా ॥జానకీ॥

వాసుదాసార్చిత - పాదసరోజా
దాసజనావన - భాసురలీలా
వాసవముఖసుర - వందితచరణా
హాసవిహసిత - సు - ధాంశుకకిరణా ॥జానకీ॥

### 45. పంతువరాళిరాగము - రూపకతాళము

ఇఁకనెప్పు డిఁక నెప్పుడో - నీపదసేవ
నీదర్శనము - ఇఁక నెప్పుడిఁక నెప్పుడో
ఇఁక నెప్పు డిఁక నెప్పు డిఁక నెప్పు
డిఁక నెప్పు డిఁక నెప్పు - డిఁక నెప్పు డిఁక నెపుడో ॥ఇఁక॥

ఎన్నిజన్మము లాయెరా - నిను నే విడిచి
యెన్ని కల్పము లాయెరా
ఎన్నఁడైనఁ జేతులెత్తి మ్రొక్కిన నీకు
నన్న యీవిధముగ నల్లాడను గాదే ॥ఇఁక॥

ఇఁకనేను సైఁపలేరా - ఈదారిగాసి
యిఁక నేనుదాళలేరా
యిఁకనైననామీద - నెంతో కనికరముంచి
వికలునిఁజేయకు - పెక్కు త్రోవలనీడ్చి ॥ఇఁక॥

రారమ్మ రారతండ్రి - హృదయగశత
ద్వారముల మూయు తండ్రి
ద్వారశతకము మూసి - భూరితేజము నడిమి
దారినాకేల్‌పట్టి - తడయక గొనిపొమ్ము ॥ఇఁక॥

బ్రహ్మపురి ను త్తరమున - ద్వారములోన
పయనమై పోవఁజేసి
బ్రహ్మేంద్రసన్నుత - బ్రహ్మాది దుర్లభ
బ్రహ్మపథంబున - బ్రాఁతినన్ గొనిపొమ్ము ॥ఇఁక॥

నాకేలుపట్టుకొమ్ము - నాగేంద్రశయన
నీకేలు విడువకుమీ
నాకేలు నీవుపట్టి - నన్నటు గొనిపోవఁ
బ్రాకటాతివాహి - కాళియెదుర్కొనుట ॥ఇఁక॥

ప్రాకృతమండలమును - భావజ జనక
వరుసగ దాఁటి దాఁటి
వైకుంఠపుర నికట - భాసిత విరజాఖ్య
ప్రాకృతనదిని నేఁ - బరికించుటెన్నఁడో ॥ఇఁక॥

యాత్రార్థమై నిలిచిన - హరిహరి సూక్ష్మ
మైన దేహము దీఱి
గాత్రహీనత సం - కల్పమాత్రంబున
నాతరంగిణి యుత్తరావనిఁ జేరుట ॥ఇఁక॥

సోమసవనములఁ గాంచుచు - నావలఁ దివ్య
నామక కుజముఁ జేరి
దీమసమున నీదు - దివ్యగంధముఁజిచ్చి
రామ సాలబ్జాఖ్య - భూమిఁ గనుటెన్నఁడో ॥ఇఁక॥

హరిదివ్యర సముఁజొచ్చి - యపరాతము
నంతికమును జేరుచు
హరిదివ్య తేజము - నందు నేఁ పొర
భూరిగోపురముల - ద్వారము దర్శించు ॥ఇఁక॥

వైకుంఠనగరిఁజిచ్చి - యందలి సూరి
వర్గము లాదరింప
లోకమాతయు నీళ - భూకాంతయును బ్రేమ
నాకడ కరుదెంచి - నను బుజ్జగించుట ॥ఇఁక॥

పరదేశమెపుడో చనిన - స్వతనుజుండు
మరలి యింటికి వచ్చిన
కరణినె తల్లులు - కరుణ నాదరింప
హరియును నెదురుగ - నరుదెంచి చూచుట ॥ఇఁక॥

హాటకసువిమానము - హరి ననుఁజేర్చి
యానంద మంటపమున
పాటిగా విలసిల్లు - ద్వారస్థపార్షదులు
సూటిగ ననుఁబ్రేమఁ - జూచి మన్నించుట ॥ఇఁక॥

ఆవైనతేయు మ్రొక్కి - యానిత్యసూరుల
యమలిన గోష్ఠిఁ జొచ్చి
యావలమూర్తులౌ - నాయుధాభరణాది
దేవతలఁ బరిచరుల - సేవింపఁ గలుగుట ॥ఇఁక॥

అగరాజుఁజేరి యచట - నాచార్యులకు
నాదటఁ గేలుమోడ్చి
ఖగరాడ్వాహుని - కనకసింహాసనమున
నగుమోముఁగలవాని - ననుపున దర్శించు ॥ఇఁక॥

శ్రీదేవితోడఁగూడి - భూమియు నీళ
మోదమున సేవింపఁగ
సాదరుఁడగు హరి - పాదాబ్జయుగళము
నాదు శిరమున మ్రొక్కి - యంకముఁ జేరుట ॥ఇఁక॥

కోసి నీవంచునడుగ - నే - వాసుదాసుఁడ
నీసన్నిధిని నిల్వఁగా
నీసేవఁజేయుచు - నిరతిశయానంద
శ్రీసాగరము మున్గఁ - జేయు మాజ్ఞయనుట ॥ఇఁక॥

నిలువు నాయొద్దననుచు - శ్రీరమణీశుఁడు
పలికిన సంతసించి
జలజాక్ష నీపాద - సరసిజభక్తులు
గలరు నామిత్రులు - పిలుపింపుమనియనుట ॥ఇఁక॥

నావచన మాలకించి - నారాయణుఁడు
శ్రీవిష్వక్సేనుఁగాంచి
యీ వీని హితులను - సేవకసభ్యుల
వేవేగఁ బిలిపింపు - మీవిచ్చటి కనుట ॥ఇఁక॥

వారెల్ల రాఁగఁజూచి - వారలతోడఁ
దీరని కైంకర్యము
వారకచేయుచుఁ - బరమాద్భుతానంద
వారిధిలో మున్గి - వర్ధిల్లుటెన్నఁడో ॥ఇఁక॥

### 46. శుద్ధతోడి - రూపకతాళము

పాహి రామచంద్ర దేవా - పాహి భూమిజాధవా
పాహి మహాసుప్రభావా - పాహి పాహి మాధవా ॥పాహి॥

నీదు పాదములను బడితి, నీదు దాసురాలనంటిన్
పాదయుగము క్రేవనిలిపి, యాదుకొనుము కన్నతండ్రి॥పాహి॥

దిక్కులేని దాసనేను, ప్రక్కప్రాపునైన లేదు
మ్రొక్కుదాన రామచంద్ర, దిక్కుపక్కమునీవేకమ్మీ ॥పాహి॥

వాసుదాస వరదుఁడవని, వాసి విన్న దానరా
వాసుదాసు తనయనే నా, వాసిఁ దలఁచి కావరా ॥పాహి॥

### 47. కళ్యాణిరాగము - రూపకతాళము

కంటిఁ గంటి జానకీశ్వరా, నా - కఱవు దీరనేఁడు ॥కంటి॥

కంటిఁగంటి నీదుపాద, కంజయుగము నేఁడు ము
క్కంటి వేయికంటి కైనఁ, గానరానివాని నిచట ॥కంటి॥

రాతి నాతిఁ జేసి బలిని, బాతాలమున నణఁగ ద్రొక్కి
ప్రీతి వియద్గంగానదికిఁ, మాతగనైన పాదయుగళి ॥కంటి॥

వాసుదాసుఁ దనుదినంబు, భక్తిఁ బూజ చేయుచుండు
దాస కామితార్థదముల, నాస దీర నీ పాదములఁ ॥కంటి॥

### 48. బేహాగ్ రాగము - ఆదితాళము

కౌసల్యాతనయ విభో! రామ! దాసోహమ్
దాసాఘ హరీ! శౌరి! నృహరీ! దేవ దాసోహమ్ ॥ ॥కౌసల్యా॥
మదనపితా! బాణహత మాయాసారంగా
విదితమహా - బల! సువాహా - కలితవిహంగా ॥॥కౌసల్యా॥
భాసురద రా - లంకృతకరా! వాసుదాసోహమ్ ।
వాసవనుత పాహితవ - పాదదాసోహమ్ ॥ ॥కౌసల్యా॥

### 49. హిందుస్థాని ముఖారి - అటతాళము

నీ పాదములను నమ్మి - నీప్రాపునందుఁ జేరి
ఏపాటులైనఁ బడుట - యిట్టు, నీవు సేయుటకా
కానీలే - రామ - కానీలే
విడువనులే - జడియనులే - సడలనులే - బడలనులే ॥॥నీ పాద॥
తెఱఁగును నే - నెఱుఁగుదులే - అదరనులే
బెదరనులే - వదలనులే - కదలనులే
కొట్టినఁ గొట్టు - మొట్టిన మొట్టు - తిట్టినఁ దిట్టు
కట్టినఁ గట్టు - నెట్టిన నెట్టు - పట్టిన పట్టు
విడిచి నిన్నుఁబోనులే - యెడలఁబాసిపోనులే
ఇంతకుమించి - చింతలముంచి
యేమిసేయగలవులే - కానీలే - రామ - కానీలే ॥నీ పాద॥

### 50. కేదారగౌళము - ఆదితాళము

శ్రీరామ శ్రీధామ - శృంగారధామా
శ్రీధామ రఘురామ - సీతాభిరామా ॥శ్రీరామ॥

జానకీ హృదయేశ - శాశ్వత్ప్రకాశా
దానవాంతక లోక - త్రాణవికాశా ॥శ్రీరామ॥

దాసోహమ్ దీనోహమ్ - దశరథపుత్ర
త్రాసము మాన్పుము - రాజీవనేత్రా ॥శ్రీరామ॥

అనన్యగతికోహ - మరవిందనాభా
మనుగడ గూర్పుము - మదనాయుతాభ ॥శ్రీరామ॥

పాహి పాహి నీదు - పదములఁ బడితి
స్నేహముఁ బాయక - చేపట్టుమంటి ॥శ్రీరామ॥

రామా రామా రామా - రఘురామ రామా
రామా రామా రామా - రఘురామ రామా ॥శ్రీరామ॥

వాసుదాసవరద - వాసవ దరద
భాసురగతినేలు - పట్టాభిరామా ॥శ్రీరామ॥

దండంబు దండంబు - దశరథతనయ
దండి ప్రాపైనన్ను - దరిఁజేర్పవయ్య ॥శ్రీరామ॥

## 51. హిందుస్థాని తోడి

రామచంద్ర నన్నుఁ గావరా - సదయాంతరంగా
రామచంద్ర నన్నుఁబ్రోవు - కామితముల నొసగికావు
సామజవర రక్షకా నేఁ
బామరుఁడనుదీనుఁడను పావుఁడను - వేఁడెదను ॥రామ॥

భూమిజాహృదయనాయకా - కామారివినుత
భూమిజావిమల హృదయ - పుండీరకదివ్యభవన
సోమసూర్యనయన శ్రీ - ధాముఁడవని
రాముఁడ వని - భీముఁడవని - వేఁడెదనిను ॥రామ॥

ప్రణతసులభ దీనరక్షకా - శ్రీవాసుదాస
ఫణితవాక్యలోల మానసా - ప్రణతరక్ష దీనసులభ

మణిమయాంచితోరు మకుట - ఫణిగణేశతల్పనే
వినయమున - సనయముగ - ననయమును - వేఁడెదను॥రామ॥

### 52. యదుకులకాంభోజి - రూపకతాళము

రామవిభో - సదయ యిదో
ప్రణతి - ప్రణతి - ప్రణతి ॥రామ॥

అమలధరణీ - తనయాహృదయా - విమలకమలభవనవినుము
ప్రణుతి - ప్రణుతి - ప్రణుతి - ప్రణుతి ॥రామ॥

అభవ జగతీ చక్రవాళ - వ్యాప్తసుయశో - విభవనీకు
జయము - జయము - జయము -జయము ॥రామ॥

నీదుచరణాంభోజ సేవా - మోదవాసుదాస వినుత
శుభము - శుభము - శుభము -శుభము ॥రామ॥

### 53. హిందుస్తాని కాపీ - ఆదితాళము

రాముని మఱవకువే - మనసా - రాముని మఱవకువే ॥

రాముఁడు జగదభి - రాముఁడు సీతా
రాముఁడు నాపరం - ధాముఁడు గాఁడఁటె ॥రామ॥

రాముఁడు మేఘ - శ్యాముఁడు జితశత
కాముఁడు సద్గుణ - ధాముఁడు గాఁడఁటె ॥రామ॥

రాముఁడు రవికుల - సోముఁడు రణతల
భీముఁడు పావన - నాముఁడు గాఁడఁటె ॥రామ॥

రాముఁడు రక్షిత - భాముఁడు సుగుణ
స్తోముఁడు కరుణా - సీముఁడు గాఁడఁటె ॥రామ॥

రాముఁడు వినమిత - భీముఁడు మర్దిత
భౌముఁడు దైవల - లాముఁడు గాఁడఁటె ॥రామ॥

వాసుఁడు పాలిత - వాసుఁడు పీతసు
వాసుఁడు రక్షిత - దాసుఁడు గాఁడఁటె ॥రామ॥

**54.** కాపీరాగము - ఆదితాళము.

రారా శ్రీరఘురామా - రారా పట్టాభిరామ
రారా సద్గుణధామ - రారా కల్యాణనామా ॥

పిననాఁడె తాటకను - బిలుకుమార్చినదంట
ననునేలు కరుణతోడ - నాపాలి వేలుప రామ ॥రారా॥

ముద్దుమోమునఁ జిన్ని - ముంగురులు వ్రేలుచుండ
గద్ధతివై మౌని - క్రతువుగాచిన తండ్రి ॥రారా॥

జునపాలు శిరమందు - సుందర మగుచునుండ
జనులెల్లఁ జూడ శివుని - చాపము ద్రుంచినతండ్రి ॥రారా॥

జనకుని సత్యవాది - సలుపఁగ మదినెంచి
వనములఁ బడియునాల్గు - వర్షము లుండినతండ్రి ॥రారా॥

వంచన చేయఁగ నెంచిన - క్రించు మారీచుఁబట్టి
చించి చెండాడినట్టి - చిన్మయరూప రామ ॥రారా॥

ముచ్చు రావణు ననిలో - వ్రచ్చి సురలొప్పంగఁ
గ్రుచ్చి కౌగిఁట సీత - వచ్చితి మరలఁ బురికి ॥రారా॥

ఏకశిలావాస - యిందిరాహృదయోల్లాస
ప్రాకటగతి నేలు - వాసుదాసావనలోల ॥రారా॥

**55.** రాగము - తాళము.

రామా ననుఁబ్రోవవే - ఏకశిలా
ధామా ననుఁగావవే ॥రామా॥

రామా జలధర - ధామా - పరిపూర్ణ
కామా సౌందర్య - కామా - రఘురామా ॥రామా॥

ధీరా వనమాలా - హారా - స్వైరవి
హారా యాజికు - మారా - రఘువీర ॥రామా॥

హేలా దశరథ - బాలా - దుష్టవి
ఫాలా సద్గుణ - జాలా - రసఖేల ॥రామా॥

గోపా రవికుల - భూపా - హతనత
పాపా ధృతశర - చాపా - జితకోప ॥రామా॥

## 56. అభేరీరాగం - ఆదితాళము

ననుఁ గావ దయలేదా - నాపాలివేల్ప
నిను నమ్మినాఁడ శ్రీ - సురనుత యీ ॥నను॥

ధరణీసుత నీకుఁ - బరిచర్యసేయ
సురవర్యులు జేజేల్ - సేవలుసేయ - మఱపొందితివేమో॥నను॥

సిరులీయ నేవేఁడను భయమేల రఘువీరా
కరులైన హరులైన యాచింపని వాఁడ
త్వరితంబుగ నేల నీవిటురారా
వాసుదాసనుత - యీ ॥నను॥

## 57. దేవగాంధారి - ఆదితాళము

ఇందుసుందర వదనా - ధృత
మంథర కంధి సదనా ॥ఇందు॥

నందుని సుందరి - కుందును డింపఁగ
నందనుఁడ వైనావురా - రామా ॥ఇందు॥

వందే యనినవారి - నాక్షణమ పాలింప విన్నానురా
మందులౌ కామ - దాసుల గర్వము
మాపినది కన్నానురా రామా ॥ఇందు॥

డెందమందు నీ - నామము నాటఁగ
నానందమున మన్నానురా
ఇందిరనాథా - వాసుదాసార్చిత
ఇంకనన్ గావ రారా - రామా ॥ఇందు॥

## 58. తోడిరాగము - ఆదితాళము

ఇదివినర నరుఁడా / జీవా - మేలొందెదీవు
ఇది విను హితమును - ముదమున మేలొదవు
వదలకు శ్రీహరి - పాదములు నెపుడైన ॥ఇది॥

ఆఁకలి దప్పులు - నఘములు మృత్యువు
శోకము గలుగని - శుభలక్షణుండవు
ఏకరణి నీకిటు - లీతాపమొదవె
లోకములోన నా - లోచనంబునఁ జూడు ॥ఇది॥

జగదీశుఁ డయినట్టి - శౌరియే నీదుపిత
జగముల తల్లి శ్రీ - సాదర జనయిత్రి
అగణిత ప్రీతిని - నిన్నంచు నుందురు
వగపునఁ దపింపఁగ -వలసెను నీకేల ॥ఇది॥

మేలుమఱచి నీవు - మేనివి ఘనముగఁ
బాలనము చేసి - పాపము లొనరించి
బాళిని రాముని - పదములన్ భక్తిలేక
బాలిశా! దుఃఖములను - బడితివి వింటే ॥ఇది॥

## 59. దత్తం భజే - మాదిరి

రామంభజే రఘు - రామంభజే
భూమి సుతామణి - రమణంభజే ॥రామం॥

రావణదైత్య వి - రామంభజే
రఘుకుల వారిధి - సోమంభజే ॥రామం॥

ఇందీవరదళ - ధామంభజే
ఇందిరా సుందరీ - ధామంభజే ॥రామం॥

తుళసీనవదళ - ధామంభజే
కలితాఖిల స - త్కామంభజే ॥రామం॥

ఏకశిలాపుర - వాసంభజే
ప్రాకటలీలా - రాసంభజే ॥రామం॥

రక్షిత శ్రీవాసు - దాసం భజే
శిక్షితలోక - త్రాసంభజే ॥రామం॥

## 60. జంఝూటిరాగము - ఆదితాళము

సీతాపతి హరి - శ్రీశమురారీ
చిత్రచరిత్రక - దుష్టవిదారీ
శ్రీ తరుణీ హృద - యాబ్జవిహారీ
స్వీయజనావన - శీలకశౌరీ ॥సీతా॥

దాసజనావన - రక్షా శీలా
వాసుదాస పరి - పాలనలోలా
వాసవనుత సౌ - వర్ణసుచేలా
కౌసల్యాపతి - ముద్దులబాలా ॥సీతా॥

### 61. పీలురాగము - ఆదితాళము

రాముని భజనము - రారే సేయcగc
ప్రేమము తోడుతc - బ్రియులారా
రాముcడు సీతా - రాముcడు హృదయా
రాముcడు కాcడటె - ప్రియులారా ॥రాము॥

గజపతి వరదుని - భజనము చేసిన
కలుషము లడcగునె - ప్రియులారా
అజహర ముఖ్యులు - నహములు నిశలును
అర్చింతురె హరిc - బ్రియులారా ॥రాము॥

అనంతుశౌరిన్ - ఆదిమదేవున్
ఆరాధింపరె - ప్రియులారా
నానావిధముల - నటనము సేయక
నారాయణుc గొలుc - డయ్యలారా ॥రాము॥

ఏకశిలాపుర - వాసుని రాముని
ఏకభక్తిcగొలుc - డయ్యలారా
మీకీ రెండవు - లోకంబులలో
మేలిమి గలుగును - బ్రియులారా ॥రాము॥

### 62. పంతువరాళి - ఆదితాళము

అదిగో మా యొంటి - మిట్ట - యదిగోc గనుcగొనుcడీ
సదయుcడు శ్రీరఘురాముcడు సీతా -
సతితో లక్ష్మణుతోడ వసించెడి ॥అదిగో॥

దండిగ మునిజన - దండముcగావ cగో
దండియగుచు శ్రీ - రాముండుండెడి ॥అదిగో॥

అంటువిడిచి యే - జంటలేక ము
క్కంటి భజించెడి - దేవుండుండెడి ॥అదిగో॥

మూఁడుమూర్తులిట - మదమున నుండుట
మూఁడు గోపురముల - ముద్దులు గులికెడి ॥అదిగో॥

భవహరముగ - రఘువరు శరమున - నీ
భువి జనియించిన - తీర్థంబుండెడి ॥అదిగో॥

పరమభాగవత - చరణరజంబునఁ
జరమపవిత్రతఁ - బరగెడి నగరము ॥అదిగో॥

వాసుదాసముఖ - దాసజనము ని
వాసముగాఁ గొన - వాసి చెలంగెడి ॥అదిగో॥

అభయవరదచా - పాంకితహస్తుఁడు
విభవముతోడుత - వెలయుచు నుండెడి ॥అదిగో॥

**63.** రాగము - ఏకతాళము

ఓం నమో నారాయణాయ
ఓం నమో నారాయణాయ
ఓం నమో నారాయణాయ
ఓం నమో నారాయణాయ ॥ఓం నమో॥

లలితగుణ మనోహరాయ - లక్ష్మీసమేతాయ
దళితదైత్యవరబలాయ - దర్పకశత సుందరాయ ॥ఓం నమో॥

శమితభక్తభవచయాయ - నమదదితిజపురహరాయ
విమతజనమదహరాయ - అమితదయారసభరాయ॥ఓం నమో॥

జ్ఞానరసాకారాయ - జ్ఞానరస గుణగృహాయ
యానకృతవినాయకాయ - ధ్యానరతవైమానికాయ॥ఓం నమో॥

హేమకశిపుకాలాయ - హేమకశిపులోలాయ
హేమకశిపుదూరాయ - హేమవర్ణ కేశాయ ॥ఓం నమో॥

సామజవరరక్షకాయ - సామజవరశిక్షకాయ
సామగుణ జనప్రియాయ - శ్యామసుందరగాత్రాయ॥ఓం నమో॥

సర్వపాపభంజనాయ - శర్వచాపభంజనాయ
ఖర్వరూపశోభితాయ - గర్వితజనభీతిదాయ ॥ఓం నమో॥

వాసుదేవ రూపాయ - వాసుదేవ కీర్తితాయ
వాసుదాస పాలకాయ - దాసవిమతఫాలాయ ॥ఓం నమో॥

ఏకశిలావాసాయ - లోకశోకనాశకాయ
ఏకబాణ భాషణాయ - ప్రాకట దివ్యభూషణాయ ॥ఓం నమో॥

**64.** రాగము - ఆదితాళము

ధంకా వాయించెద - శ్రీరాముల జయ
ధంకా వాయించెద ॥ధంకా॥

జంకక కొంకక - శంక యింతయు లేక
పంకజాక్షి సీతా - ప్రాణేశ్వరు - జయ ॥ధంకా॥

నిండఁగ జగతిఁ గో - దండ రామునికీర్తి
డం డాం - ధం ధాం ధాం ధాం ధామ్మని జయ ॥ధంకా॥

కుంఠిత దశకంఠ - శుంఠతేజ తాళాల్
ఠం ఠం - ఠం ఠం - ఠం ఠ - మ్మని మ్రోయ ॥ధంకా॥

రాజిత రవివంశ - రాజరాజేశునకు
జేజే - జేజే - జేజే - జేయని ॥ధంకా॥

కహ్వా సురదర్ప - కాలా నిను జనులు
వహ్వా, వహ్వా, వహ్వా యని మెచ్చ ॥ధంకా॥

అబలా భక్తజన - తార్తి హరా రామ
సెబాస్ - సెబాస్ - సెబాసని పొగడ ॥ధంకా॥

వాసుదాసవరద - స్వామి సీతారామ
దాసోహమ్ - దాసోహమ్ - దాసోహ మనుచును ॥ధంకా॥

## భక్తి విజయ ధ్వజగానము

### 65. జెండాపాట

సీతారాములజెండా - యమ - భీతులకును గైదండ
జాతమోదమున - శౌరి స్మరించెడి
భ్రాతలార యిది - బంగరుకొండ - ॥సీతారాముల॥

శ్రీరఘురాములజెండా - భవ - భీరులు నిల్వఁగవండా
ఘోరపాపములఁ - గుందెడివారలు
కోరినఁగాచును - గొబ్బున రండా - ॥సీతారాముల॥

రామస్వాములజెండా - సుఖ - కాముల కల్పపుమండ
సామజ వరదుని - సతతముఁ దలఁపని
పామర జనముల - పాలరదండా - ॥సీతారాముల॥

సీతాకాంతునిజెండా - అఘ - జాతమునఱుకఁగ ఖండా
సీతారామా సీతారామా
సీతారామా యనుడు నోరెండ ॥సీతారాముల॥

భక్తసువరదునిజెండా - అను - రక్తిని బట్టఁగరండా
భక్తితోడ హరి - భజనముసేయక
ముక్తికి దవ్వై - పోర పొషండా - ॥సీతారాముల॥

శ్రీహరి సుభక్తిజెండా - ఓరి - స్నేహిత పట్టుకొనుండా
సోహమ్మని బ్రహ్మాస్మి యటంచును
మోహమ్మునఁ జెడిపోవకరండా - ॥సీతారాముల॥

శ్రీసీతాపతిజెండా - రామ - దాసులార పట్టుండా
దాసోహమ్మని దాశరథాంఘ్రి
న్యాసమునను సౌ - ఖ్యంబుగనుండా ॥సీతారాముల॥

శ్రీసీతాపతిజెండా - రామ - దాసులమెడ పూదండ
వాసుదాసుని - స్వాంతకమలమును
భాసిలఁ జేసెడి - ప్రాచియారెండ - ॥సీతారాముల॥

**66.** శ్రీరాగము - ఏకతాళము

లాలి శ్రీహనుమంత - లాలి గుణవంత
లాలి యశోవంత - లాలి ధీమంతా ॥లాలి॥

అంజనాగర్భంబు - నందు జనియించి
అంజికలే కర్కు - నిం గబళించి ॥లాలి॥

రంజిల్ల నాకాశమున - కుద్గమించి
తంజగా నిన్నెన్న - నేర్తురెవరయ్యా ॥లాలి॥

కాళికేశ్వరునంశ - మున సంభవించి
హేలిచే సర్వవి - ద్యలను గ్రహియించి
హేలిగా రక్కసుల - గర్వము నడంచి
లీలగా - వెలసితివి - వీర్యమున మించి ॥లాలి॥

వాసుదాసుని నేక - శిలకు రప్పించి
కౌసలేశుని కార్య - ములను దీర్పించి
దాసకోటులనెల్ల - దయను రక్షించి
వాసిగంటివి నీవు - సంజీవరాయా ॥లాలి॥

## హనుమ మంగళం

### 67. మంగళహారతులు

రామచంద్రదాసాయ - భూమీజార్తినాశాయ
కామరోషవర్జితాయ - స్వామి మంగళం ॥రామ॥

అంజనాపుత్రాయ - కుంజరప్రియ పౌత్రాయ
రంజితాత్మభక్తాయ - రమణ మగళం ॥రామ॥

దనుజలోక భీకరాయ - మనుజలోక శ్రీకరాయ
దినపతనయ సచివాయ - దివ్యమంగళం ॥రామ॥

బ్రహ్మచర్యదీక్షాయ - బ్రహ్మలబ్ధ సద్వరాయ
బ్రహ్మాస్త్రపండితాయ - భవ్యమంగళం ॥రామ॥

వాసుదాస హృదయ కమల - వాసాయ పంచవదన
భాసాయ కీశలోక - పాల మంగళం ॥రామ॥

## ప్రభాత సేవ

## మేలుకొలుపు

### 68. భూపాల రాగము - అటతాళము

మేలుకో రఘురామ - మేలుకో గుణధామ
మేలుకో శుభనామ - మేలుకో
మేలుకో కౌసల్య - మేలిమిఁ గన్నట్టి
బాలమోహనరామ - మేలుకో ॥రామ మేలుకో॥

అరుణోదయం బయ్యె - నర్కుఁడు పొడతెంచుఁ
దరణి కులదీపక - మేలుకో
తరుణులు గీతములు - తడయక పాడెదరు
కరుణాసాగర రామ - మేలుకో ॥రామ మేలుకో॥

సీతమ్మ యిదె లేచి - చేత నద్దముఁ బూని
చేరి యున్నదయ్య - మేలుకో
బ్రాఁతిగఁ బాదుకలు - భరతుఁడు దెచ్చెను
సీతాహృదయేశ్వర - మేలుకో ॥రామ మేలుకో॥

ధర్మరక్షణకాంక్షా - ధరణి జనియించిన
దశరథనందన - మేలుకో
ధర్మము నశియించె - దాని నుద్ధరింపఁ
దడయక యిఁక నైన - మేలుకో ॥రామ మేలుకో॥

నీదు సేవకులెల్ల - నీదు దర్శనకాంక్ష
నిలఁబడియున్నారు - మేలుకో
కోదండరాఘవ - గుఱుతుగ వారల
నాదరింపవలయు - మేలుకో ॥రామ మేలుకో॥

ఏకశిలాపురిని - నెలమిని వసియించు
లోకరక్షణశీల - మేలుకో
నీకరుణాపాత్రుడు - నీవాసుదాసుఁడు
నీకృతిఁ గీర్తించు - మేలుకో ॥రామ మేలుకో॥

**69.** భూపాలరాగము - అటతాలము

మేలుకో శ్రీరామ - మేలుకో శ్రీధామ
మేలుకో గుణధామ - మేలుకో
మేలుకో కౌసల్య - మేటితపమునఁ గన్న
బాలక రఘురామ - మేలుకో ॥రామ మేలుకో॥

ఇరులు పలచనపాటె - నరుణోదయం బయ్యెఁ
తరణికులదీపక - మేలుకో
సరసీరుహములు - వరుసగ వికసించె
సరసిజలోచన - మేలుకో ॥రామ మేలుకో॥

కలకల మనుచును - పులుగులు గూసెను
తెలతెలవాఱెను - మేలుకో
వలనుగ సంధ్యను - వార్వ వేళమయ్యె
జలరుహహితవంశ - మేలుకో ॥రామ మేలుకో॥

నీవు కన్నులు విచ్చ - నెగడును లోకములు
నీవు కన్నులు మూయ - నిదురఁ జెందు
భావజజనక నా - పాటలు విని నిద్ర
లేవయ్య శ్రీరామ - మేలుకో ॥రామ మేలుకో॥

## అపరాధము

**70.** యదుకులకాంభోజిరాగము - రూపకతాళము (కురుజంపె)

అపచారములు చేసి - యపరాధి నైతి నిటు
కృపనెట్లు గాచెదో - రామా ॥అప॥

చేయరానివి యెన్నో - చేసి బవిసాటితిని
అదియేమి పాపమో - రామా ॥అప॥

చేయంగఁ దగుగాని - చేయ లేదొక్కటియు
నదియేమి పాపమో - రామా ॥అప॥

ఉపచారమనుపేర - నపచరించితి నయ్య
యిది యేమి కర్మమో - రామా ॥అప॥

నిండు మనసు నీకు - దండమైనను బెట్ట
నదియేమి పాపమో - రామా ॥అప॥

మనసు నిలుకడచేసి - స్మరియింపలేనైతి
నదియేమి పాపమో - రామా ॥అప॥

చేయారc బూలc బూ - జింప సోమరినైతి
నదియేమి పాపమో - రామా ॥అప॥

భజియింపనోరారc - బ్రాలుమాలిక పుట్టు
నదియేమి పాపమో - రామా ॥అప॥

ప్రేమమున నోరార - రామయన నైతిcగద
అదియేమి పాపమో - రామా ॥అప॥

విపరీతవర్తనము - విడువలే దొకటైన
నదియేమి పాపమో - రామా ॥అప॥

ఏకశిలావాస - యిందిరాహృదయేశ
మాం పాహి - పాపినమ్ - రామా ॥అప॥

వాసుదాసుcడు వీcడు - దాసోహ మని నాcడు
త్రాసంబు మాన్పుమీ - రామా ॥అప॥

**71.** కల్యాణి - ఆదితాళము

నిన్నె నమ్మియున్న వారము శ్రీరామచంద్ర
నీవే గతి యంచన్నవారము
నీవె మాకు పరమగతివి నీవె మాకు పరమదైవము
నీవె మాకు తల్లివి తండ్రివి నీవె మాకు తోడుమీద ॥నిన్నె॥

అజుcడు వ్రాసిన యాయువందు నర్ధమేగె నిద్రయందు
గజమన మత్తిల్లి తిరుగగcగడమ సగము పాడైపోయె ॥నిన్నె॥

పాలుత్రాగుచుc గొంత పోయె బాలక్రీడల కొంత పోయె
ఆలితోcడ గొంత పోయె ఆలోచనతో అంతయుcబోయె॥నిన్నె॥

ఆపదలందు నాదుకొనరు అడ్డమైన నొకరు రారు
సాపాటు చుట్టాల నమ్మి స్వామి యయ్యయ్యో చెడితిని ॥నిన్నె॥

రామ కృష్ణ యనుచు నీదు నామమైన నుడువనైతిని
స్వామి నాగతి యేమిగ నున్నదొ శరణు శరణు శరణు దేవ ॥నిన్నె॥

చేసినదే మరి చేయుటాయె సిగ్గువిసుకు మరి లేదాయె
దాసత్వము కొల్లబోయె చేసెడిదేమో తోఁపదాయె ॥నిన్నె॥

దానధర్మము లేదాయె మానమేమో వీసరబోయె
దేనికిని కొలగాదాయె దీనుని బ్రతుకు వ్యర్థమాయె ॥నిన్నె॥

కాలుఁడేమో కరుణలేఁడు కాలమేమో నిలువఁబోదు
వేలయేండ్లు బ్రతికి కుడువఁగ విడువని యాశ మెండాయె॥నిన్నె॥

అహంకారము విడువఁబోదు అహమర్థము స్మరణకు రాదు
అహితకృత్యము మానఁబోను విహితకృత్యము చేయబోను॥నిన్నె॥

వాసుదాసుఁడు నీదుసేవ చేసెద నంచు నున్నవాఁడు
నీ సంకల్పము యెటులున్నదొ ఓసీతాహృదయనాథ ॥నిన్నె॥

## వందనము

**72. పూర్వికల్యాణి రాగము – ఆటతాళము**

వందే రఘురామం – వారిదధామం ॥వందే॥

వందే రామం – పావననామం
బృందారక పర – సౌఖ్యవిరామమ్ ॥వందే॥

స్మరశత సన్నిభ – మంజులదేహం
విరచిత విమల – పయోనిధిగేహమ్ ॥వందే॥

పరిధుత గౌతమ – పత్నీశాపం
వరబల విదళిత – స్మరహరచాపమ్ ॥వందే॥

ఏక శిలానగ – రేశ మకామం
ప్రాకట పూరిత – భక్తసుకామమ్ ॥వందే॥

వాసుదాసకృత - వందన లోలం
కౌసల్యా తరుణీ - ప్రియబాలమ్ ॥వందే॥

**73.** బేహాగ్ రాగము - చాపుతాళము

వందనం బిదే - హరీ - వందనం బిదే
నందసు నందన - యిందిర మందిర
మందరధర బుధ - చందన సుందర ॥వందనం॥

బృందారక పర - బృంద భయంకర
మాధవా - మాధవా - సాధుజనావన ॥వందనం॥

ఏకశిలాపుర - శ్రీకర భవహర
రాఘవా - రాఘవా - వాసుదాసార్చిత ॥వందనం॥

## దంతధావనము

**74.** కేదారగౌళరాగము - అటతాళము

రావయ్య రఘువంశ - రాకాసుధాకర
రాజీవదళలోచనా
వేవేను నీఁక దంత - ధావన మొనరింప
వేవేగఁ జనుదెమ్ము - విధిశర్వవందిత ॥రావయ్య॥

నాపాలి భాగ్యమా - నాపూర్వపుణ్యమ
నానోము పంట రారా
ఈ పాటికిని వీరె - యీపాటలాధరలు
రేపాడి సేవకై - వేచియున్నారయ్య ॥రావయ్య॥

హిమవాలుకతోడ - హిమవారి సమకూర్చి
హిమకర వదనామణుల్
సుమధూళి కరముల - సొంపుగా ధరియించి
కమలాక్ష నీరాక - కెదురుచూచెదరయ్య ॥రావయ్య॥

ఏకశిలాపురి - నెలమిని వసియించి
లోకంబుఁ బాలింపఁగా
నీకరుణాపాత్రుడు - నీవాసుదాసుఁడు
నీకీర్తి పొగడుచు - నిలఁబడియున్నాఁడు ॥రావయ్య॥

## జలకము

### 75. ఆనందభైరవి రాగము - అటతాళము

లాలపోసెదను రారా - నాతండ్రి - లాలితాకార రారా
నీలవర్ణుండ రారా - రామ నా - పాలిభాగ్యంబ రారా ॥ ॥లాల॥

నూతనంబయి వలచెడి - సంపెంగ - నూనెతోఁ దలయంటెదఁ
బ్రాఁతి వాసనపిండితో - నలుగిడెద - రామ నాతండ్రి రారా ॥ ॥లాల॥

మేలైన పన్నీరము - నంతకును - మేలైన రామతీర్థం
బోలి ముదితలు తెచ్చిరి - రామన్న - యుదిరిబంగరు బిందెలన్ ॥లాల॥

వాసుదాసుండు మేలి - దువ్వలువ - పాణితలమునఁ దాలిచి
వాసిగాఁ తడియొత్తఁగా - నిదెచూడు - మాసతో నిలిచినాఁడు ॥ ॥లాల॥

## సీతాదేవి స్నానము పాట

### 76. బిలహరి - ఆదితాళము

జలకములాడరా గదమ్మ ఓ సీతాదేవి!
చెలులెల్లఁ గాచియున్నారమ్మాఁ
ఘలుఘుల్లని కాలి యందియలు
జిలిబిలి రవములు జెలఁగుచు నుండఁగ ॥జలకము॥

కమ్మనితావుల ఘుమ్మని పూవుల
ఇమ్ముగ రసముల నెనయు పన్నీటను ॥జలకము॥

మేలగు సంపెంగతైలము తోడుత
చాలగ నలుగుడి లాల బోసెదను ॥జలకము॥

బంగరుబిందెల వాసుదాసుఁడు
రంగుగ నించిన గంగాజలమున ॥జలకము॥

## తిలకము

### 77. తిలకము పాట

తిలకము దిద్దరమ్మా - శ్రీరామునకుఁ
దిలకము దిద్దరమ్మా
తిలకము దిద్దరే - జలజాక్షు లీవేళ
సలలితముగ రామ - చంద్రునెమ్మోమున ॥తిలకము॥

బుగబుగవాసనలతోఁ, బొనరుచున్న
మృగమదముగొన రండమ్మా
వగలు గుల్కెడి రాము - వదనారవిందమున
నిగనిగలాఁడగ నీటుగ దిద్దుదము ॥తిలకము॥

పచ్చకర్పూరంబునబూను - దెచ్చియు దాని
హెచ్చుగ బునుగుతోడ
మెచ్చుగఁ గలిపియు మచ్చెకంటులార
సచ్చరిత్రుఁడు రామ చంద్రున కీవేళ ॥తిలకము॥

నిగః గ లాడుచును - నీటగు యెఱుఁడ
నిలువటద్దముఁ దెండమ్మా,
మృగరాజతనుమధ్య లెదురుఁగఁ బట్టుఁడు
సొసనుగఁ దన హొయలు, చూచుకొనునుగాని ॥తిలకము॥

వాసనలు బలుగుకొనఁగ - బన్నీరముతో
వారిజనేత్రలారా

వాసిమేళగించి పరిమళ యుతముగ
వాసుదాఽసుడు నేడుఁ వలనొప్పఁ గూరెను ॥తిలకము॥

## అలంకారము

### 78. అమ్మవారి అలంకారము యాలపాట

మల్లెపూల వన్నెగలుగు మంచిసరిగెపట్టువలువ
మొల్లముగఁ దాల్పుమో యమ్మ ఓ సీతాదేవి
మమ్ము నెల్ల కరుణ గనవమ్మ ॥మల్లె॥

ఇవిగో సూర్యచంద్రు లివిగో యివిగో సీమమణులకమ్మ
లివిగోవమ్మ జడ బంగారు ఓ సీతాదేవి! ఇవిగోనమ్మా
జడబిళ్లాలు ॥మల్లె॥

అంకహీనరత్న మెరయూ కుంకుమాము
నిగనిగ మెఱయా! పొంకముగా నొసలు నుంచుము
ఓ సీతాదేవి! ఇంక జాలమేటి కోయమ్మ ॥మల్లె॥

పచ్చకర్పూరముతోనైన, నచ్చకాటుకలివిగో తల్లి
మెచ్చి కనులా దిద్దుమోయమ్మ ఓ సీతాదేవి!
నచుజేయ నేటికో యమ్మా ॥మల్లె॥

ఇవిగో కంటె, కాసులదండ, ఇవి మంచి ముత్యాలపేరు,
లివిగో రత్నముల హారమ్మాలు ఓ సీతాదేవి!
హృదయమూనఁ దాల్పఁగదమ్మా ॥మల్లె॥

ఇవిగో వంకీల్, బాజుబందుల్, ఇవిగో కంకణాల్
కడియాలు, ఇవిగోనమ్మ భుజకీర్తులు ఓ సీతాదేవి!
ఇవిగో కేలఁ దాల్పు మోయమ్మ ॥మల్లె॥

ఇవిగో గజ్జెల మొలనూలు ఇవిగో మణుల యొడ్డాణము
లివిగోనమ్మ బిళ్ళల మొలత్రాడు ఓ సీతాదేవి
నడుమునందు వీని దాల్పుము ॥మల్లె॥

ఇవిగోకంటె సంజూకీలు, యివిగో బోగడల్ ప్రక్కచేర్లు
ఇదిగొ మణులపాపటబొట్టమ్మా ఓ సీతాదేవి!
ఇదిగోనమ్మ రేగడిచంద్రవంక ॥మల్లె॥

ఇదిగోతమలపాకు నాగర యివిగో కత్తెర బావీలీలు
ఇదిగో కుప్పెపచ్చబిళ్ళమ్మా ఓ సీతాదేవి!
ఇవిగోనమ్మ పాలపట్టీలు ॥మల్లె॥

ఇదిగోముక్కుపుడక తల్లి, ఇవిగో ముక్కు పోగు బులాకీల్
ఇవిగోనమ్మా నిమ్మపూవూలూ ఓ సీతాదేవి!
ఇదిగో సరదు, దీని ధరియింపు ॥మల్లె॥

వాసుదాసుఁడు బీదవాఁడు, వానిని మించి యియ్యలేఁడు,
దాసుఁడనుచు వీనిఁ గొనవమ్మా ఓ సీతాదేవి!
వాసిదెచ్చు సుతుఁడు గదవమ్మా ॥మల్లె॥

## కొలువు

### 79. భైరవి - రూపకము

కొలువు దీరెనే రాముఁడు - కొలువు దీరెనె ॥పల్లవి॥

కొలువు దీరెను నేఁడు - కోసలాధీశుఁడు
జలజాతలోచన - జానకీతోఁగూడి ॥కొలువు॥

కనకసింహపీఠి - కమాక్షు లందఱు
మనసార వింజా - మరములు వీవఁగఁ ॥కొలువు॥

హరిహయ హరముఖ - సురవరు లెల్లరుఁ
గరములు జోడించి - కరము భక్తిఁ గొలువఁ ॥కొలువు॥

నృపముఖ్యు లెల్లరు - కపివరుల తోడుతఁ
జపలత లేకుండ - సన్నిధి నిలుచుండఁ ॥కొలువు॥

వాసుదాసుఁడు తన - పాటలు పాడఁగ
నాసతోడ వినుచు - హర్షము నొందుచుఁ ॥కొలువు॥

## చూర్ణిక - పరాకు

### 80. చూర్ణిక - పరాకు

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకా
నతజితశతకోటి ప్రసూన సాయకా ॥పరా॥

శుండాల శుండా దండ సముద్దండ నిజభుజాదండ
తాండవిత కోదండ దండా - ॥పరాకు॥

ఆఖండల ఖండపరశుముఖ బృందారక ప్రకాండదండ
శిరోమండనాయమాన నిజపదపరాగకాండా - ॥పరాకు॥

అంభోనిధీంద్రగర్వకుంభివీధర జంభారిదో స్తంభ
సముత్తంభిత దభోళిదంభ సముజ్జృంభణారంభ
సంరంభాకాండకల్పకాండోద్భవజ్వాలామాలా భీలా
కాండాకాండాసన మండితా - ॥పరాకు॥

సర్వసుపర్వా హితాఖర్వగర్వ నిర్వాపణచణా
పాంగ సంగా - ॥పరాకు॥

లోకపావనశీల లోల గంగాకల్లోలినీ జననీభూతవిమల
పాదకమలా - ॥పరాకు॥

వందమాన పురందర త్రిపురందర పురంధ్రీముఖ బృందారక
సుందరీ క రారవింద సందానిత స్యందమాన

మరందబిందు సందోహపాన తుంది లేందిందిర సుందర
నందన కుందేందీవరహారమనోహర వక్షస్థలా - ॥పరాకు॥

ఏకశిలానగరవాపా బహుపరాకు
శ్రీవాసుదాసపరదా బహుపరాకు

## ప్రభుత్వసేవ

### 81. రాగము - తాళము

జానకిరామా - ఓరామా - క్ష్మాధవా రామా
దానవరామా - పరాత్పర - దాశరథీరామా ॥జానకి॥

కోదండరామా - ఓరామా - గోపాలరామా
సాదరరామా - కృపానిధి - సాగరధామా ॥జానకి॥

పావననామా - ఓరామా - పట్టాభిరామా
క్ష్మావనకామా - దయాకర - కైవల్యధామా ॥జానకి॥

ఏకశిలాధామా - ఓరామా - ఇందిరాకామా
శ్రీకరరామా - గుణాకర - సాకేతధామా ॥జానకి॥

### 82. ముఖారీరాగము - ఆదితాళము

ఎక్కడ చూచిన మన శ్రీరాముఁడె
యెదురుగనున్నాఁడు
మ్రొక్కెడువారల మ్రొక్కులు గైకొని
మురియుచునున్నాఁడు ॥ఎక్కడ॥

దిక్కు నీవే యనెడి వారల
దిక్కై యున్నాఁడు
తక్కక తను సేవించెడివారికి
దాపైయున్నాడుఁ ॥ఎక్కడ॥

చూడగఁ గోరిన కలిగిన భక్తుల
చూపై యున్నాఁడు
లేఁడని వదరెడి శుంఠలపాలిట
లేకయె యున్నాఁడు ॥ఎక్కడ॥

మనసునఁ దలఁచెడివారల యందలి
మనసై యున్నాఁడు
వినఁగోరిన యాధన్యచరిత్రుల
వీనుల నున్నాఁడు ॥ఎక్కడ॥

తన్ను నుతించెడివారల వాక్కులు
తానై యున్నాఁడు
తన్నర్చించెడి పుణ్యులకరములు
తానై యున్నాఁడు ॥ఎక్కడ॥

పూజలు పూజాద్రవ్యంబులు మఱి
పూజించెడివారు
పూజితపూజాఫలములు దానై
రాజిలుచున్నాఁడు ॥ఎక్కడ॥

దాసోహమ్మనువారిని వదలక
తవిలియ యున్నాఁడు
వాసుదాసుని తియ్యపలుకులకు
వశుఁడై యున్నాఁడు ॥ఎక్కడ॥

### 83. కీరవాణిరాగము – ఆదితాళము

రాములె సర్వంబు సీతా – రాములె సర్వంబు
రాముఁడు జగదభి – రాముం డాత్మా
రాముఁడు సీతా – రాముఁడె సర్వము ॥రాము॥

కానవచ్చునవి - కానరానియవి
మానసవీథిని - మలయఁగరానివి ॥రాము॥

నామము రూపము - నాదబ్రహ్మము
భూమియుఁ బుట్టిన - భూతకోటులును ॥రాము॥

స్మృతులు పురాణము - లితిహాసంబులు
శ్రుతులును విద్యలు - క్రతుతంత్రంబులు ॥రాము॥

నేనును నీవును - నీయది నాయది
వానిది వాఁ డది - దానిది సర్వము ॥రాము॥

కరులును గిరులును - ధరణీధరములు
తరువులు హరులును - గిరులును దరులును ॥రాము॥

హరుఁడును నజుఁడును - హరిహయుఁ డసురులు
సురలు రాక్షసులు - సుందరులెల్లను ॥రాము॥

దనుజులు మనుజులు - తారలు గ్రహములు
దినకర నిశికర - దివ్యులు దివియును ॥రాము॥

ఎందు నెందు మన - దృష్టులు పడునో
యందు నందుఁ గల - యఖిల వస్తువులు ॥రాము॥

ఎందు నెందు శిర - మిలపై వ్రాల్తుమొ
యందు నందుఁ గల - హరిపాదంబులు ॥రాము॥

వాసుదాసుఁడిటు - పలికిన పలుకులు
వ్రాసిన వ్రాఁతలు - చేసిన చేష్టలు ॥రాము॥

## 84. శంకరాభరణ రాగము - అట తాళము

పిలిచినఁ బలుకవు - బిగువిదేలర రామా
కలకాలము నిన్నుఁ - గాచి తిరిగెడి నేను ॥పిలిచిన॥

నిలcబెట్టి యడిగితినా - నెలనెల జీతము?
ఫలమొ కాయొ తిని - పరిచరించెదcగాని ॥పిలిచిన॥

కలమాన్నపాయసములు - కావలె నంటినా?
కలియొ యంబలొ ద్రావి - కొలువు చేసెదcగాని ॥పిలిచిన॥

సరిగంచు శాలువలు - త్వరగc దెమ్మంటినా
తిరిపెపు గోcచితోc - దిరుగుచుండుదుcగాని ॥పిలిచిన॥

పాలకులు గుఱ్ఱాలు - పంపుమటంటినా
కాలినడకను బిచ్చ - గాcడై తిరిగెదc గాని ॥పిలిచిన॥

మిద్దెలు మేడలు - మిమ్ము నే నడిగితినా?
పద్దులేక యెందో - పడియుండెదc గాని ॥పిలిచిన॥

ఆశపడితినె నేను - హాటకాభరణములు
ఆశాంబరుండనై - యణcగి యుండెదcగాని ॥పిలిచిన॥

మెత్తలు మంచాలు - మేల్మిపడితినె రామ
ఎత్తితి నెందైన - నిలc బండెదను గాని ॥పిలిచిన॥

నాకభోగంబుల - నాశించితినె రామ
నీకు సేవలు సేయ - నిచ్చc గోరెదc గాని ॥పిలిచిన॥

మోక్షసుఖము నైన - మోహపడితినె రామ
భిక్ష మెత్తి నీకుc - బెట్టc గోరెదc గాని ॥పిలిచిన॥

మోమైనc జూపవు - మోహనరామన్న
ఏమని నీకొలువు - నెన్నాళ్ళు సేయుదు ॥పిలిచిన॥

ఏకశిలాపుర - మిలమీcదc గలిగిన
వైకుంఠ మనుచును - వాంఛచేసితిc గాని ॥పిలిచిన॥

వాసుదేవుఁడ వీవు - వాసుదాసుఁడ నేను
దోసిలొగ్గెద మన - బైసి యార్పకు మయ్య ॥పిలిచిన॥

### 85. హిందుస్థానితోడి - ఆదితాళము

నీవంటి దేవునెందుఁ గానఁగాన - రామ
నావంటి పాపినెందుఁ గానఁగాన ॥నీవంటి॥

నీవంటిదేవుఁడు గాని - నావంటిపాపి గాని
ఈవిశ్వతలమునందు - నెందు వెదికిన లేఁడు ॥నీవంటి॥

బక్క వేల్పులఁ గొలిచి - బలిసార్చుకొనుట కంటె
నిక్కపువేల్పు నిన్ను నెమ్మది నమ్మ మేలు ॥నీవంటి॥

అన్ని సద్గుణములకు - బెన్నిధానము నీవు
అన్ని దుర్గుణములకు - బెన్నిధానము నేను ॥నీవంటి॥

పరుసవేదివి నీవు - పరసపుటినుము నేను నీ
సరసఁజేరిన వేగ - జాళువాపైఁడిఁగానె ॥నీవంటి॥

పిడుగు తునకనీపేరు - గడుసుమలలు నాపాపములు
గడియలోన నుగ్గునూచై - వడిగరూపుమాసిపోవె ॥నీవంటి॥

అగ్గిమిణుఁగురు నీ పేరు - ఎగ్గులదూదికొండ నేను
భగ్గున నాపాపములు - బుగ్గిలోనఁ గలసిపోవె ॥నీవంటి॥

వాసు దేవుఁడ వీవంట - వాసుదాసుఁడ నేనంట
వాసిగ మన కిద్దఱకు - వదలని జంటయంట ॥నీవంటి॥

### 86. జంఝూటి - ఆదితాళము

రామ పాహిమాం - పరమపాపినమ్
కామచారిణమ్ - కలుషరూపిణమ్ ॥రామ॥

చపలమానసమ్ - శఠవిచేష్టితమ్
విపులమానినమ్ - వికటవర్తనమ్ ॥రామ॥

ద్రోహచింతనమ్ - దురితదూషితమ్
స్నేహవర్జితమ్ - నీతిసంచ్యుతమ్ ॥రామ॥

విగతరక్షకమ్ - విశ్వభక్షకమ్
స్వగతదుర్భరమ్ - స్మరశరావశమ్ ॥రామ॥

వాసుదాసకమ్ - వ్యర్థనామకమ్
వాసవార్చితమ్ - త్వాం - ప్రార్థయామ్యహం ॥రామ॥

## శరణాగతి

### 87. భైరవిరాగము -అటతాళము

శ్రీమద్రఘుకుల - శేఖర నతలోక
కామితవరదాయకి - రామారామ - కామితవరదాయకా
శరణు శరణు భక్తవరద శరణు నీ
చరణములే నమ్మితి - స్వామీ స్వామీ - చరణము లేనమ్మితి
ఈదేహాంతమున - నాదరదృష్టి నీ
పాదములకడఁ జేర్పవే - ఈశానీదు - పాదములకడజేర్పవే
నీపాదసేవల - నిరతిశయాసక్తి
నిపదప్రాప్తిఫలము - ని మ్మోదేవ - నీపదప్రాప్తిఫలము
వినిషిద్ధ కామ్యములు - విరతిని గలిగించి
నను నిత్యకింకరునిఁగఁ గొను మో దేవ నను నిత్య...
అపరాధరహితము - లైన కైంకర్యముల
యందునన్నుంపవయ్యా - ఎల్ల పుడనీకైంకర్యముల నుంపుమీ
నన్ను నాని చేత - నాచేతనంబుల

నన్నింటిఁగై కొనుమీ - నిపిరిచర్యకు - నిఖిలము నీవె కొనుమీ
పాపకార్యంబులఁ - బాల్పడఁ జేయకు
పాపుమచేయువాని శ్రీపా భూపా పాపుమచేయువాని
చేయరానివాని - జేసితి విడిచితి
చేయంగ వలయువాని - శ్రీశా సైఁపు - నాయపరాధములను
రక్షాభరంబును - రక్షాఫలంబును
దక్షా నీవె కొనుమీ - యాశ్రితరక్షా - దీక్షానీవెకొనుమీ
సంసారాంబుధి సంతరింపఁగ నా - చార్యుఁడు మిముఁజూపెను
చక్కని తెప్పగ - నాచార్యుఁడు మిముఁ జూపెను ॥శ్రీమ॥

నీవే దిక్కనినమ్మి - నిఖిలోపాయములఁ
బోవిడినాఁడఁ దండ్రీ - దేవాదేవ - కావుము యీదీనుని॥శ్రీ॥
నిరవధికరుణాళు - నినుఁ జేరి నిర్భయుఁడ
నిర్భరుండనైతిని - భరమునెల్ల - నీపాదముల నిడితిని వరదావరద
పరమభక్తిజ్ఞాన - వరకర్మయోగముల
వర్తింప నేరనయ్యా - రామారామ - వర్తింప నేరనయ్యా
లేదు వేఱేదిక్కు - లేదు వేఱెగతి
లే దెట్టిశక్తి నాకు - నకించనుఁడ నీపాదములఁ బడినవాఁడ
ఏఁచిన దయలేక - త్రోచినఁ గరుణచేఁ
గాచిన నీదెకీర్తి - రామారామ - కాచిన నీదె కీర్తి
నీవు నాస్వామివి - నేను నీసొత్తైతి
నీ వేమి చేసితేని - రామారామ - నేవెతలు పడనేటికి
శరణాగతత్రాణ - బిరుదముఁ దాల్చిన
హరి నిన్ను నమ్మినాఁడ - రామారామబిరుదముఁ దక్షించుకో
వాసుదేవుఁడ వీవు - వాసుదాసుఁడ నేను
భాసురగుణశీలా - ఏకశిలా - వాస శ్రీ శ్రీనివాసా!

## ఆవాహనము

### 88. కాపీరాగము - ఆదితాళము

రారా నాముద్దు బాల - రారా శ్రీహృదయలోల
రారా బంగారుకొండ - రారా నారామచంద్ర
అసమున నత్రిపుత్రుఁ - డంబరీషుని వేఁప
విసవిస చక్ర మంపిన - విశ్వపాలనలోల ॥రారా॥

బాలుని బ్రహ్లాదు - బాధలు పెట్టఁ దండ్రి
జాలము సేయ కవ - లీలఁ గాచిన తండ్రి ॥రారా॥

కలశవారాశిఁ ద్రచ్చి - వలనుగ నమృతముఁ దెచ్చి
ఖలుల రాక్షసుల వ్రచ్చి - యలవేల్పుల కిచ్చు శౌరి ॥రారా॥

జగము స్వరూపం బయి - జగదంతరాత్మ వగుచు
జగతి కాధారంబై - నెగడఁ జేసెడి తండ్రి ॥రారా॥

హృదయపద్మంబు నీ - సదనముగఁ జేసికొనుచు
సదయత వర్తించు - శంఖచక్రధర ॥రారా॥

ఏరూపమును గన్న - నీ రూపమే కాదా
దారితరాక్షస - వారా సురవారపాల ॥రారా॥

వాసుదాసార్చిత - భాసుర వరశీల
దాసజనావనలోల - వాసవవైరికాల ॥రారా॥

### 89. పూర్వికల్యాణి - ఆదితాళము

శ్రీరామచంద్ర నన్నుఁ - జేర రారా
కోరెదను - గోరెదను - గోరెదను - గోరెదను
కూరిమితోడ నన్నుఁ - గూడరారా ॥శ్రీరామ॥

దిక్కులేనివారికి నీవె - దిక్కు గదర
మ్రొక్కెదను - మ్రొక్కెదను - మ్రొక్కెదను - మ్రొక్కెదను
దిక్కుపక్కము లేని నా - ప్రక్కరారా ॥శ్రీరామ॥

ఈడు జోడు లేని వేల్ప - వీవెకదరా
వేఁడెదను - వేఁడెదను - వేఁడెదను - వేఁడెదను
కీడు వాప నాకు నీవు - తోడు రార ॥శ్రీరామ॥

దాసరక్షకుఁ డనుచు నీకు - వాసి గదరా
దాసుఁడను - దాసుఁడను - దాసుఁడను - దాసుఁడను
వాసుదాసుఁ గావ శ్రీని - వాస రారా ॥శ్రీరామ॥

కోదండరామ నన్నుఁ - గూడ రారా
ఆదుకోరా - ఆదుకోరా - ఆదుకోరా - ఆదుకోరా
సాదరముగ నిప్పు దేక - శైలవాసా ॥శ్రీరామ॥

### 90. యదుకులకాంభోజిరాగము - ఆదితాళము

రారా నాముద్దులయ్య రామారామా
ఈరా నాకు నొక్క ముద్దు రామారామా
అందమైన నడక చూపుము రామారామా
నందన శ్రీవిబుధచందన రామారామా
కాలిగజ్జెలు ఘలుఘల్లనఁగా రామారామా
పాలబుగ్గల ముద్దుపెట్టెద రామారామా
పాలిచ్చెదను రారా తండ్రీ రామారామా - నా
పాలిభాగ్యమగుచుఁ బుట్టితి రామారామా
బుచ్చిముద్దు చిన్నముద్దు రామారామా
ఇచ్చిపోరా వెన్నపెట్టెద రామారామా
వాసుదాసుని వాక్కులు మరగి రామారామా

చేసెదవు జాగిట రాక రామారామా
ఆఁకలి యెఱుఁగవు దప్పి యెఱుఁగవు రామారామా
ఏకశిలాపురనివాస రామారామా

## గంధము

### 91. కాపీరాగము - అటతాళము

గంధ మలఁదరే - స్వామికి గంధ మలఁదరే
గంధము నలఁదరే - సింధురగమనలు
గంధగజేంద్రునిఁ - గాచిన తండ్రికి ॥గంధ॥

అగరు చందనము - నత్తరు పన్నీరు
మగువలార కలిపి - మంచికర్పూరము ॥గంధ॥

ఘుమఘుమవాసన - గురియుచు దిక్కుల
సుమనోహరంబయి - సొబగారుచున్నట్టి ॥గంధ॥

వాసుదాసుఁడు శ్రమ - పడి తీసినట్టిది
దాసరక్షకుఁడైన - దశరథసుతునకు ॥గంధ॥

## ధూపము

### 92. శంకరాభరణము - అటతాళము

ధూప మాఘ్రాణింపు - తోయజలోచన
దురితబంధమోచనా, సీతానాథా - దురిత ॥ధూప॥

పాపసంహరణ శ్రీ - పరమపురుష వరద
గోపాల భూపాల - కాపాడి పోషింపు ॥ధూప॥

మహిసాక్షి గుగ్గులు - మంచి సాంబ్రాణియు
మలపిన చూర్ణమున

అహిరాజతల్పక - యాశ్రితకల్పక
మహిజా హృదయేశ్వర - మాపాలిదౌవమ ॥ధూప॥

నీలాగురుమార్ణ - మాలోలవనమాల
మేలిగంధపుఁ బొళ్ళతో
కోలరూపక పర - కాల కాలాత్మక
వాలిమర్దన సప్త - సాలవిభంజన ॥ధూప॥

దశరథనందన - దశముఖఖండన
దశధూపమిళిత మిదియు
వశుఁడవై భక్తుల - వాంఛలు దీర్చుచు
విశదసత్కీర్తిని - వెలసిన శ్రీరామ ॥ధూప॥

## దీపము

### 93. శంకరాభరణము - ఆదితాళము

దీపము దర్శింపు - దివిజసన్నుతచరణ
దిననాథకులపావనా
చాపాలంకృతహస్త - సర్వలోకశాస్త
శాపాయుధవినుతి - శర్వాణీనుతచరిత ॥దీపము॥

కపిల గోఘృతంబు - కనకపాత్రమునందుఁ
గల్పించి వర్తితోడ
విపులాపాలనదీక్ష - విబుధపాలనదక్ష
కృపతోడ మమ్మేలు - కీర్తివరశీల ॥దీపము॥

వెలిగించినట్టి మీ విమలదీపంబును
ప్రీతితో దర్శింపుమీ
దళితమారీచాది - దైత్యరాక్షసలోక
కలితహాటకచేల - లలితమోహనరూప ॥దీపము॥

ఇట్టి జ్యోతి నాదు - హృదయసీమను నిల్పి
కొట్టుము లోచీఁకటి
పట్టితి నీపాద - పద్మములను దేవ
గట్టిగ నన్నేలు - కరుణావరుణాలయ ॥దీపము॥

వాసుదాసార్చిత - పాదపల్లవయుగ్మ
దాసరక్షాదీక్షితా
వాసవముఖనాక - వాసరక్షణలోల
వాసరనాథ స - ద్వంవముక్తాఫల ॥దీపము॥

## పూజ

### 94. శంకరాభరణరాగము - అటతాళము

పూవుఁబోణులారా - పూజసేయఁగ రారె
పుండరీకాక్షు నేఁడు
భావజజనకునిఁ - బరమపవిత్రుని
శ్రీవల్లభుని శౌరి - సీతామనోహరు ॥పూవు॥

దశరథనందును - దశముఖమర్దను
దశశత రవితేజుని
దశరూపధారిని - దనుజసంహారుని
విశద సత్కీర్తిని - విమలచారిత్రుని ॥పూవు॥

మొల్లపూలతోడ - మొగలిపూలతోడ
సల్లలిత సారసముల
మల్లెపూలతోడ - మంచిగన్నేరుల
మొల్లఁపుసంపెంగల - మోహనమూర్తిని ॥పూవు॥

జాజిపూవులు విరి - జాజులతోడుత
శ్యామంతిఁ దులసితోడ

రాజీవనయనుని - రాజీవవదనుని
రాజీవహితవంశ్యు - రాజరాజేడితు ॥పూవు॥

రామాయ శ్యామాయ - రాజీవనయనాయ
రాకేందువదనాయ తే
కోమలగాత్రాయ - కోటిరవితుల్యాయ
కామితార్థదాయ - కల్యాణాయ యని ॥పూవు॥

రక్షితశిష్టాయ - శిక్షితదుష్టాయ
భక్షితవనవహ్నినే
పక్షిరాడ్వాహాయ - పాలితదాసాయ
రక్షాయ మోక్షప్ర - దాయ నమో యని ॥పూవు॥

వాసుదాసఫణిత వాక్యాకర్ణన
పరమాదరయుక్తుని
వాసవనుతనిజ - దాసపోషణదీక్షు
భాసుర సద్గుణ - వారవిరాజితు ॥పూవు॥

**95. శ్రీరాగము - ఆదితాళము**

పూవులు చల్లరే - విరిసినమల్లె - పూలుచల్లరే
పూవులు చల్లరే - పుండరీకాక్షునిపైఁ ॥పూ॥

బూవుఁబోఁణులార - పూర్ణముదంబున
జానకీతోఁ గూడి - సౌమిత్రిసేవింప
మానుగ నరుదెంచె - మనయింటి కీవేళ ॥పూ॥

మల్లెలు మొల్లలు - మంచి చేమంతులు
కొల్లలుగాఁ దెచ్చి - కోరిక దీరఁగ ॥పూ॥

పారిజాతములు - పచ్చసంపెంగలు
తోరముగాఁ దెచ్చి- దోసిలి నిండఁగ ॥పూ॥

వాసుదాసుఁడు గొల్చు - పరమపదనాథుఁడు
కౌసల్యతనయుఁడు - గారవమున వచ్చె ॥పూ॥

## ఆరగింపు

**96.** కళ్యాణిరాగము - ఆదితాళము

ఆరగింపుమీ - రామా - ఆరగింపుమీ ॥
నారికేళఫలము పంచ - దార యరటిపండ్లు మంచి
నారింజపండ్లు కమలాపండ్లు - కోరి యేరి తెచ్చినాము ॥
కమ్మవాసన లీను నేల - కాయల పొడి నిమ్మరసము
ఘుమ్మనంగనుగూర్చినాము - కూరిమితోడుత నారగింపు ॥
మిరియపుఁ బొడి శుంఠిపొడియు మేలియేలకులు గలిపినట్టి
సురుచిగలుగు పానకములు - సొబగుగా నొడపప్పుతోడ ॥
నీదు సేవకసభ్యుల మయ్య - నీదుదయకుఁ బాత్రులమయ్య
కోదండరామ మమ్ము నెల్ల - గూరిమితోడఁ బ్రోవవయ్య ॥

**97.** శంకరాభరణము - అటతాళము

శ్రీరాఘవులార - చిన్మయతనులారా
ఆరగింపరె ప్రేమతో
సారసాక్షులార - నీరేజకరులార
కారుణ్యనిధులార - యారగింపరెప్రేమ ॥శ్రీరాఘ॥

కడపపిషాణముల - కమ్మని యన్నము
వడియా లప్పడాలు - పప్పు పరమాన్నము ॥శ్రీరాఘ॥

బజ్జు లూరుపిండ్లు - పచ్చళ్లు కూరలు
మజ్జిగపులుసుతో - మలపిన యన్నము ॥శ్రీరాఘ॥

పులిహోర దధ్యన్న - ములును వాంగీభాతు
వలచు కేసరిభాతు - బకాళాభాతును ॥శ్రీరాఘ॥

ఆవపచ్చళ్లను - నరుదుకోసంబరులు
సేవెల పాయస - మీవేళ బర్ఫీతో ॥శ్రీరాఘ॥

ఆవడలు పూరీ - లాకజ్జికాయలు
సోమాసీలు పోళి - లీమణుఁగుపూలును ॥శ్రీరాఘ॥

దోసెలు నిడ్డెనలు - దూద్ ఫేద మండిఁగెలు
వాసిమీరఁగఁ బైఁడి - పళ్లెరంబులలోన ॥శ్రీరాఘ॥

మీఁగడ వెన్నయు - మేలైన జున్నును
మీఁగడపెరుఁగులు - మేలూరుగాయలు ॥శ్రీరాఘ॥

అరఁటిపండ్లు ద్రాక్ష - లంజూరుపండ్లును
వేరుపనసతొనలు - పేరిఖర్జూరములు ॥శ్రీరాఘ॥

దానిమ్మపండ్లు మేల్ - తరము నారింజలు
తేనెతో మాగిన - తియ్యమామిడిపండ్లు ॥శ్రీరాఘ॥

పచ్చకర్పూరము - మెచ్చుకుంకుమపువ్వు
ఇచ్చు నేలకపొడితో - నిగురఁగాఁచిన పాలు ॥శ్రీరాఘ॥

నూనెవంకాయయు - నూనె దోసకాయ
నూనెపొళ్లకాయ - తేనెతొలలాదిగ ॥శ్రీరాఘ॥

పాలపోళీల్ సజ్జ - ప్పొలు మైసూర్పాకు
మేలైన పలులడ్డు - వాలు జిలేబీలు ॥శ్రీరాఘ॥

కారాలు వామపొడి - కారాబూంది మీరు
ఆరగింపరయ్య - హర్షముతోదుత ॥శ్రీరాఘ॥

మమత నీసేవా స - మాజసభ్యురాండ్రు
శ్రమపడి కూర్చిరి - సకల పదార్థములు ॥శ్రీరాఘ॥

ఎలమి నారగించి - యేకశిలేశ్వర
తిలcపుమ యీ వాసు - దాసునిc బ్రోవcగ ॥శ్రీరాఘు॥

98. బేహాగురాగము - ఆదితాళము

బువ్వపెట్టెదను రార - పూర్ణచంద్రవదన రామ
మువ్వ లందెలు ఘలుఘల్లంచును
మొఱయc గులుకుచు నారగింపు ॥బువ్వ॥

ఆనవాలలోనc జక్కెర - యనువుమీఱcగాను వేసి
జానుగ మేల్ రాజనాల
శాల్యన్నము నందుc గలిపి ॥బువ్వ॥

అవ్వముద్ద తాత ముద్ద
యయ్యముద్ద యిదిగోc దండ్రీ
మొవ్వముగ నిది నాముద్ద
ముద్దుపెట్టెదc దినరా నాయన ॥బువ్వ॥

ఇదిగో నిదియు లక్ష్మణుముద్ద
యిదిగో నిదియు భరతుని ముద్ద
ఇదిగో ముద్దుతమ్ముని ముద్ద
యిది యొక్కటియే తినినను జాలు ॥బువ్వ॥

ఇదిగో వాసుదాసుని ముద్ద
యింపుమీఱ నారగింపు
ముదమున వంగూరి సీతమ
మురువుగాను వండెను దీని ॥బువ్వ॥

## తములము

99. కీరవాణిరాగము - అటతాళము

తములము సేయవయ్యా - దశరథతనయా
తములము సేయవయ్యా

తములము సేయుము – దశరథనందన
కమలామనోహర – కనకాంబరలోల ॥తము॥

మంచి తెల్లనియాకులు – నాణిముత్తెవు
మంచి సున్నము కొంచెము
అంచితముగఁ గూర్చి – యలివేని జానకి
యంచున నిలుచుండి – యందిచ్చుచున్నది ॥తము॥

మృగమదము జాజికాయ – జాపత్రియు
మేలైనకర్పూరము
సిగనపువక్కలు – చేర్చి లవంగాలు
మగువలు గూర్చిరి – మనసు రంజిల్లగ ॥తము॥

## నీరాంజనము

### 100

జానకీమనోహరాయ – సాధులోక హితకరాయ
దానవేంద్ర మదహరాయ – ధన్యమంగళమ్ ॥జానకీ॥

కామకోటిసుందరాయ – నామకోటిబంధురాయ
ప్రేమగుప్త సింధురాయ – వితతమంగళమ్ ॥జానకీ॥

తారహార నీహార – చారుహీర సుధాసార
పూరధవళహాసాయ – భూరిమంగళమ్ ॥జానకీ॥

నందనంనాయ కురు – విందసుందరాధరాయ
మందరగిరి వరధరాయ – మహితమంగళమ్ ॥జానకీ॥

వాసుదేవాయ వినత – వాసుదాసపాలకాయ
రాసకేళిలోలాయ – రమ్యమంగళమ్ ॥జానకీ॥

### 101. భైరవిరాగము - ఆటతాళము

మంగళము సీతకును - మహితగుణపూతకును
మంగళము త్రైలోక్య - మాత కెపుడు
మంగళము క్షీరాబ్ధి - మందిరకుఁ గల్యాణ
సంగతకు నలిమేలు - మంగ కెపుడు ॥
జయమంగళం సదా - శుభమంగళమ్ ॥
పద్మమున జనియించి - పద్మవాసిని యగుచు
పద్మభవుఁగన్న శ్రీ - పద్మముఖికి
పద్మబాణునిఁ గాంచి - పద్మమును గేలఁగొని
పద్మలోచనయైన - పద్మినికిని ॥జయ॥

వందారు మందారమై - ముకుందునివక్ష
మందు సుందరమైన - యిందిరకును
అందియలు ఘలుఘల్లు - మన వాసుదాసుని
మందిరమున నటియించు - మాత కెపుడు ॥జయ॥

కుందారవింద మక - రందపానోన్మత్త
తుందిలేందిందిర - బృందములును
క్రందుకొని వెనువెంట - సందడించుచు రాఁగ
నందముగ దర్శించు - నంబ కెపుడు ॥జయ॥

### 102. రాగము - ఆదితాళము

జయమంగళం నిత్య - శుభమంగళమ్
సీతాదేవికి - జయమంగళమ్॥
జానకీదేవికి మముఁ గన్నతల్లికి ॥జయ॥

వేదములు పఠియించు - విప్రునివాక్కున
వేదవతి యగుచు - వెలసిన తల్లికి ॥జయ॥

కులసతుల బాధించు - కూళయౌ దశకంఠు
కులముఁ గూలఁద్రోయు - కువలయనేత్రకు ॥జయ॥

జనకుఁడు యజ్ఞముఁ - జలుపఁగ ధర దున్న
జననమందినయట్టి - జగదేకమాతకు ॥జయ॥

చెఱఁబడ్డ పతివ్రతలఁ - జెఱ విడిపింపఁ దాఁ
జెఱలోనఁ జొచ్చిన - సీతాపెరాట్టికి ॥జయ॥

ఏకశిలాపురి నెలమిని వసియించి
లోకులఁ బాలించు - లోలవిలోకనుకు ॥జయ॥

దాసులహృదయని - వాసిని యగుచు మా
వాసుదాసునిఁ గన్న - వారిజనేత్రకు ॥జయ॥

## చామరము

### 103. భైరవి - రూపకతాళము

చామర వీవరే రమణులు - చామర వీవరే
చామర వీవరె - సారసవదనలు
సామజవరదుఁడౌ - స్వామి రామునకు ॥చామర॥

ఇందిరారమణుఁడై - బృందారకుల కెల్ల
మందలఁ గూర్చిన - మందరధరునకు ॥చామర॥

రాతి నాతిగఁ జేసి - రాలు తేలగఁ జేసి
కోఁతులు భటులుగఁ - గొమరొప్పు స్వామికి ॥చామర॥

ఏకశిలాపుని - నెలమిని వసియించి
లోకులఁ బాలించు - శ్లోకచరితునకు ॥చామర॥

వాసుదేవుఁడగుచు - వాసుదాసు నేలు
హాససుందరవద - నారవిందునకు ॥చామర॥

## నృత్యము

### 104. శంకరాభరణము - ఆదితాళము

నారాయణ భజనామృతపానము
సారెకుఁ జేయుట యెన్నఁటికో
శ్రీరఘుపతి పదసేవక కోటిలోఁ
జిందులు ద్రొక్కుట యెన్నఁటికో ॥నారాయణ॥

వరహరిభక్తుల - పదములపైఁ బడి
ప్రణతులు చేయుట యెన్నఁటికో
నిరతము నరహరి - హరి కృష్ణ మాధవ
నీవే గతి యను టెన్నఁటికో ॥నారాయణ॥

హరిదాసులఁ ది - వ్యాంఘ్రుల రజమును
శిరమునఁ దాల్చుట యెన్నఁటికో
పరమగు సాధ్వుల - పాదపరాగము
ఫాలమునం దిడు టెన్నఁటికో ॥నారాయణ॥

హరిమయమంచును - నఖిలజగమునకుఁ
గరములు మోడ్చుట యెన్నఁటికో
పురుషుల నందఱ - హరిరూపము లని
పరికించుట నే - నెన్నఁటికో ॥నారాయణ॥

తరుణుల నందఱ ధరణీసుత లని
కరములు మోడ్చుట యెన్నఁటికో
పరఁగుచు నేఁ బసి - పాపని రీతిని
నిరతము దిరుగుట యెన్నఁటికో ॥నారాయణ॥

భయమును సిగ్గును - బాఱఁగఁదోలుచు
వర్తిల్లుట నే నెన్నఁటికో

నయమున హృదయము – నం గల సీతా
నాథునిఁ గాంచుట యెన్నఁటికో ॥నారాయణ॥

అంజలిపాత్రుఁడ – నగుచును హాయిగ
నెంజిలి వీడుట యెన్నఁటికో
కుంజరవరదుని – గుణములఁ బాడుచుఁ
గుప్పిగంతు లిడు టెన్నఁటికో ॥నారాయణ॥

ఆశాంబరుఁడను – నాశారహితుఁడ
నగుచును దిరుగుట యెన్నఁటికో
దాశరథే భవ – దాశరథా యని
తాండవమాడుట యెన్నఁటికో ॥నారాయణ॥

కన్నుల నీళ్లులు – కాల్వలు పాఱఁగ
సన్నుతించు టిఁక నెన్నఁటికో
చన్నుఁగుడుచు తమ – చిన్నిపాపఁడని
యన్నులు చూచుట – యెన్నఁటికో ॥నారాయణ॥

వాస్తవ మీతఁడు – వాసుదాసుఁ డని
భక్తులు వలుకుట యెన్నఁటికో
సిస్తుగ వీఁడు నా – సేవకుఁ డనుచును
శ్రీపతి తలఁచుట యెన్నఁటికో ॥నారాయణ॥

**105.** రాగము – ఏకతాళము

గోవింద నందనందన – కోటిమదనసుందరా
కోటిమదనసుందరా – హాటకాంచితాంబరా ॥గోవింద॥

రామచంద్ర భూమిపాల – కామితార్థదాయకా
కామితార్థదాయకా – ఖండితారినాయకా ॥గోవింద॥

ఏకశిలానగరవాస - శ్రీకరా మహీధరా
శ్రీకరా మహీధరా - శేషతల్ప శ్రీధరా ॥గోవింద॥

వాసుదాసవరద శ్రీని - వాస లోకపాలకా
వాసు! లోకపాలనా - దాసలోకలాలనా ॥గోవింద॥

## గీతము

### 106. కల్యాణిరాగము - అటతాళము

నీవు నాకుఁ దోడులే - నిన్ను వీఁడి పోనులే
నీవు నాకుఁదోడైయుండ - నెవరితోడ నేమి కార్యము ॥నీవు॥

పరుల వేఁడఁ బోనులే - వరముఁ గోర రానులే
కరులు హరులు - సిరులు సరులు మరులు గొల్ప లేవులే ॥నీవు॥

బక్కవేల్పు గొల్వలే - చక్కఁ జిక్కినావులే
నక్కతోఁక పట్టుకొంచు - నదిని దాఁటఁబోనులే ॥నీవు॥

దారి తప్పిపోనులే - దాసుఁడ నైనానులే
కోరి కోరి నీదు సేవ - కుదిరి నిలిచినానులే ॥నీవు॥

వాసుదేవుఁడ వీవులే - వాసుదాసుఁడ నేనులే
వాసిగా మన యిద్దఱకును - బాంధవంబు కుదిరెలే ॥నీవు॥

### 107. రాగము - ఆదితాళము

సీతావల్లభ - శ్రీకర రామా
ప్రీతిగ నేలుమ - యోరి రామా ॥సీతా॥

దశరథపుత్రక - యోరి రామా
దశముఖమర్దన - యోరి రామా ॥సీతా॥

రారా ముద్దులయ్య రామా
రారా బంగరుకొండ రామా ॥సీతా॥

రారా నాయిలు - వేలుప రామా
ఈరా నా కొక - ముద్దు రామా ॥సీతా॥

వాసవసోదర - యోరి రామా
వాసుదాసనుత - యోరి రామా ॥సీతా॥

ఏకశిలాపతి - యోరి రామా
మా కీవే గతి - యోరి రామా ॥సీతా॥

**108.** (నామము) నాటకురంజి - ఏకతాళము

రామచంద్ర - పాహిమాం, రామభద్ర - పాహిమామ్
పామజరక్షక - పాహిమాం, సాధుజనావన - పాహిమామ్ ॥
దశరథనందన - పాహిమాం, దశముఖమర్దన - పాహిమామ్
పశుపతివరసఖ - పాహిమాం, కుశలవజనక - పాహిమామ్
సీతావల్లభ - పాహిమాం, చిన్మయదేహా - పాహిమామ్
గీతాచార్యా - పాహిమాం, పీతాంబరధర - పాహిమామ్
బృందావనచర - పాహిమాం, నందసునందన - పాహిమామ్
బృందారకనుత - పాహిమాం, సుందరవిగ్రహ - పాహిమామ్
కాళియమర్దన - పాహిమాం, కాలయవనహర - పాహిమామ్
పాలితగోకుల - పాహిమాం, వాసుదాసనుత - పాహిమామ్

## మంగళము

**109.** సౌరాష్ట్రరాగము - అటతాళము

శ్రీరామచంద్రనకును - సిద్ధశుభమంగళమ్
అమరారినిచయములను - హరియించు మూర్తికి ॥శ్రీరా॥
మిథిలాధినాథతనయా - హృదయనివాసునకును ॥శ్రీరా॥
జగదంతరాత్మ యగుచుఁ - బొగడొందు స్వామి ॥శ్రీరా॥
నిరతైకశైల నగర - నిత్యనివాసికి ॥శ్రీరా॥

# ఏకాంత సేవ

## ప్రార్థన

### 110. నారాయణస్తుతి

నారాయణ నారాయణ నారాయణ నారాయణ
నారాయణ నారాయణ జయ రఘువీర హరే ॥ధ్రువము॥
అఖిలచరాచరకాయా, అబలాతనుకృతమాయా ॥నారా॥
ఇంద్రారాధితచరణా, ఇనవంశనృపాభరణా ॥నారా॥
ఉరగాకల్పితతల్పా, ఉరరీకృతనతజల్పా ॥నారా॥
ఋషి వేషా ఋషిచర్యా, ఋషిసమ్మత శుభకార్యా ॥నారా॥
ఏకశిలాపురవాసా, ఇంద్రమణీద్యుతిభాసా
ఐరావతనిభకీర్తీ, అఖిలారాధితమూర్తీ
ఓంకారాత్మకరామా, ఉర్వీదుఃఖవిరామా
ఔర్వానలనిభకోపా, అవధారిత శివచాపా
అంగీకృతఋషిపూజా, అయుతాహర్పతితేజా
కమలాలయకృతవక్షా, ఖరముఖదైత్యవిపక్షా
గరుడవిహంగమవాహా, ఘననిభమేచకదేహా
చంద్రదివాకరనేత్రా, చారుగుణావళిపాత్రా
ఛాయాధవకులదీపా, స్వర్ణాంకితశివరోపా
జనకసుతాహృచ్చోరా, సంపాలితమునివారా,
ఝంఝానిలసమవేగా, సంరక్షితమునియాగా,
జ్ఞానానందాకారా, సంక్రందన మణిహారా,
టంకారభిదారిహృదా, లంకాంతక శివసుహృదా ॥
తరుణీకృతపాషాణా, ధరణీభరణారీణా ॥
దరధరకృష్ణమురారీ, దండితసర్వసురారీ ॥
దశరథరాజకుమారా, దాసావన వ్రతశూరా,

ధాటీకంపితలోకా, దారితమునిజనశోకా,
నరనారాయణవేషా, నరహరి మధురసుభాషా,
పర్యంకీకృతశేషా, పరిదారితనతదోషా ॥
ఫణివరగర్వవిదారా, పదకృతవనసంచారా ॥
బహుళీకృతనిజరూపా, పరిపాలిత గోగణగోపా ॥
భ్రమరాయితమృదుకేశా, భక్తజనాఘవినాశా ॥
యదుకులజలధిశశాంకా, అమరాహితహృట్టంకా ॥
రామా రాజలలామా, రాజీవాంబకధామా ॥
లాలితవేణువినోదా, పాలితవిబుధామోదా ॥
వాసుకవీశ్వరవరదా, పరిభంజితమదద్విరదా ॥
శయనీకృతశేషాహి, జలజాంబక! మాం పాహి ॥
శరణీకృత జలధామా, శర్వాణీనుతనామా ॥
షడమలశక్తిసమేతా, సంసారార్ణవపోతా ॥
సాగరకన్యారమణా, క్ష్మాజనరక్షాప్రవణా ॥
హాటక మయపరిధానా, అమలినసుగుణనిధానా ॥
క్ష్మావామాభ్యుద్ధారా, కలికల్మషసంహారా ॥
భరతార్పిత భూభారా, పాలితసేవకవారా ॥
కోసలరాజతనూజా, గుణవన్నరసురభూజా ॥
సేవక సంఘాధ్యక్షా, స్త్రీజనతాం పరిరక్ష
ఏకశిలానగరాలయ, లోకావన మాం పాలయ ॥నారా॥

### 111. శంకరాభరణరాగము - ఏకతాళము

జనని జానకమ్మ జనకుఁడు రాముఁడు
మన కేమి తక్కువ - సఖులారా
పినతండ్రు లైరి సౌమిత్రులు భరతుఁడు
మన కేమి తక్కువ హితులారా ॥జనని॥

చనవారు చుట్టము సంజీవరాయఁడు
మన కేమి తక్కువ సఖులారా
అనుఁగుఁదోడు లైరి హరిదాసులందఱు
మన కేమి తక్కువ హితులారా ॥జనని॥

కరభూషణము టెంకాయచిప్పగ నయ్యె
నా కేమి తక్కువ సఖులారా
నరసింహాచార్యులు పరమదేశికు లైరి
నా కేమి తక్కువ హితులారా ॥జనని॥

అక్షయపాత్ర నా కాధారముగ నయ్యె
నా కేమి తక్కువ సఖులారా
లక్షచింపుల గోఁచి - లక్షాధికారిని
నా కేమి తక్కువ హితులారా ॥జనని॥

రామతీర్థమె నాకుఁ - బ్రాణాధారము
నా కేమి తక్కువ సఖులారా - ఈ
భామారత్నములెల్లఁ - బాలిచ్చు తల్లులు
నా కేమి తక్కువ - హితులారా ॥జనని॥

వాసుదేవు కరుణ - వాసుదాసుఁడ నైతి
నా కేమి తక్కువ - సఖులారా
దాసానుదాసుల - దాసుఁడ నైతిని
నా కేమి తక్కువ - హితులారా ॥జనని॥

ఏకశిలేశ్వరుఁ - దేలికగా నయ్యె
నా కేమి తక్కువ - సఖులారా
క్ష్మాకన్యాధవ - శరణార్థి నైతిని
నా కేమి తక్కువ - హితులారా ॥జనని॥

## 112. నాదనామక్రియరాగము - ఆదితాళము

దశరథనందన నమోనమో
దశముఖభంజన నమోనమో
దాసోహం తవ దాసోహమ్
దాసోహం తవ దాసోహమ్
వారిధిలోచన నమోనమో
వారిధిబంధన నమోనమో ॥దాసోహం॥

వారణశిక్షక నమోనమో
వారణరక్షక నమోనమో ॥దాసోహం॥

క్షేమాపాదక నమోనమో
రామామోదక నమోనమో ॥దాసోహం॥

నీరధిశయనా నమోనమో
నీరజనయనా నమోనమో ॥దాసోహం॥

అరిదరసుందర నమోనమో
కరధృతమందర నమోనమో ॥దాసోహం॥

పోషితసురవర నమోనమో
దూషితసురవర నమోనమో ॥దాసోహం॥

నరమృగరూపక నమోనమో
హరికులదీపక నమోనమో ॥దాసోహం॥

కరిపతివరదా నమోనమో
హరిపతివరదా నమోనమో ॥దాసోహం॥

## శరణు

### 113. ధన్యాసి – త్రిశ్రగతి

శరణు శరణు శరణు శరణు శరణు రమేశ
శరణు శరణు శరణు శరణు శరణు శరణు పరమేశ ॥
చేయలేను వ్రతము జపము సేవలనైనఁ జేయలేను
పూజ భజన జేయలేనయ్యా ॥శర॥

చేతులెత్తి మ్రొక్కువాఁడఁ జేరరావయ్యా నీతలంపున నన్ను
నెపుడు నిలుపఁగదయ్యా తనువు పుట్టి భవపయోధి మునిఁగె
గదయ్యా । వనరువాఁడ మునిఁగి తేలి పడవ కావయ్యా॥శర॥

పాపిని నీవు చీ పొమ్మటంచుఁ గోపగించకు నీ పాదముల
విడువఁ జుమ్ము నిక్కముగ నమ్మా ॥శర॥

న క్షమామి నీవటన్న న త్యజామి యందు
త్వా క్షిపామి నీవటన్న దాసోహ మనుదు ॥శర॥

నాదుజనని జానకమ్మ నీదు నామంబు ।
ఆదుకొనంగ నేను వెరువ నీదు కోపమును ॥శర॥

వాసుదాసుఁడ నీవు నన్ను ద్రోసిపుచ్చకు ।
వాసుదేవుఁ డనెడి పేరు వ్యర్థము సుమ్ము ॥శర॥

## తలుపు

### 114. తలుపుతీయుపాట – ఆదితాళము

తలుపులు దీయఁగఁ – దరుణీరత్నమ
ధరణీనందిని రావే – వేగ – తరుసీరత్నమ రావే ॥తలుపులు॥

తలుపులు దీయఁగఁ – బిలిచెద వెవఁడవు
పలుకవోయి నీపేరు – దేవా – పలుకవోయి నీపేరు॥తలుపులు॥

హరియందురె నను - హరిణాయతేక్షణ
హరియింతునె పంకముల - సీతా - హరియింతునె॥తలుపులు॥

హరివై పంకము - హరియించెదేనియు
నరుగుము మింటికి దేవా - వేవే యరుగుము ॥తలుపులు॥

చక్రపాణి నే - సారసలోచన
వక్రత యేటికే భామా - యీ - వక్రత యేటికె ॥తలుపులు॥

చక్రపాణివై -సాగెదవేనియుఁ
జక్కని కుండలఁదేరా - ఓయీ - చక్కనికుండలఁదేరా॥తలుపులు॥

గోవిందుఁడనని - కోవిదు లందురె
కోప మేటికే భామా - యింత - కోపమేటికే భామా॥తలుపులు॥

గోవిందుఁడవేన్ - గోవుల మేపఁగ
గొల్లవాడకై పొమ్మా - దేవ - గొల్లవాడకై పొమ్మా ॥తలుపులు॥

శంఖధారి నే - సారసలోచన
శంక యేటికే భామా - యీ - శంక యేటికే భామా॥తలుపులు॥

శంఖధారివేన్ - జాగంటను గొని
చక్కఁబొమ్ముభిక్షింప - వీధులఁ - జక్క బొమ్ముభిక్షింప॥తలుపులు॥

మాధవుఁ డనుచును - మానిని పిలుతురె
మానవులెల్లను - నన్నున్ - మానవులెల్లను నన్నున్॥తలుపులు॥

మాధవుఁ డగుచును - మలసెదవేవియు
బ్రాఁకులపాలైపొమ్మా - పెను - బ్రాఁకులపాలైపొమ్మా॥తలుపులు॥

ధరణీధరుఁడను - దడయఁగనేటికే
తలుపునుదీయవెభామా - వే - తలుపునుదీయవెభామా॥తలుపులు॥

ధరణీధరుఁడై - తనరెదవేనియు
ధరణిక్రిందికినిబొమ్మా - దేవా - ధరణిక్రిందికినిబొమ్మా॥తలుపులు॥

ఏకశిలాపురి - నెలమి వసించెడి
కాకుత్థ్సుండపు సీతా - రఘు - కాకుత్థ్సుండనె సీతా ॥తలుపులు॥

ఏకశిలాపురి వాసుదాసుఁడే
నాకును నీకును సాక్షి - సీతా - మన కిర్వురకు సాక్షి॥తలుపులు॥

తప్పులుచేసితిఁ - దడయక రమ్మా
తలుపుదీసెదనురామా - వేగ - తలుపుదీసెదనురమ్మా
వేగ - తడయకలోపల రమ్మా ॥తలుపులు॥

తప్పులు మనలోఁ - దనరునె యెప్పుడు
మెప్పేయిదియౌఁగొమ్మా - నను - దయ నేలుము ముద్దుగుమ్మా॥తలుపులు॥

## పవళింపు

### 115. కల్యాణిరాగము - అటతాళము

రామయ్య - పవళింపవయ్యా - మా
భూమిజతోడుతఁ - బూసెజ్జమీఁద ॥రామయ్య॥

అరసి లోకము - లన్ని నీవు - చాల
నలసినావు స్వామి యిఁక విశ్రమింపు ॥రామయ్య॥

వింజామరను గొని కేల - మా
కంజలోచన సీత - వీచుచున్నదియు ॥రామయ్య॥

సన్నజాజుల రేకు లేరి - మంచి
పన్నీరు గూరిచి - పఱచినా మయ్యా ॥రామయ్య॥

వాసుదాసుఁడు నీదుకీర్తి - యెంతో
భాసిల్ల జగములఁ - బాటలు పాడ ॥రామయ్య॥

## నిదుర

### 116. మోహనరాగము - రూపకతాళము

నిద్దుర పోనియ్యవే - ఓ జానకి
నిద్దుర పోనియ్యవే -
నిద్దుర పోనిమ్ము నీకుఁ బుణ్యమగును -
సద్దుచేయకు మెంతో - శ్రమపడియున్నాఁడు ॥నిద్దుర॥

ముద్దులు పెట్టుచు - సుద్దులు సెప్పుచు
గద్దతితనమునఁ - గారింపకుము రాము ॥నిద్దుర॥

చెక్కిలి గిల్లుచు - నొక్కుచు మోవిని
చక్కిలిగింతల - శ్రమము పెట్టకు తల్లి ॥నిద్దుర॥

వాసుదాసుఁడు నీపై - బాటలు బాడుచు - మీ
వాసి వెలయించును - వసుధలోనఁ దల్లీ ॥నిద్దుర॥

## జోల

### 117. శ్రీరాగము - అటతాళము

జో కరుణాలవాల - జో కనకచేలా
జో కమలాలోల - జో ముద్దుబాలా ॥జోజో॥

పాలవారిధిఁ బాఁప - పానుపు వీడి
కూళలౌ రాక్షసుల - కోటిఁ దునుమాడి
పాలింప లోకంబు - వాంఛను గూడి
హేళివంశమునఁ బుట్టి - తిల మాయఁ గూడి ॥జోజో॥

జలజసంభవ రుద్ర - సన్నుతపాద
జలజనేత్రా వినత - సమ్మదాపాదా

లలితపీతాంబరా - కలితసమ్మోదా
దళితభక్తవ్రాత - హృదయగతఖేద ॥జోజో॥

వాసుదేవ వినీల - వారిదశ్యామా
వాసుదాసావనా - భంగురకామా
భాసుర జలజాత - బంధుకులసోమ
వాసిగా ననుఁ బ్రోవు - పట్టాభిరామ ॥జోజో॥

## 118. శ్రీరాగము - అటతాళము

జోజో జోజో - విమలకాంచనవేల
జోజో జోజో - కమలాహృదయలోల ॥జోజో॥

వరగుణునిఁ బ్రహ్లాదు - బాధించు దుశ్శీలు
నరసింహమూర్తివై - నఱకిన నాస్వామి ॥జోజో॥

మకరినోటికిఁ జిక్కి - మల్లాడు కరిరాజు
వికలతఁ గనకుండ - వేగఁ గాచిన శౌరీ ॥జోజో॥

అమరుల యమృతము - హరియించి బలిమిని
శ్రమపెట్టు నసురుల - సంహరించిన దేవ ॥జోజో॥

మోహినీవేషంబు - ముదముతో ధరియించి
మోహింపఁ జేసితివి - పురహరరాక్షసుల ॥జోజో॥

ఏకశిలాపురి - కేతెంచి సేవకులఁ
బ్రాకటముగఁ గాచు - వాసుదాసవరద ॥జోజో॥

## లాలి

## 119. ఆనందభైరవి రాగము - అటతాళము

లాలి రామన్నలాలీ - ననుఁ గన్న బాలగోపాల లాలీ
పాలితామరవరాలీ - నానోము - పంట శ్రీరామ లాలీ

హెచ్చిసంద్రమునఁజొచ్చి - మీనమై - వద్రుచ్చుసోమకునిఁద్రుంచి
తెచ్చి వేదముల నెల్ల - నజునకు - నిచ్చిన దేవ ॥లాలి॥

పాలింప దేవచయము - మందరము - కేలిమై లీలఁ దెచ్చి
పాలవారిధినిద్రచ్చి - యమృతంబు - బంచుకూర్మంబ లాలీ॥లాలి॥

కనకనేత్రుండు ధరను - గర్వమున - వనధిలోపల ముంపఁగా
ఘనవరాహంబ వైన - ననుఁగన్న - జనక శ్రీరామా లాలీ ॥లాలి॥

నీదాసుఁ బ్రహ్లాదుని - జనకుండు - నిర్దయత హింసింపఁగా
ఆదానవునిఁ ద్రుంపఁగా నరసింహ - మైన నా స్వామి॥లాలి॥

పొట్టిబాలుండ వగుచు - బలిరాజుఁ - గిట్టి మూఁడడుగు లడిగి
మిట్టి ముల్లోకములను - శక్రునకుఁ - గట్టిన శౌరి ॥లాలి॥

నరపతులుదుర్మదమున - బ్రాహ్మణులఁ - బరమ బాధలుపెట్టఁగాఁ
బరశురాముఁడ వగుచు - రాజులను - బఱచు బ్రహ్మంబ॥లాలి॥

వారిజాక్షులను బలిమిఁ - జెఱపట్టి - వారి శీలముఁ జెఱుపఁగా
నారావణుని వంశము - నణఁప నవ - తారమౌ రామ॥లాలి॥

ధర్మమెది యె దధర్మమో - తెలియక - ధర్మసం దేహ మొదవ
ధర్మంబు బోధింపఁగా - దేవకీ - తనయుఁడౌ కృష్ణ లాలీ॥లాలి॥

భక్తి లేనట్టి కర్మ - పద్ధతులఁ బ్రభులు పశుహింస సేయ
రక్తి నాహింస మాన్ప - బుద్ధుఁడై - రాజిల్లు దేవ లాలీ॥లాలి॥

కలియుగంబున దుష్టులు - వేదోక్త - కర్మధర్ములఁ దిట్టి
చెలఁగిధర్మముచెఱుపఁగా - వారలను - బొలియించుకల్కి॥లాలి॥

నాముద్దులయ్య లాలీ - ననుఁగన్న - నాభాగ్యమూర్తి లాలీ
పామరవిధూరలాలీ - దీనజన - పక్షపాతాత్మ ॥లాలి॥

వాసుదాసునిఁ బ్రోవఁగ - నేకశిలా - వాసము గ్రహియించుచు
నీసేవకత్రాతవై - లోకమున - వాసి గను రామ ॥లాలి॥

### 120. శ్రీరాగము - ఆదితాళము

రామ లాలీ - వననిధి - ధామ లాలీ
సామజ రక్షక జితశత - కామ లాలీ ॥రామ॥

బంగారుతొట్టెలో నీవు - పవ్వళింపరా
అంగనామణు లెల్ల నిన్ను - హాయి నూఁచెదరు ॥రామ॥

ఆడి యాడి సఖులతోడ - నలసినావురా
పాడుచు నేఁ జిచ్చికొట్టెదఁ - బవ్వళింపరా ॥రామ॥

ఊరక నీ వేల తండ్రి - యులికిపడియెదవు
సారెకు గజరాజు మొఱలు - సలుప లేదు ॥రామ॥

జలజలోచన యెవ్వతె యేనియుఁ - బిలువలేదు
కలఁడా చూపు మంచు నెవరు - కలహమాడరు ॥రామ॥

వాసుదాసుఁడు నీదు సేవ - వదలకున్నాఁడు
దాసులెల్ల నీదు కొలువునఁ - దనరియున్నారు ॥రామ॥

## నీరాంజనము

### 121. కమాజురాగము - అటతాళము

అమరులఁ బాలించు - నరవిందలోచన మంగళం జయమంగళం
అమలదాసహృదయాబ్జని కేతన మంగళం జయమంగళం
దారితదానవదర్ప ధరాధర మంగళం జయమంగళం
వారితగంభీరవారాశివిస్మయ మంగళం జయమంగళం
ఖరదూషణాది రాక్షసబల నాశన మంగళం జయమంగళం
నరసుర యక్షవానరలోకపాలక మంగళం జయమంగళం

ఏకశిలావాస - యింద్రమణీభాస మంగళం జయమంగళం
ప్రాకటశీల శ్రీ - వాసుదాసార్చిత మంగళం జయమంగళం

**122.** ముఖారిరాగము - అటతాళము

మంగళము జానకీహృదయాబ్జభానునకు
మంగళము త్రైలోక్యపాలకునకు
మంగళము రావణఖరాదిసంహరునకు
మంగళము కౌసల్యనందనునకు
జయమంగళం సదా శుభమంగళం ॥

నీలనీరదవర్ణ మంజుతరకాయునకు
పాలితాఖిల సురనికాయునకును
నాళీకభవరుద్ర నతపదాబ్జాతునకు
నాళీకహితవంశ పావనునకు ॥జయమంగళం॥

కరిరాజుఁ గాచిన కరుణాంతరంగునకు
సురరాజుఁ బ్రోచిన సుందరునకు
గిరిరాజు మోచిన కీర్తితబలాఢ్యునకు
నగరాజుగా నున్న యవ్యయునకు ॥జయమంగళం॥

వాసి నేకశిలాఖ్య పట్టననివాసునకు
దాసరక్షణకలాధన్నుకును
వాసుదాసార్చిత పాదకంజాతునకు
రాసలీలాలోల రమ్యునకును ॥జయమంగళం॥

**123.** రూపకరాగము - అటతాళము

మంగళమో రామభద్ర - మహితగుణ దయాసముద్ర
కదనమునకు వృత్రుఁ జంపఁ - గదలు హరికి నెట్టిమంగళ
మదితి గలుగ రక్ష సలిపె - నట్టిమంగళ మమరు నీకు॥మంగ॥

వామనుండయి బలిని గెలువఁ - బయనమైన సుతున కంబ
యేమంగళ మమరఁ బలికె - నామంగళ మమరు నీకు॥మంగ॥

వైనతేయుఁడు సుధను దేర - బయలు దేఱ వినత శుభము
దేని బలికె నట్టి శుభము మానక నీ కగుత మెపుడు ॥మంగ॥

వాసుదాస హృదయలోల - దాసజనావనసుశీల
వాసవార్చితపదసరోజ - భాసిలు నీకు నెల్లశుభము ॥మంగ॥

## పరాకు

### 124. ధన్యాసిరాగము - ఆదితాళము

పరాకు శ్రీరఘు రామచంద్ర హరి
పరాకు శశి వదనా
పరాకు రాఘవ పరాకు సీతా - భావవిమలసదనా ॥పరాకు॥

పురహర హరిహయ ముఖ సురవందిత - పరాకు రఘువీరా
శరకర మురహర - సారసలోచన - పరాకు నగధీరా॥పరాకు॥

భక్తకోటులకుఁ - గల్పవృక్షమా - పరాకు కరిగమనా
సూక్తులు విని మము - సుందర ప్రోవుము
శుక్రశిష్యదమనా ॥పరాకు॥

ఏకశిలాపుర వాస - రఘూత్తమ
శ్రీకర పరాకు - రామా
క్ష్మాకన్యాహృద - యేశ్వర రావణ - మర్దన పరాకు రామా ॥పరాకు॥

## హెచ్చరిక

### 125. బేగడ - అటతాళము

కరుణాకర సుగుణాకర - సరసీరుహనయనా
దురితాపహ సుకృతావహ - సరసాంబుధిశయనా

మురఘుస్మర పురఘుస్మర - హిత కాంచనవసనా
అరివారణ మదవారణ - లీలా హెచ్చరిక ॥కరు॥

వాణీధవగౌరీధవ - పరిపూజితచరణా
బాణాసురకరకృంతన - చణసాధనధరణా
వీణాముని వరసంస్తుత వినతాఖిల శరణా
పాణౌకృత ధరణీవర - బాలా హెచ్చరిక ॥కరు॥

సరసీరుహ తులసీదళ - జాలాంకిత వక్షా
సరసీరుహ హితవంశ్యమ - సారాంచిత దేహ
కరసారస పరిశోభిత - కాండాసనబాణా
ధరణీవర తనయార్దన - లీలా హెచ్చరిక ॥కరు॥

## శలవు

### 126. మోహనరాగము - అటతాళము

సెలవా రఘురామా - మా కిప్పుడు
సెలవా గుణధామా ॥

సెలవా మా కిప్పుడు - చిన్మయ శుభధామ
సెలవిమ్ము వేకువనే - కొలువ వచ్చెదమయ్య ॥సెలవా॥

కస్తియిడితిమి చాల - సిస్తుగఁ బవళింపు
స్వస్తి గావుత నీకు - వారిజలోచన ॥సెలవా॥

చాల గాసిపడితి - పూలపానుపుమీఁద
లీలగఁ బవళింపు - హేళివంశదీప ॥సెలవా॥

పోయివత్తుము చాలఁ - బ్రొద్దుపోయెను నీకు
మాయపరాధముల - మన్నించి కరుణింపు ॥సెలవా॥

ఇంటిలో మగవార - లింతసేపా యని
కంటగించి మమ్ముఁ - గసరి కొట్టెదరయ్య ॥సెలవా॥

వాసిగ శ్రీవాసు - దాసు బిడ్డలము
దోసిలియొగ్గెదము - దోస మెంచకుమయ్య ॥సెలవా॥

**సంపూర్ణము**